# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 4 - సంచిక 8 మే 2026 వెల : రూ.15

భారతదేశ ప్రజలమైన మనం.. మౌనం వీడాలి.. గొంతు విప్పాలి

ఏ ఆకాంక్షలకీ రికార్డు స్థాయి పోలింగ్‌లు!

బొద్దింకల గర్జన 'కాక్రోచ్ జనతా పార్టీ' కథ!

'కాక్రోచ్ జనతా పార్టీ' ఒక వ్యాఖ్య నుంచి పుట్టిన రాజకీయ రూపకం

మారిన రాజకీయం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం

చమురు-ప్రపంచ ఆర్థిక వ్యవస్థ

సంపద పునః పంపిణీ జరగాల్సిందే

మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్

వ్యక్తిగత పొగడ్తలు, కీర్తి కాంక్షలపై మార్క్స్ వైఖరి శిరోధార్యం

ఫాసిజం అంటే నియంతృత్వానికి మించి!

జీవన వ్యవస్థగా మారుతున్న ఫాసిజం

మతతత్వ ఫాసిజాన్ని ప్రశ్నించిన కథలు

బౌల్ కవిత్వం - సమతా గానం

సాహితీరంగ కొవ్వొత్తి ఏటుకూరి

ఎర్రజెండా హసాద్ ఏటుకూరి ప్రసాద్!

ఒక అరుణతార గగనమెక్కె...

పురోగామి చింతానాశీలుర ఐక్యతా దిశగా అరసం మహాసభలు

అరసం రాష్ట్ర సభల ఐక్యతా రాగం..

అలుపెరుగని అభ్యుదయ సాహిత్య ప్రయాణం

కలం గళంతో చైతన్యం రగలాలి !

మే - 2026

పేజీలు : 46

# దారి దీపం

మాసపత్రిక

సంపుటి : 4 - సంచిక : 8

డి.వి.వి.యస్.వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

## ఈ సంచికలో..

1. భారతదేశ ప్రజలమైన మనం.. మౌనం వీడాలి.. గొంతు విప్పాలి - సంపాదకీయం 3
2. ఏ ఆకాంక్షలకీ రికార్డు స్థాయి పోలింగ్‌లు! - రాహుల్‌కుమార్ 4
3. బొద్దింకల గర్జన 'కాక్రోచ్ జనతా పార్టీ' కథ! - టి.నాగరాజు 6
4. 'కాక్రోచ్ జనతా పార్టీ' ఒక వ్యాఖ్య నుంచి పుట్టిన రాజకీయ రూపకం -మార్పు శరత్ 8
5. మారిన రాజకీయం.. ప్రమాదంలో ప్రజాస్వామ్యం - ప్రొ.జి.హరగోపాల్ 9
6. చమురు-ప్రపంచ ఆర్థిక వ్యవస్థ - ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ 11
7. సంపద పునః పంపిణీ జరగాల్సిందే - వెలుగూరి రాధాకృష్ణమూర్తి 13
8. మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్ - జగన్ ఆర్‌సిఎస్ 15
9. పొగడ్తలు, కీర్తి కాంక్షలపై మార్క్స్ వైఖరి శిరోధార్యం - పి.ప్రసాద్ 21
10. ఫాసిజం అంటే నియంతృత్వానికి మించి! - డి.రమేష్ పట్నాయక్ 22
11. జీవన వ్యవస్థగా మారుతున్న ఫాసిజం - ఎస్.గోవిందరాజులు 24
12. మతతత్వ ఫాసిజాన్ని ప్రశ్నించిన కథలు - రాఘవ 25
13. బౌల్ కవిత్వం - సమతా గానం - డా.జె.రవీంద్రనాథ్ 27
14. సాహితీరంగ కొవ్వొత్తి ఏటుకూరి - ఆర్వీ రామారావు 30
15. ఎర్రజెండా హసాద్ ఏటుకూరి ప్రసాద్! - మందలపర్తి కిషోర్ 32
16. ఒక అరుణతార గగనమెక్కె... - పెనుగొండ లక్ష్మీనారాయణ 34
17. పురోగామి చింతానాశీలుర ఐక్యతా దిశగా అరసం మహాసభలు - పి.పి.శాస్త్రి 35
18. అరసం రాష్ట్ర సభల ఐక్యతా రాగం - రాఘవ 38
19. అరసం నూతన కార్యవర్గం 40
20. తిరుపతి అరసం మహాసభలు.. కొన్ని తీర్మానాలు 41
21. అలుపెరుగని అభ్యుదయ సాహిత్య ప్రయాణం - రాచపాళెం చంద్రశేఖరరెడ్డి 42
22. కలం గళంతో చైతన్యం రగలాలి ! - కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ 43




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

దారి దీపం
మాసపత్రిక
మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను.. డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు నంబరుకు విధిగా వాట్సాప్ మెసేజ్ పెట్టండి. ఫోన్ నెంబరు 93971 14495

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**



# భారతదేశ ప్రజలమైన మనం మౌనం వీడాలి.. గొంతు విప్పాలి

**భా**రత ప్రజలమైన మనం అంటే కేవలం ఒక దేశ జన సమూహం మాత్రమే కాదు. మనం భారత రాజ్యాంగానికి కర్తలం. రాజ్యాంగ పీఠిక "భారతదేశ ప్రజలమైన మనం"తో ప్రారంభమవుతుంది. ఈ రాజ్యాంగాన్ని మనకు మనం సమర్పించుకుంటున్నాం"తో ముగుస్తుంది. మనమే రాజ్యాంగానికి అధినాథులం. ప్రభుత్వాలే దేశాన్ని నడిపిస్తున్నట్లు పైకి కనిపిస్తుంది. అది వాస్తవం కాదు. దేశాన్ని నడిపించేది రాజ్యాంగమే. రాజ్యాంగం నిర్దేశించిన ప్రకారమే ఎన్నికలు జరుగుతాయి. ప్రభుత్వాలు ఏర్పడతాయి. అవి సర్వ స్వతంత్రమైనవి కావు. రాజ్యాంగానికి లోబడి మాత్రమే పరిపాలన సాగించాలి. రాజ్యాంగం ప్రకారం సుప్రీంకోర్టు ఏర్పడింది. దానికి చట్టాలు చేసే అధికారం లేదు. ప్రభుత్వాలు చేసే చట్టాలు రాజ్యాంగబద్ధం కాకపోతే వాటిని రద్దు చేస్తుంది. ప్రజల ప్రాథమిక హక్కులను కాపాడే రక్షణ కవచంగా వుంటుంది. అలాగే స్వతంత్ర ప్రతిపత్తిగల రాజ్యాంగ సంస్థలు ప్రభుత్వ ఆదేశాలకు లోబడకుండా రాజ్యాంగ బద్ధంగానే వ్యవహరించాలి.

రాజ్యాంగ లక్ష్యాలను క్రోడీకరించి రూపొందించిన పీఠిక ఈ కింది అంశాలను స్పష్టం చేస్తున్నది. ఒకటి భారతదేశాన్ని సార్వభౌమ, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్ర రాజ్యంగా నిర్మించడం. రెండు దేశ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం అందించడం. మూడు భావ ప్రకటన స్వేచ్ఛను, మత ఆరాధనా స్వేచ్ఛను కల్పించడం. నాలుగు దేశ సమైక్యత, సమగ్రతల కోసం సౌభ్రాతృత్వాన్ని పెంపొందించడం. ఈ రాజ్యాంగ లక్ష్యాలను, ప్రజాస్వామ్య విలువలను ప్రజలు ప్రత్యేకంగా యువతరం ఆకళింపు చేసుకోవాలి. ఈ విలువల ప్రజా చైతన్యం మీద మన రాజ్యాంగ భవిష్యత్తు, ప్రజాస్వామ్యం మనుగడ ఆధారపడి వుంటాయి. ఇప్పుడు ఈ విలువలు దిగజారుతున్నాయి. మసకబారుతున్నాయి. వీటిని పెంపొందించడం తక్షణ అవసరం.

"రాజ్యాంగం ఎంత మంచిదైనా దానిని అమలు చేయాల్సిన వారు చెడ్డ వారైతే అది చెరుపు చేస్తుంది" అని అంబేద్కర్ చేసిన హెచ్చరికను మనం గుర్తించుకోవాలి. ఇప్పుడు దేశంలో ఈ పరిస్థితినే చూస్తున్నాం. మన దేశం ఏం చేయాలో నిర్ణయించే అధికారం ట్రంపుకు అప్పజెప్పి మన సార్వభౌమాధికారాన్ని తాకట్టు పెట్టడం చూస్తున్నాం. అలాగే సామ్యవాద నియమాలు దారి తప్పి సంపద కేంద్రీకరణే పాలకుల ఏకైక లక్ష్యం అయ్యింది. హిందూత్వ విభజన రాజకీయంతో లౌకికవాదం బలహీనపడడం చూస్తున్నాం. సామాజిక, ఆర్థిక న్యాయం స్థానంలో సామాజిక విభజన, విద్వేషం, అసమానతల భారతదేశాన్ని మనం చూస్తున్నాం.

సౌభ్రాతృత్వం సాధించడానికి బదులు మత విద్వేషంతో విభజన రాజకీయం నడుస్తున్నది. దళితులు మహిళలు మైనారిటీలపై దాడులు, హత్యలు బెదిరింపులు నిత్యకృత్యాలయ్యాయి. పౌరహక్కులపై దాడి, ప్రశ్నించే వారిపై దాడులు, జైళ్లు చూస్తున్నాం. ప్రజాస్వామ్యానికి ప్రాణప్రదమైన ఎన్నిక నిర్వహణ తంతు చూస్తున్నాం. ఓటర్లు ప్రభుత్వాలను ఎన్నుకునే పద్ధతి స్థానంలో ప్రభుత్వాలే ఓటర్లను నిర్ణయించే పరిస్థితి వచ్చింది. కులం, మతం, డబ్బు, అధికారంతో ఎన్నికల గెలుపు కోసం అడ్డదారులు విచ్చలవిడిగా సాగిపోతున్నాయి. ఈ నేపథ్యంలో రాజ్యాంగ విలువలు ప్రజాస్వామ్య పద్ధతులపై ప్రజల్ని, యువతను జాగృతం చేయాలి. రాజ్యాంగం మీద, ప్రజాస్వామ్యం మీద, పౌరహక్కుల మీద ప్రత్యక్షంగా పరోక్షంగా జరుగుతున్న దాడులను ప్రతిఘటించాలి. దీనికోసం భారత ప్రజలమైన మనం మౌనం వీడాలి. గొంతు విప్పాలి. అందుకు అందరూ సిద్ధం కావాలి. ❑

- డి.వి.వి.యస్.వర్మ, సంపాదకులు, 85006 78977

# ఏ ఆకాంక్షలకీ రికార్డు స్థాయి పోలింగ్‌లు!



- రాహుల్‌కుమార్

**భా**రత ప్రజాస్వామ్యం అంత సంక్లిష్టమైంది మరొకటి లేదు. అలాగే దాని విశిష్టతలకూ కొదవలేదు. అక్షరాస్యత, రాజకీయ చైతన్యం అంతంతమాత్రంగా ఉన్న భారత్ లాంటి దేశంలో ప్రజాస్వామ్యం విజయవంతం కాదని 1950ల్లో ఎన్నో వ్యాఖ్యానాలు వచ్చాయి. ప్రజలందరికీ ఒకేసారి సమాన హక్కులను కల్పించటం దుస్సాహసమనే విమర్శలూ వెలువడ్డాయి. అప్పట్లో చాలా సహేతుకం అన్పించిన ఆ వ్యాఖ్యానాలూ, విమర్శలూ కాలపరీక్షకు నిలవలేకపోయాయి. అక్షరాస్యత అంతంతమాత్రమే అయినా ప్రజలు ఓట్లు వేయటానికి ఉత్సాహం చూపారు. మొదటి సార్వత్రిక ఎన్నికల్లో 46 శాతం మంది ప్రజలు ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఆనాటికి దేశంలో అక్షరాస్యత 15 శాతానికి కాస్త అటూ ఇటూగానే ఉంది. స్వాతంత్ర్య ఉద్యమానికి సారథ్యం వహించిన చరిత్రతో కాంగ్రెస్ కీర్తి ఘనంగా వెలిగిపోతున్న నేపథ్యంలో ప్రజలు ఆనాడు రాజకీయ పరిణతిని ప్రదర్శించారు. 489 స్థానాలకు ఎన్నికలు జరిగితే కాంగ్రెస్‌ను 364 చోట్లే గెలిపించారు. మిగతా స్థానాల్లో ప్రతిపక్ష పార్టీలకూ, స్వతంత్ర అభ్యర్థులకూ పట్టంకట్టారు. కాంగ్రెస్ పార్టీకి పడిన ఓట్లు 45 శాతం దాటలేదు. తొలి ఎన్నికల్లో 46 శాతం మంది పాల్గొనటం కూడా అప్పట్లో ఒక రికార్డు. అమెరికా పౌరులు కూడా అంతటి రాజకీయ చైతన్యాన్ని ప్రదర్శించలేదు. 1948 నాటికే దాదాపు వంద శాతం అక్షరాస్యతను అమెరికా సాధించింది. అయినా ఆ ఏడాది అక్కడ జరిగిన ఎన్నికల్లో 52 శాతం మంది మాత్రమే ఓటింగ్‌లో పాల్గొన్నారు. నిజానికి ఆ నాటికి అక్కడ అన్ని వర్గాల వారికీ ఓటు వేసే హక్కుల్లేవు. రకరకాల కారణాలతో పలు రాష్ట్రాల్లో నల్ల జాతీయులకూ, స్థానిక ఆదిమ వాసులకూ, మహిళలకూ ఓటు హక్కును నిరాకరించారు. ఆ పరిమితులు ఉన్నా అక్కడి అక్షరాస్యతతో పోల్చితే ఓటింగ్ శాతం తక్కువేనని చెప్పాలి. ఏ రూపంలోనూ, ఏ వర్గానికీ ఓటుహక్కుని నిరాకరించని దేశంగా భారత్ 1950 నాటికి ప్రపంచంలోనే విశిష్టస్థానాన్ని సంపాదించింది.

వాగ్దానాలు చేసినట్లుగా జీవితాల్లో ప్రగాఢ మార్పులను తీసుకురాలేని రాజకీయాలు ఉన్నచోట ప్రజల్లో కొంత నిరాసక్తత వ్యక్తంకావటం సహజం. కానీ ఆ నిరాసక్తతను ప్రదర్శించకుండా ప్రజలు ప్రతి ఎన్నికల్లో అధికంగా ఓటింగులో పాల్గొనటం మన దేశంలోనే బాగా జరుగుతోంది. ఇటీవల ముగిసిన అయిదు రాష్ట్రాల ఎన్నికల్లో నమోదైన పోలింగ్ శాతాలే అందుకు





నిదర్శనం. సగటు పోలింగ్ 89.85 శాతం నమోదైంది. 2007 – 2026 మధ్య రాష్ట్రాల అసెంబ్లీలకు జరిగిన ఎన్నికల్లో ఓటింగ్ సరళిని పరిశీలిస్తే పోలింగ్ గణనీయంగా పెరిగిన పరిస్థితే కనపడుతోంది. మేఘాలయ, మిజోరాం, నాగాలాండ్ లాంటి చిన్న రాష్ట్రాల్లో మాత్రమే స్వల్ప తగ్గుదల కనపడింది. పెద్ద రాష్ట్రాల్లో పంజాబ్ మినహా ఎక్కడా ఈ పరిస్థితి లేదు. 2007లో జరిగిన పంజాబ్ అసెంబ్లీ ఎన్నికల్లో 76.04 శాతంగా నమోదైన పోలింగ్ 2022 నాటికి 72.15 శాతానికి తగ్గిపోయింది.

పోలింగ్ శాతాలనూ ఎన్నికల్లో పార్టీలు ప్రకటిస్తున్న వాగ్దానాలనూ చూస్తే ఒకటి స్పష్టంగా అర్థమవుతోంది. ప్రజల కోరికలూ ఆకాంక్షలూ పెరుగుతున్నాయి. వాటికి అనుగుణంగా పార్టీల వాగ్దానాలు, నగదు బదిలీల హామీలు అధికం అవుతున్నాయి. కులం, మతం అనేవి టిక్కెట్ల పంపిణీలో, ఓటర్లను సమీకరించటంలో ఇంకా గట్టి పాత్రను పోషిస్తున్నా అవే ఎన్నికల ఫలితాలను నిర్ణయించే ప్రబలశక్తులుగా లేవు. నగదు బదిలీలు, సబ్సిడీలు, ఇళ్ల నిర్మాణాలు, స్థలాల కేటాయింపు వంటివి ఓటర్లకు ప్రధానంగా మారాయి. వాటిని అధికంగా వాగ్దానం చేసే పార్టీలవైపు మొగ్గటం ఒక ప్రధాన ధోరణిగా 1990ల తర్వాత బాగా ఎక్కువగా కనిపిస్తోంది. సినిమా గ్లామర్ లాంటివి జనంలోకి చొచ్చుకువెళ్లటానికి తోడ్పడుతున్నా, ప్రజలు కోరుకునే ఉచితాలనూ సంక్షేమ పథకాలనూ పెద్ద ఎత్తున అమలు చేస్తామని హామీలు ఇవ్వకుండా ఎన్నికల్లో గెలిచే పరిస్థితి లేదు. తమిళనాడు ఎన్నికల్లో 108 స్థానాలు గెలుచుకున్న సినీ నటుడు విజయ్ స్థాపించిన టీవీకే పార్టీ కూడా పెద్దఎత్తున ఆ తరహా హామీలను ఇవ్వాల్సి వచ్చింది. వాటిని నిజాయితీగా అమలు జరిపితే

ఏడాదికే అక్కడ రూ.90 వేల కోట్లు అదనంగా ఖర్చు పెట్టాలి. జనాకర్షక పథకాలతో ఖజానాలు ఖాళీ అవుతున్నాయనీ అప్పుల ఊబిలోకి ప్రభుత్వాలను నెట్టివేస్తున్నాయనీ ఆర్థికవేత్తలూ వ్యాఖ్యాతలూ ఎన్ని హెచ్చరికలు చేస్తున్నా పార్టీలు వాటిని పట్టించుకునే స్థితిలో లేవు. అంతకంటే ముఖ్యంగా వాటిని తగ్గిస్తే ఉపేక్షించటానికి ప్రజలు సిద్ధంగా లేరు. తాత్కాలిక ఉచితాలతో వారెందుకు సరిపెట్టుకుంటున్నారు? దీర్ఘకాలిక ప్రయోజనాలను కలిగించే పథకాలకు ఎందుకు ఆకర్షితులు కావటం లేదు? అని ప్రశ్నించుకుంటే మన ఆర్థిక వ్యవస్థ నడుస్తున్న తీరునూ ప్రభుత్వాలు దాన్ని ప్రభావితం చేస్తున్న వైనాన్నీ లోతుగా పరిశీలిస్తే వీటికి కొంతైనా జవాబు దొరుకుతుంది.

1990ల తర్వాత ఆర్థిక వ్యవస్థలో ప్రభుత్వ రంగ సంస్థల పాత్ర గణనీయంగా తగ్గిపోయింది. ప్రైవేటు రంగంలో వ్యాపారాలనూ పరిశ్రమలనూ ఆరంభించటానికి ప్రభుత్వ అనుమతులు రావటం చాలా సులభమైంది. వాటికి చౌకగా భూములను కేటాయించటం, రాయితీ ధరలకు కరెంటు సరఫరా చేయటం, పన్నుల్లో మినహాయింపులు ఇవ్వటం, రుణాల వెసులుబాటును బాగా పెంచటం పెద్ద ఎత్తున మొదలయ్యాయి. ఇదే తరహా ప్రోత్సాహకాలను విదేశీ పెట్టుబడిదారులకు కల్పించటం ఆరంభించారు. వీటన్నిటి ఫలితంగా ఆర్థికవృద్ధి రేటు బాగా పుంజుకుంది. 1990లకు ముందు ప్రభుత్వపరమైన అనేక కట్టడులతో, నియంత్రణలతో ఆర్థిక వ్యవస్థ ఆశించినంత వేగంగా కదలలేకపోయింది. ఉత్పత్తుల్లో వైవిధ్యం లేకుండా పోయింది. అందుబాటులో వున్న వస్తువులూ పరిమితంగా ఉండేవి. కొత్త సాంకేతిక పరిజ్ఞానాలను ప్రవేశపెట్టటం చాలా ఆలస్యమూ అయ్యేది. ప్రపంచ మార్కెట్‌లో లభ్యమయ్యే వస్తువుల్లో చాలా వరకూ దేశంలో దొరికేవి కావు. ఆర్థిక సంస్కరణలతో ఈ పరిస్థితి మొత్తం మారిపోయింది. ప్రపంచ మార్కెట్‌లో లభ్యమయ్యే వినియోగ వస్తువులన్నీ ఇప్పుడు భారతదేశంలో అందుబాటులో ఉన్నాయి. వీటిని కొనుగోలు చేసే మధ్య తరగతి సంఖ్యా బాగా పెరిగింది.

ఈ మార్పులన్నిటినీ అయిదు పదుల వయస్సు దాటిన వాళ్లందరూ ప్రత్యక్షంగా చూశారు. 1997 తర్వాత పుట్టిన జెన్–జీ తరానికి అంతకు ముందున్న ఆర్థిక జీవితం గురించి పెద్దగా తెలియదు. ప్రతి విషయాన్ని స్మార్ట్ ఫోన్ల ద్వారానే తెలుసుకునే వారికి సామాజిక మార్పులను గ్రహించే అవకాశం ఉండటం లేదు. విరామం లేకుండా వచ్చిపడే తాజా సమాచార భారాన్ని మోయటానికే సతమతమయ్యే తరానికి గతంలోకి తొంగిచూడటం కష్టమైన పనైపోయింది. సామాజిక మార్పులను క్రమపద్ధతిలో అర్థం చేసుకోవటం ఒకపట్టాన సాధ్యం కావటం లేదు. అవగాహనలో పరిమితులు ఎన్ని ఉన్నా ఆర్థిక వ్యవస్థలో వచ్చిన మార్పులు కొత్త వస్తువులను, కొత్త సేవలను పొందాలన్న తహతహలను జెన్–జీ తరంలో విపరీతంగా పెంచాయి. ఈ తహతహ నగర, పట్టణ ప్రాంతాలకే పరిమితం కాలేదు. గ్రామాలను చుట్టు ముట్టేస్తోంది. హుందాగా, సౌకర్యంగా జీవితాన్ని గడపటానికి అత్యవసరమైనవన్నీ అందులో ఉన్నాయి. ఒకప్పుడు పైవర్గాలే మొబైల్ ఎక్కువగా వాడేవారు. ఇప్పుడది అందరికీ అవసరమైన పరికరం అయిపోయింది. అది లేకపోతే అనేక సేవలూ, వస్తు పంపిణీలూ స్తంభించిపోయే పరిస్థితి వచ్చింది. అట్టడుగు వర్గాలకు కూడా స్మార్ట్ ఫోన్ లేకపోతే ఉపాధి ముందుకు వెళ్లే పరిస్థితి లేదు. ప్రైవేటు స్కూళ్లల్లో చదివి మంచి ఉద్యోగం సంపాదించాలన్న ఆకాంక్ష.. చిన్న వ్యాపారంలోనైనా కుదురుకుని పైకి ఎదగాలన్న కోరిక.. సొంత వాహనాన్ని పొందాలన్న తపన.. అట్టడుగు జెన్–జీ తరంలో కూడా బలంగా పాదుకున్నాయి. ఇలాంటి తపనలను తీర్చేందుకు తగిన ఆదాయాన్నీ ఉపాధినీ సమకూర్చేలా ప్రభుత్వ విధానాలు సమగ్రంగా ఉంటే ఎన్నికలప్పుడు విపరీత ఉచిత వాగ్దానాలను ఇవ్వాల్సిన పరిస్థితి తలెత్తేది కాదు. ఆర్థిక వ్యవస్థలో సంపద పెరుగుదల లేకపోవటం ఇక్కడ ప్రధాన సమస్యకాదు. ఆ పెరుగుదలలో సముచిత భాగం కింది వర్గాలకు చేరుకోకపోవటమే అసలు సమస్య. జాతీయాదాయంలో 58 శాతం 10 శాతం ప్రజల చేతుల్లోకి వెళుతోంది. దిగువనున్న 50 శాతం ప్రజలకు దక్కేది 15 శాతానికి మించటం లేదు. అలాగే దేశ సంపదలో ఒక్కశాతం ప్రజల చేతుల్లో ఉన్నది చాలా ఎక్కువ. 40 శాతం సంపద ఆ ఒక్క శాతం చేతుల్లో పోగు పడింది. గతంతో పోలిస్తే 40 శాతంగా ఉన్న మధ్య తరగతి ప్రజల జీవితాలు కొన్ని విషయాల్లో చాలా మెరుగుపడ్డాయి. దాన్ని కాదనలేం. కానీ పెరిగే జాతీయాదాయంలో వాళ్లు పొందే వాటా తగ్గిపోతోంది. 1980ల నాటికి జాతీయాదాయంలో వాళ్ల వాటా 44 శాతం దాకా ఉంటే ఇప్పుడది 30 శాతానికి పడిపోయింది. సంపద వాటాలోనూ ఇదే పరిస్థితి ఉంది. మొత్తం దేశ జనాభాను ఎగువ తరగతి (10 శాతం), మధ్య తరగతి (40 శాతం), అట్టడుగు తరగతి (50 శాతం)గా విభజించి ఆదాయ, సంపదల్లో ఆ తరగతులకు ఎంతెంత దక్కుతుందో చెప్పటానికి వరల్డ్ 'ఇనీక్వాలిటీ లాబ్' పెద్ద కసరత్తే చేసింది. ఆ కసరత్తుతో ఒక విషయం స్పష్టంగా తెలుస్తోంది. పెరిగే ఆదాయంలో, సంపదలో అట్టడుగు, మధ్యతరగతి ప్రజల వాటా తగ్గిపోవటాన్ని అరికట్టలేని స్థితికి దేశ రాజకీయ నాయకత్వం చేరుకుంది. మరోవైపు కోరికలు, ఆకాంక్షలు ఈ వర్గాల్లో సముచిత రీతిలో పెరుగుతున్నాయి. ఉచితాలు, సబ్సిడీలు, నగదు పంపిణీలపై ఆశగా ఎదురు చూడటానికి ఇదే ప్రధాన కారణం.

ప్రజాస్వామ్యంలో ఈ రెండు వర్గాలను ఉపేక్షించి రాజకీయాలు చేయటం సాధ్యం కాదు. పార్టీలు వివిధ తాయిలాలతో ఈ వర్గాలను తాత్కాలికంగా **(మిగతా 7వ పేజీలో)**

# బొద్దింకల గర్జన 'కాక్రోచ్ జనతా పార్టీ' కథ!


- టి.నాగరాజు



ప్రపంచ రాజకీయాల్లో ఇప్పుడు ఒక కొత్త దశ ప్రారంభ మైంది. పాతకాలం లాగా పార్టీ కార్యాలయాల ముందు క్యూలు కట్టి సభ్యత్వాలు తీసుకునే యువతకంటే, సోషల్ మీడియా మీమ్స్, సెటైర్లు, వైరల్ వీడియోలు, డిజిటల్ ప్రచారాల ద్వారా తమ అసంతృప్తిని వ్యక్తం చేసే తరం ముందుకు వస్తోంది. భారతదేశంలో "కాక్రోచ్ జనతా పార్టీ" వంటి వ్యంగ్య రాజకీయ ధోరణులు ఎలా వెలుగులోకి వచ్చాయో చూస్తే, దానికి సమాంత రంగా నేపాల్‌లో జరిగిన జెన్‌జీ యువజన ఉద్యమాలు గుర్తుకొ స్తాయి. అక్కడ యువత అవినీతి, నిరుద్యోగం, పాత రాజకీయ కుటుంబాల ఆధిపత్యంపై తిరుగుబాటు చేస్తే, ఇక్కడ యువత సోషల్ మీడియా వ్యంగ్యాన్ని రాజకీయ ఆయుధంగా మార్చుకుం టోంది. నేపాల్‌లో కొన్నేళ్లుగా యువత సంప్రదాయ పార్టీలపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. రాజ్యాంగ మార్పుల తర్వాత ప్రజల జీవితాల్లో గణనీయమైన మార్పు రాకపోవడం, ఉద్యోగ అవకాశాల కొరత, భారీ ఎత్తున విదేశీ వలసలు, ఇవన్నీ యువ తలో తీవ్ర అసహనాన్ని పెంచాయి. ఖాఠ్మాండూ కేంద్రంగా పెరి గిన డిజిటల్ యాక్టివిజం, టిక్‌టాక్, ఫేస్‌బుక్ లైవ్, యూట్యూబ్ వంటి వేదికలు రాజకీయ చర్చలకు కేంద్రాలయ్యాయి.

పాత పార్టీలు ప్రజల సమస్యలను పట్టించుకోవడం లేదనే భావన బలపడింది. దీంతో యువత సంప్రదాయ రాజకీయ భాషను తిరస్కరించి, వ్యంగ్యం, మీమ్స్, వీధి నిరసనలు, డిజిటల్ ప్రచారాలను ప్రధాన ఆయుధాలుగా ఉపయోగించడం ప్రారం భించింది. భారతదేశంలోనూ పరిస్థితి అంత భిన్నంగా లేదు. విద్య ప్రైవేటీకరణ, నిరుద్యోగం, పరీక్ష పత్రాల లీకులు, కార్పొరే ంట్ ఆధిపత్యం, మీడియా కార్పొరేటీకరణ, ఇవన్నీ యువతలో తీవ్ర అసంతృప్తిని పెంచుతున్నాయి. ఆ అసంతృప్తి నేరుగా రాజకీయ పార్టీల రూపంలో కాకుండా, ముందుగా డిజిటల్ వ్యంగ్య రూపంలో బయటపడుతోంది. "కాక్రోచ్ జనతా పార్టీ" వంటి పేర్లు కేవలం నవ్వు కోసం పుట్టినవి కావు. అవి పాలక వ్యవస్థల వైఫల్యాలపై యువత వేసిన రాజకీయ ఆరోపణలు.

ప్రజాస్వామ్యంలో ప్రజలే యజమానులు అంటారు. కానీ, అధికార కుర్చీలపై కూర్చున్న వారి భాష చూస్తే మాత్రం ప్రజలు యజమానులు కాదు, పాలకుల దృష్టిలో కేవలం "సహించాల్సిన భారాలు" అన్న భావన స్పష్టంగా కనిపిస్తోంది. నిరుద్యోగం, విద్యా సంక్షోభం, పరీక్షల అవినీతి, కార్పొరేట్ దోపిడీ, సామాజిక అసమానతలతో అల్లాడుతున్న యువత ప్రశ్నిస్తే, సమాధానాలు



చెప్పాల్సిన వ్యవస్థలు వారినే "బొద్దింకలు", "పారసైట్లు" అంటూ అవమానించే స్థాయికి దిగజారడం దేశ ప్రజాస్వామ్యానికి ప్రమా ద ఘంటికలే. అత్యున్నత న్యాయస్థాన పీఠం నుంచే ఇటువంటి వ్యాఖ్యలు రావడం యాదృచ్ఛికం కాదు. ఇది ఈ దేశ పాలక వర్గాల మానసిక స్థితికి ప్రతిబింబం. ప్రశ్నించే యువతను దేశ భవిష్యత్తుగా కాకుండా, ఇబ్బందికరమైన "కీటకాలు"గా చూసే అహంకారం పెరుగుతూనే ఉంది. ఆర్టీఐ కార్యకర్తలు, ఉద్యమకా రులు, నిరుద్యోగులు, హక్కుల కోసం పోరాడే వారిని వ్యవస్థకు శత్రువుల్లా చిత్రీకరించడం ఇప్పుడు కొత్తేమీ కాదు. కానీ, ఈసారి యువత కూడా మౌనంగా ఉండలేదు. డిజిటల్ యుగానికి తగ్గట్టు అదే వ్యంగ్యాన్ని ఆయుధంగా మార్చుకుంది.

"అవును, మేమే బొద్దింకలం. మీ అవినీతి, మీ అహంకారం, మీ కుళ్లిన రాజకీయాల మధ్య కూడా బతికి పోరాడగల జాతి మాది" అంటూ సోషల్ మీడియాలో యువత తిరుగుబాటు మొదలుపెట్టింది. అణుబాంబు పడ్డా బతికే జీవిగా బొద్దింకకు ఉన్న గుర్తింపునే ప్రతిఘటన చిహ్నంగా మలచుకోవడం వెనుక ఒక లోతైన రాజకీయ సందేశం ఉంది. వ్యవస్థ ఎంత అణచివేసి నా యువత పూర్తిగా మౌనమవదనే హెచ్చరిక అది. ఇదే సమ యంలో మహారాష్ట్రలోని శంభాజీనగర్‌కు చెందిన యువకుడు అభిజీత్ దీప్కే సోషల్ మీడియాలో వ్యంగ్యంగా విసిరిన "కాక్రోచ్ జనతా పార్టీ" ఆలోచన ఒక్కసారిగా దేశవ్యాప్తంగా వైరల్ కావడం గమనార్హం. సాధారణంగా సోషల్ మీడియాలో ట్రెండ్లు

వచ్చి పోతుంటాయి. కానీ, ఈ సారి పరిస్థితి భిన్నంగా మారింది. కేవలం సరదా వ్యంగ్యంగా మొదలైన ఈ ప్రయోగం వేలాది మంది యువత ఆవేదనకు వేదికగా మారింది. కొద్ది గంటల్లోనే వేలాది మంది సభ్యత్వం కోసం దరఖాస్తు చేయడం, వెబ్‌సైట్ సర్వర్లు క్రాష్ కావడం, ట్విట్టర్, ఇన్‌స్టాగ్రామ్ వంటి వేదికల్లో భారీ స్పందన రావడం, ఇవన్నీ కేవలం "మీమ్ కల్చర్"గా తీసిపారేయలేని పరిణామాలు. ప్రధాన రాజకీయ పార్టీలపై యువతలో పెరిగిపోతున్న అసహనం, నిస్పృహ, విసుగు ఈ స్పందన వెనుక కనిపిస్తున్న అసలు కారణాలు.

ఇంకా ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, ఈ పార్టీ మ్యానిఫెస్టో యువతను ఆకర్షించేలా ఉండటం. న్యాయవ్యవస్థలో పారదర్శకత, పదవీ విరమణ చేసిన న్యాయమూర్తులకు రాజకీయ పదవుల రూపంలో ఇచ్చే "రివార్డుల" సంస్కృతికి వ్యతిరేకత, మహిళలకు యాభై శాతం రిజర్వేషన్లు వంటి అంశాలను వ్యంగ్యంతో కలిపి ప్రస్తావించడం వల్ల ఇది కేవలం ట్రోల్‌స్థాయిలోనే ఆగిపోలేదు. వ్యవస్థలపై యువతకు ఉన్న అసంతృప్తి రాజకీయ రూపం దాల్చే అవకాశం కూడా ఉందనే సంకేతాలు ఇచ్చింది. ఈ పరిణామం చూసిన తర్వాత సంబంధిత న్యాయమూర్తి "నా వ్యాఖ్యలను మీడియా వక్రీకరించింది", "ఫేక్ డిగ్రీలు ఉన్నవాళ్లనే అలా అన్నాను" అంటూ వివరణ ఇవ్వడం మరింత హాస్యాస్పదంగా మారింది. మొదట అవమానించడం, తర్వాత ప్రజా వ్యతిరేకత పెరిగాక మాట మార్చడం, ఇది అధికార వ్యవస్థల పాత రాజకీయమే. సోషల్ మీడియా యుగంలో ప్రజలు అంత తేలికగా మర్చిపోవడం లేదు. ప్రతి వ్యాఖ్య, ప్రతి అవమానం వెంటనే ప్రజాచర్చగా మారుతోంది.

ఈ దేశంలో యువత ఎదుర్కొంటున్న అసలు సమస్యలు మాత్రం రోజురోజుకీ తీవ్రమవుతున్నాయి. చదువుకున్నా ఉద్యోగం లేదు. ఉద్యోగం వచ్చినా భద్రత లేదు. పరీక్షలు రాస్తే పేపర్ లీకులు. ప్రభుత్వ రంగం క్షీణత. ప్రైవేటీకరణ దాడులు. మరోవైపు కార్పొరేట్ అనుకూల విధానాలు. ఈ పరిస్థితుల్లో యువతలో పెరుగుతున్న కోపం ఇప్పుడు వ్యంగ్య రాజకీయాల రూపంలో బయటపడుతోంది. ప్రపంచవ్యాప్తంగా ఇలాంటి ధోరణులు కనిపిస్తున్నాయి. సంప్రదాయ రాజకీయాలపై విసుగు చెందిన కొత్తతరం వ్యంగ్యం, మీమ్స్, డిజిటల్ క్యాంపెయిన్ల ద్వారా నిరసన తెలుపుతోంది. అధికార భాషను తిరగరాసి అదే ఆయుధంగా మార్చుకుంటోంది. "కాక్రోచ్ జనతా పార్టీ" కూడా అదే తరహా డిజిటల్ తిరుగుబాటు. బొద్దింకల బొమ్మలతో టీషర్టులు వేసుకుని యువత వీధుల్లోకి రావడం, నీటి శుద్ధి కార్యక్రమాలు చేయడం, మీమ్స్ ద్వారా వ్యవస్థలను ఎండగట్టడం, ఇవన్నీ చూస్తే ఇది కేవలం సరదా కాదని అర్థమవుతోంది. ప్రజల సమస్యలపై స్పందించని రాజకీయ పార్టీలకు, ప్రజలను అవమానించే అధికార వర్గాలకు ఇది స్పష్టమైన హెచ్చరిక. ఈ "కాక్రోచ్ జనతా పార్టీ" నిజంగా రాజకీయ శక్తిగా ఎదుగుతుందా? లేక డిజిటల్ ఆగ్రహంగా మిగిలిపోతుందా? అనేది కాలమే నిర్ణయిస్తుంది. కానీ ఒక విషయం మాత్రం స్పష్టం. సామాన్యుడిని కీటకంగా చూడడం మొదలుపెట్టిన వ్యవస్థలు చివరకు ప్రజల కోపానికే బలవుతాయి. చరిత్ర కూడా అదే చెబుతోంది. ప్రశ్నించే యువతను బొద్దింకలు అంటున్న పాలక వర్గాలు గుర్తుంచుకోవాలి, కుళ్లిన వ్యవస్థలను ముందుగా గుర్తించేది కూడా బొద్దింకలేనని! ❑

**(నవ తెలంగాణ సౌజన్యంతో)**

## ఏ ఆకాంక్షలకీ రికార్డు స్థాయి పోలింగ్‌లు!

**(5వ పేజీ తరువాయి)**

సంతృప్తిపరచటానికి ప్రయత్నిస్తున్నాయి. దీన్ని కూడా చెప్పినట్లుగా చేయలేని పరిస్థితికి క్రమేపీ ప్రభుత్వాలు చేరుకుంటున్నాయి. ఈ వైఫల్యం ఎటువంటి విపరి ణామాలకు దారితీస్తుందో ఇప్పుడే కచ్చితంగా ఊహించలేం. హామీలను తీర్చలేని ప్రభుత్వాలను దించటానికీ, ఎక్కువ హామీల ను ఇచ్చే పార్టీలకు పట్టం కట్టటానికీ ప్రజలు చాలా ప్రాధాన్యం ఇస్తున్నారు. పోలింగ్ శాతమూ అందుకే పెరుగుతోంది. మరో వైపు ఎమ్మెల్యేలూ ఎంపీలుగా ఎన్నికవుతున్న వారిలో ఎగువ తరగతికి చెందిన వారే ఎక్కువగా ఉంటున్నారు. అసమానతలను సహేతుక స్థాయికి తగ్గించలేకపోవటానికి ఇదీ ఒక ప్రతిబంధకంగా మారింది. వర్గ ప్రయోజనాలను అధిగమిం చి వ్యవహరించటం అంత సులభం కాదు. ప్రకటించినట్లుగా ఉచితాలనూ నగదు పంపిణీ వాగ్దానాలనూ అమలుచేయాలంటే ఎగువతరగతి ఆదాయాలూ సంపదల్లో ఏదో విధంగా కోతలు పడాలి. అది చేయలేకపోవటం వల్లే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు తగినంతగా ఆదాయాలు సమకూరటం లేదు. అప్పుల భారంతో పరిస్థితిని నెట్టుకురావటమూ వాటికి కష్టంగా మారింది.

మతం పేరుతో, అక్రమ వలసల పేరుతో, కులాల పేరుతో ప్రజల్లో ఉద్వేగాలను కలిగించి ఎన్నికల్లో పార్టీలు గట్టెక్కొచ్చు. విన్యాసాలెన్ని చేసినా వారి ఆర్థిక ఆకాంక్షలపై ఎల్లకాలమూ శీతకన్ను వేయలేరు. అరకొర తాత్కాలిక తాయిలాలతో ఎల్లకాలమూ బుజ్జగించలేరు. ఆశించిన విధంగా అవి సాకారం కానప్పుడు జెన్-జీ తరం కొత్తదారుల్లో ఆందోళనకు ఉపక్రమించే పరిస్థితినీ నివారించలేరు. నిన్నటి రికార్డు స్థాయి పోలింగ్‌లకే అది పరిమితం కాదు. రేపు రికార్డుస్థాయి పరివర్తనలకూ అది దారితీస్తుంది. దేశంలో కొన్ని రాజకీయ పక్షాలు గణనీయంగా బలహీనపడొచ్చు. ప్రజల ఆర్థిక ఆకాంక్షలు మాత్రం బలహీన పడవు ! కొత్త రాజకీయాలకు ఊపిరులు ఊది ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టేవీ అవే ! ❑

**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# 'కాక్రోచ్ జనతా పార్టీ' ఒక వ్యాఖ్య నుంచి పుట్టిన రాజకీయ రూపకం



- మార్పు శరత్

న్యాయవ్యవస్థ, యువత అసంతృప్తి, మరియు మోడీ-షా పాలనపై పెరుగుతున్న విమర్శల విశ్లేషణ. ఇటీవల దేశ వ్యాప్తంగా సోషల్ మీడియాలో ఒక్కసారిగా వైరల్ అయిన పేరు - కాక్రోచ్ జనతా పార్టీ. మొదట ఇది చాలా మందికి సరదా వ్యంగ్య ఉద్యమంలా కనిపించింది. కానీ కొద్ది రోజుల్లోనే ఇది యువత అసంతృప్తి, నిరుద్యోగం, రాజకీయ వ్యవస్థపై పెరుగు తున్న విసుగు, ప్రజాస్వామ్య సంస్థలపై ప్రజల్లో పెరుగుతున్న అనుమానాలకు ప్రతీకగా మారింది. ఒక మంత్రి కాన్వాయ్‌ని అడ్డుకొని ప్రశ్నించే స్థాయికి ఒక ఉద్యమంలో ఎగిసింది. ఈ మొత్తం పరిణామానికి కేంద్ర బిందువుగా మారింది భారత ప్రధాన న్యాయమూర్తి (CJI) సూర్యకాంత్ చేసిన ఒక వ్యాఖ్య. సుప్రీంకోర్టులో ఒక విచారణ సందర్భంగా ఆయన "కొంత మంది నిరుద్యోగ యువకులు కాక్రోచ్‌ల మాదిరిగా వ్యవస్థపై దాడి చేస్తున్నారు" అన్న భావన వచ్చేలా వ్యాఖ్యానించారని వార్తలు వెలువడ్డాయి. ఆ వ్యాఖ్య దేశవ్యాప్తంగా తీవ్ర చర్చకు దారి తీసింది. దేశ అత్యున్నత న్యాయమూర్తి ఈ విధంగా వ్యాఖ్యానించటం చాలా మందికి మింగుడు పడలేదు. కొంత మంది ఇది బాధ్యత రాహిత్య వ్యాఖ్య అని కూడా ప్రతి విమర్శలు చేశారు. అయితే తర్వాత సీజేఐ వివరణ ఇస్తూ - తాను మొత్తం యువతను ఉద్దేశించి మాట్లాడలేదని, "నకిలీ డిగ్రీలతో వ్యవస్థలోకి వచ్చిన కొందరు వ్యక్తులను మాత్రమే విమర్శించానని" చెప్పారు. మీడియా తన వ్యాఖ్యలను వక్రీకరించిందని పేర్కొన్నారు. ఇది కొంత ఊరటే కావచ్చు కానీ అప్పటికే పరిస్థితి మారిపోయింది.

సోషల్ మీడియాలో వేలాది మంది యువకులు "మేమే ఆ కాక్రోచ్‌లు" అంటూ వ్యంగ్యంగా పోస్టులు పెట్టడం ప్రారంభించారు. నిరుద్యోగం, పరీక్షల లీకులు, కార్పొరేట్ ఆధిపత్యం, మీడియా పక్షపాతం, రాజకీయ అహంకారం వంటి అంశాలపై వ్యంగ్య మీమ్స్, పోస్టులు వెల్లువెత్తాయి. ఈ నేపథ్యంలో "కాక్రోచ్ జనతా పార్టీ" అనే ఆన్‌లైన్ వ్యంగ్య ఉద్యమం రూపుదిద్దుకుని ప్రజా ఉద్యమంగా విస్తరిస్తోంది. ఇక్కడ ఒక ముఖ్యమైన ప్రశ్న వస్తుంది : న్యాయమూర్తి వ్యాఖ్యలతో మొదలైన ఈ ఉద్యమాన్ని మోడీ-అమిత్ షా పాలనతో ఎందుకు లింక్ చేస్తున్నారు? దీనికి ప్రధాన కారణం గత కొన్నేళ్లుగా దేశంలో ఏర్పడిన రాజకీయ వాతావరణం. విమర్శకుల అభిప్రాయం ప్రకారం, నరేంద్ర మోడీ-అమిత్ షా నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం అధికారం కేంద్రీకరణ, సంస్థల స్వతంత్రతపై ప్రభావం, దర్యాప్తు సంస్థల




రాజకీయ వినియోగం, మీడియాపై పరోక్ష నియంత్రణ వంటి అంశాలపై నిరంతరం విమర్శలు ఎదుర్కొంటోంది. యువతలో నిరుద్యోగం, పరీక్షల అక్రమాలు, ప్రభుత్వ ఉద్యోగాల కొరత వంటి సమస్యలు అసంతృప్తిని పెంచుతున్నాయి. ఈ పరిస్థితుల్లో సీజేఐ వ్యాఖ్య యువతలో ఉన్న ఆగ్రహానికి ప్రతీకగా మారింది.

"ప్రశ్నించే యువతను వ్యవస్థ 'కాక్రోచ్‌లు'గా చూస్తుందా?" అనే భావన సోషల్ మీడియాలో బలపడింది. ఇంకా ఒక కారణం - ప్రస్తుతం భారత రాజకీయాల్లో వ్యంగ్యం కూడా ఒక నిరసన రూపంగా మారింది. పూర్వంలో రాజకీయ కార్టూన్లు, వ్యంగ్య రచనలు ఎంత ప్రభావం చూపించాయో, ఇప్పుడు మీమ్స్ మరియు వైరల్ క్యాంపెయిన్లు అదే పాత్ర పోషిస్తున్నాయి. "కాక్రోచ్ జనతా పార్టీ" కూడా అలాంటి డిజిటల్ రాజకీయ వ్యంగ్య ఉద్యమమే. ఈ ఉద్యమం అధికారాన్ని నేరుగా కూల్చివేయగల రాజకీయ శక్తి కాకపోవచ్చు. కానీ ఇది ఒక హెచ్చరిక మాత్రం ఖచ్చితంగా దేశ యువతలో పెరుగుతున్న విసుగు, వ్యవస్థపై తగ్గుతున్న నమ్మకం, ప్రజాస్వామ్య సంస్థలపై ఏర్పడుతున్న అనుమానాలను ఇది బయటపెట్టింది. అయితే మరోవైపు, కొందరు విశ్లేషకులు ఈ ఉద్యమాన్ని అతిగా రొమాంటిసైజ్ చేయకూడదని కూడా హెచ్చరిస్తున్నారు. సీజేఐ పూర్తి వ్యాఖ్యల సందర్భాన్ని పక్కనబెట్టి సోషల్ మీడియా ఒక భాగాన్ని మాత్రమే వైరల్ చేసిందని, ఆవేశం ఆధారంగా ప్రజాభిప్రాయాన్ని మలచడం ప్రమాదకరమని అంటున్నారు. (The Times of India) కానీ ఏ కోణంలో చూసినా ఒక విషయం మాత్రం స్పష్టంగా కనిపిస్తోంది: దేశంలో యువత ఆర్థిక, సామాజిక, రాజకీయ అసంతృప్తి ఒక కొత్త దశలోకి ప్రవేశిస్తోంది. ఆ అసంతృప్తి ఇప్పుడు మీమ్స్ రూపంలో బయట పడుతోంది. వ్యంగ్యం ఇప్పుడు కేవలం నవ్వు మాత్రమే కాదు - ఒక రాజకీయ భాషగా మారుతోంది. ఆ నవ్వుల లోంచి ఉద్యమ కుసుమాలు మొలకలు ఎత్తుతున్నాయి. ❑

# మారిన రాజకీయం..
# ప్రమాదంలో ప్రజాస్వామ్యం


- ప్రొ.జి.హరగోపాల్




ఇరవయ్యవ శతాబ్దం మొదటి ఐదు దశాబ్దాలు రెండు ప్రపంచ యుద్ధాలు, వలస పాలనకు వ్యతిరేకంగా స్వాతంత్ర్యం కోసం జరిగిన ఉద్యమాలు చరిత్రను చాలా మలుపులు తిప్పాయి. మన దేశం ఆ చరిత్రలో భాగమే. గత ఎనిమిది దశాబ్దాలుగా భారతదేశంలో రాజ్యాంగం ఆధారిత ప్రజాస్వామ్య వ్యవస్థ అమలులో ఉంది.

**స్వాతంత్ర్యోద్యమ నేపథ్యంలో వచ్చిన కొన్ని నవలల్లో మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చింది అని భావోద్వేగంతో ఒక మధ్య తరగతి పేదవాడికి చెపితే, "అయితే ఏమవుతుంది?" అని అమాయకంగా అడగడం మనోహర్ మలగాంకర్ తన 'బెండ్ ఇన్ గాంజెస్' అనే నవలలో రాశాడు. మన ప్రాంతంలో చాలా చర్చకు వచ్చిన కన్యాశుల్కంలోని జట్కా వాడు "భారతదేశానికి స్వాతంత్ర్యం రాబోతున్నది" అని గిరీశం అంటే "మన ఊరిలోని హెడ్ కానిస్టేబుల్ మారతాడా?" అన్న ప్రశ్న చాలా దూరదృష్టితో రాసిందే. సంభాషణ చాలా సాధారణ మైనదిగా కనిపించినా బలప్రయోగం లేని ఒక రాజ్యం వస్తుందా అన్న పేదవాడి ప్రశ్న అప్పటికంటే ఇప్పుడు ఎక్కువ రెలవెంట్ అనిపిస్తుంది. ప్రజాస్వామ్యం అంటే రాజ్య బలప్రయోగం మీద నియంత్రణ.**

పార్లమెంటరీ ప్రజాస్వామ్యం చాలా ఆటుపోట్లకు గురయ్యింది. మూడవ ప్రపంచ దేశాలలో ఈ మాత్రం ప్రజాస్వామ్యం కొద్ది కాలమైనా నిలువలేకపోయింది. చాలా దేశాలు నియంతృత్వం లోకి, సైనిక పాలనలోకి వెళ్లిపోయాయి. మన దేశంలో ప్రజాస్వామ్యం కొనసాగడానికి ఒక సమగ్రమైన రాజ్యాంగం తోడ్పడింది. బాబాసాహెబ్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని రూపొందించడంలో కీలక పాత్ర నిర్వహించాడనే కీర్తి ఆయనకు దక్కింది. రాజ్యాంగం మీద దాడి పెరిగిన కొద్దీ అంబేడ్కర్‌ను మననం చేసుకోవడం పెరుగుతున్నది. ఈ రాజ్యాంగంలోని ప్రాపంచిక దృక్పథం పెట్టుబడిదారీ ఆర్థిక నమూనాను ఒకవైపు అంగీకరిస్తూనే సోషలిస్టు సమాజ నిర్మాణం జరగాలని ఒక




మధ్యేమార్గ ప్రయోగాన్ని వాగ్దానం చేసింది. ధనిక వర్గాలకు పెట్టుబడిదారీ పంథా, పేద వర్గాలకు సోషలిస్టు వ్యవస్థ అన్న ఒక మార్గం వేసే ప్రయత్నం చేసింది. దేశం ఎనిమిది దశాబ్దాలుగా ఒక చిక్కు మార్గంలోనే చిక్కుకుంది.

ఏ ప్రజాస్వామ్య వ్యవస్థ అయినా పేదల ప్రస్తావన లేకుండా, అసమానతల తగ్గింపు, అందరికీ అవకాశాలు, మనుషులంతా సమానమే అన్న భావన లేకుండా నిలువడం కష్టం. అందరూ సమానమే అన్న భావనను డాక్టర్ అంబేడ్కర్ చాలా దూర దృష్టితో, ఎన్నికలలో రాజకీయంగా మనం సమానత్వాన్ని కల్పించాం. ఒక మనిషి, ఒక ఓటు, ఒకే విలువ. ఈ సమానత్వం ఆర్థిక, సామాజిక సమానత్వాన్ని సాధించకపోతే మనం ఎంతో కష్టపడి నిర్మించుకున్న ప్రజాస్వామ్య సౌధాన్ని ప్రజలు బద్దలుకొడతారు అని హెచ్చరిక చేశాడు. కానీ విచిత్రంగా సామాన్య ప్రజలు రాజ్యాంగాన్ని స్వంతం చేసుకుంటున్నారు, పాలకులు రాజ్యాంగం మీద దాడి చేస్తున్నారు.

ఎన్నికల రాజకీయాలలో రాజ్యాంగం కల్పించిన సమానత్వం డాక్టర్ అంబేడ్కర్ ఆశించిన సమానత్వ దిశలో కాక సమాజంలోని తీవ్ర అసమానతలు ఎన్నికలను నిర్దేశించడంతో పరిస్థితి పూర్తిగా మారిపోయింది. గత ఎనిమిది దశాబ్దాలలో మొదటి రెండు దశాబ్దాలలో సోషలిస్టు నమూనా లాంటి వ్యవస్థ అన్న భావజాలం ప్రచారంలో ఉండేది. కానీ క్రమక్రమంగా పెట్టుబడిదారీ వ్యవస్థ బలపడుతూ వచ్చింది. ఇందిరాగాంధీ నాయకత్వంలో ఈ వైరుధ్యం కొంత స్పష్టత పొంది సమాజంలోని అసంతృప్తి

విభిన్న ఉద్యమాలకు దారితీసింది. ఈ అసంతృప్తిని గ్రహించిన ఇందిరాగాంధీ పేదరికాన్ని రాజకీయాలలో ఒక ప్రధాన అంశం గా ముందుకు తీసుకురావడంతో ఎన్నికలలో పెద్ద ఎత్తున ఓట్లను సమీకరించుకోగలిగారు. ఆమె భావజాలం వల్ల ధనిక వర్గాల సమీకరణ బలపడడం, పేద వర్గాల ఆకాంక్షలు పెరగడం వల్ల వైరుధ్యాలు తీవ్రతరం కావడంతో సంక్షోభంలో చిక్కుకున్న ఇందిరాగాంధీ.. రాజ్యాంగంలో ప్రజలకు కల్పించిన ప్రాథమిక హక్కులను రద్దు చేసి, అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. భారతదేశంలోని 'రాజ్యాంగ ప్రజాస్వామ్యం' (కాన్స్టిట్యూషనల్ డెమోక్రసీ) ఎంత బలహీనంగా ఉందో ఒక్కసారి బయటపడింది. ఏ కారణం వల్ల ఇందిరాగాంధీ ఎమర్జెన్సీ ఎత్తివేసి ఎన్నికలు ప్రకటించిందో ఇప్పటికీ ఆ కారణాలు పూర్తిగా విశ్లేషించలేదు.

**ఆమె ఎన్నికలు ప్రకటించినప్పుడు జయప్రకాశ్ నారాయణ్, అటల్‌బిహారీ వాజ్‌పాయ్, అరుణ్‌శౌరి కలిసి ప్రతిపక్షాలు ఏం చేయాలి అని చర్చించినప్పుడు అరుణ్‌శౌరి ఎన్నికలను బహిష్కరించాలి అని ప్రతిపాదిస్తూ... "నియంత ఎప్పుడూ తన విజయాన్ని గ్యారెంటీ చేసుకోకుండా ఎన్నికలకు వెళ్లరు" అని అంటే, "ప్రజలను మనం అంత తక్కువ అంచనా వేయకూడదు. సమాజం భయంలో ఉన్నమాట వాస్తవం. జనాన్ని మనం సమీకరించగలిగితే వ్యక్తులుగా భయపడుతున్న వాళ్లే సమిష్టిలో ధైర్యాన్ని కూడగట్టుకుంటారు. భయానికి మందు సమిష్టిలోనే ఉంది" అని జయప్రకాశ్ నారాయణ్ చెప్పారని అరుణ్‌శౌరి వ్యక్తిగత చర్చలో నాతో అన్నాడు. అటల్‌బిహారి వాజ్‌పాయ్ కూడా జేపీ వాదనతో అంగీకరించడంతో ఎన్నికలలో పాల్గొనాలనే నిర్ణయం తీసుకున్నామని అరుణ్‌శౌరి అన్నాడు.**

ఎన్నికల రాజకీయ చరిత్రలో మనదేశంలో 1977లో మొదటి సారిగా ప్రజలు భయం నుంచి బయటపడి అధికార పార్టీనే కాక, వ్యక్తిగతంగా ఇందిరాగాంధీని ఓడించారు. అప్పటి వరకు బలమైన నాయకుడు లేదా నాయకత్వం కేంద్రంగా నడిచే రాజకీయాల స్థానంలో సమిష్టి నాయకత్వం అధికారంలోకి వచ్చింది. భావజాలపరంగా భిన్న భావజాలాలున్న కమ్యూనిస్టు పార్టీ, జార్జ్ ఫెర్నాండెజ్, జగ్జీవన్‌రాం, మొరార్జీ దేశాయ్, అటల్ బిహారీ వాజ్‌పాయ్, అద్వాణీ.. ఈ సమిష్టి నాయకత్వంలో భాగం. ఇంత వైవిధ్యమైన, వైరుధ్యమైన సంకీర్ణ ప్రభుత్వం ఎక్కువ కాలం నిలవలేకపోయింది. ఎన్నికలలో ప్రజలు అంత పెద్ద ఎత్తున మద్దతు ఇచ్చినా, అంత ప్రజాబలం ఉన్నా జనతా పార్టీ కూలిపోవడం వెనుక ఓట్ల రాజకీయాలకంటే భిన్న ప్రయోజనాల మధ్య వైరుధ్యాలు దేశ రాజకీయాలను ప్రభావితం చేస్తున్నదన్నది ఒక వాస్తవ అనుభవంలోకి వచ్చింది.

ఇందిరాగాంధీ రెండవసారి గెలిచినప్పుడు ఆమె రాజకీయ పరిభాషలో చాలా మార్పు వచ్చింది. ప్రధానంగా ఆమె పేదల గురించి మాట్లాడడం చాలా వరకు తగ్గించింది. భిన్న వర్గాల మధ్య వైరుధ్యాలు ఎక్కడికి దారితీస్తాయో అన్న అనుమానంతో 'దేశ సమగ్రత, సమైక్యత' అనే నినాదాన్ని ముందుకు తీసుకు వచ్చింది. దీంతోబాటు తన సోషలిస్టు భావజాలం స్థానంలో పెట్టుబడిదారీ మార్గమే ఏకైక మార్గం అనే నిర్ణయానికి రావడం, ఆమె హఠాన్మరణంతో రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రి కావడంతో రాజ్యాంగంలోని సోషలిస్టు భావజాలం గురించి మాట్లాడడం దాదాపు రద్దైపోయింది.

పెట్టుబడిదారీ పంథా నియో లిబరలిజం అవతారం తీసుకోవడంతో దానికుండే కొన్ని కనీస ప్రమాణాలు – ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించడం, ధనప్రవాహం నిరోధించడం, రాజ్యాంగ సంస్థల స్వయంప్రతిపత్తిని కాపాడడం, విశ్వవిద్యాలయాలు సృజనాత్మక సంస్థలుగా పనిచేయడం – లాంటివి కూడా పాటించలేదు. ఈ నేపథ్యంలోనే ఎన్నికల రాజకీయాల స్వభావమే మారిపోయింది. పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రజాస్వామ్యం అనే భావనను విస్తృతంగా ఉపయోగించి పెరుగుతున్న సంపదకు ఒక గౌరవాన్ని కలిగించే ప్రయత్నం చేస్తుంది. కొంతవరకు ప్రజల మద్దతును కూడగడుతుంది. నియో లిబరలిజానికి ఆ అవసరం కూడా లేకుండా పోయింది. రాజ్య స్వభావమే చాలా మార్పునకు గురయింది. సంపద జగన్నాథ రథచక్రాలలాగా ముందుకు పోతున్నది. ఇందిరాగాంధీ 1970లలో అప్పటి వైరుధ్యాల వల్ల రాజ్యాంగాన్ని తాత్కాలికంగా పక్కకు పెడితే, అప్పటి ప్రతిపక్షాలు పోరాడాయి. కాని కలిసి పనిచేయలేకపోయాయి. కనీసం జనతాపార్టీ కొంతకాలం అయినా అధికారంలోకి వచ్చింది. ఇప్పుడు అప్పటి సంక్షోభం కంటే తీవ్రమైనదైనా ప్రతిపక్షాలు కలిసే ప్రయత్నమే ముందుకు సాగడం లేదు. కలిసి ఎన్నికలలో పోటీ చేయడం సాధ్యమే కావడం లేదు. వీటిని కలపడానికి ఒక జయప్రకాశ్ నారాయణ్ వంటి నాయకుడెవ్వరూ లేరు. ఎన్నికలు సారంలోనే కాదు రూపంలో కూడా మారిపోయాయి. ఎన్నికలే ప్రజాస్వామ్యం కాదు. అవి ప్రజాస్వామ్యంలో ఒక భాగం. నిజమైన ప్రజాస్వామ్యం ప్రజాచైతన్య స్థాయిని బట్టి, నిరంతర జాగరూకతను బట్టి, సమస్యలకు సమిష్టిగా స్పందించే ఒక సజీవ పౌరసమాజం మీద ఆధారపడి ఉంటాయి. రాజ్యాంగాన్ని, ఎన్నికల వ్యవస్థని, ప్రజాస్వామ్యాన్ని ఒక మానవీయ సమసమాజ స్వప్నాన్ని కాపాడుకోవడం ఇప్పుడు చాలా అవసరం. ❑


**(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# చమురు-ప్రపంచ ఆర్థిక వ్యవస్థ



- ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

**అమెరికా-ఇజ్రాయిల్ చేస్తున్న బాంబు దాడులకు ప్రతిస్పందనగా ఇరాన్ హార్ముజ్ జలసంధిని మూసివేసింది. దాంతో ప్రపంచ ఆర్థిక వ్యవస్థ అల్లకల్లోలమై పోతోంది. అమెరికన్ డాలర్ల లెక్కలో ముడిచమురు ధరలు పెరిగి పోయాయి. దాని వెనువెంటనే ఇతర దేశాల కరెన్సీల, ముఖ్యంగా ఆసియా దేశాల కరెన్సీల విలువలు పడిపోవడం మొదలైంది. దీని ఫలితంగా సంపన్న పెట్టుబడిదారీ దేశాలలో కన్నా ఎక్కువ మోతాదులో మూడవ ప్రపంచదేశాలలో ద్రవ్యోల్బణం పెరిగిపోతోంది. ఇలా ద్రవ్యోల్బణం పెరిగిపోవడం వలన ప్రజల కొనుగోలు శక్తి హరించుకుపోతోంది. అందువలన ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ఆర్థిక మాంద్య ప్రమాదాన్ని ఎదుర్కొంటోంది. ఈ ఆర్థిక మాంద్యం సంపన్న పెట్టుబడిదారీ దేశాలలోకన్నా ఎక్కువ స్థాయిలో మూడవ ప్రపంచ దేశాలలో నెలకొంటోంది.**




చమురుకు కొరత ఏర్పడినందు వలన ఎరువుల ఉత్పత్తి తగ్గిపోయింది. దీంతో ఆ ఎరువుల కొరత ఏర్పడింది. దాని ఫలితంగా ఆహార ధాన్యాల ఉత్పత్తి దెబ్బ తింటోంది. ముఖ్యంగా మూడవ ప్రపంచ దేశాలలో దుర్భర పరిస్థితుల మధ్య శ్రామిక ప్రజానీకం చిక్కుకుపోతున్నారు.

కనుచూపు మేరలో ఈ సంక్షోభానికి ముగింపు కనిపించడం లేదు. ఈ సంక్షోభానికి దారి తీసిన చట్టవిరుద్ధమైన, అనైతికమైన యుద్ధానికి ముగింపు కానరాకపోవడమే దీనికి కారణం. స్వతంత్ర దేశాల సార్వభౌమాధికారాన్ని దెబ్బ తీసేలా రెండు 'పోకిరీ' దేశాలు – అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న నిర్వాకం ఇది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చమురు చాలా చిన్న భాగం. కాని ఆ చమురు ధరల పెరుగుదల ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఇంత స్థాయిలో అవాంతరాలు కల్పించడం అసంగతంగా కనిపిస్తుంది.

నిజానికి ప్రపంచ స్థూల ఉత్పత్తిలో ముడి చమురు విలువ మూడు శాతంకన్నా తక్కువే. 2023లో అది కేవలం 2.3 శాతంగా మాత్రమే ఉంది. అయితే తక్కిన ముడి పదార్థాలకన్నా ముడి చమురు చాలా ముఖ్యమైనది. ఇతర ముడి పదార్థాల విలువ కూడా ప్రపంచ స్థూల ఉత్పత్తిలో చాలా చిన్న భాగం మాత్రమే. సామ్రాజ్యవాద విస్తరణ, ఆక్రమణయత్నాలకు ప్రధాన కారణం ముడిపదార్థాల మీద అదుపు సంపాదించడమేనని మార్క్సిస్టు సిద్ధాంతాలు చెప్పడాన్ని చాలా మంది ఇతర రచయితలు ఈ కారణంగానే ప్రశ్నిస్తూంటారు కూడా.

'సామ్రాజ్యవాద యుగం' అన్న తన గ్రంథంలో హారీ మెగ్డాఫ్ ఈ ప్రశ్నలకు సమాధానం ఇచ్చారు. ముడి పదార్థాల విలువ చాలా తక్కువే అయినప్పటికీ, సరుకుల ఉత్పత్తి గాని, ఉత్పత్తి అనంతరం జరిగే మారకం, ఇతర లావాదేవీలు కాని ఈ ముడి సరుకులు లేకుండా జరగలేవు. అందుచేత ముడిసరుకుల విలువ తక్కువగా ఉండడం బట్టి ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో వాటి ప్రాముఖ్యత ఎంతమాత్రమూ తగ్గదు. మరోలా చెప్పాలంటే, ముడి సరుకుల మారకపు విలువను ఉత్పత్తి అయిన సరుకుల మారకపు విలువతో పోల్చినప్పుడు చాలా తగ్గించి వేసినప్పటికీ, (నిజానికి వాటి మారకపు విలువ తగ్గిపోవడం కూడా సామ్రాజ్యవాదం పుణ్యమే.) వాటి ఉపయోగపు విలువకు మాత్రం అత్యంత ప్రాధాన్యత ఉంది.

ప్రస్తుత పరిణామాలు ఈ విషయాన్నే బలపరుస్తున్నాయి. ప్రపంచ చమురు ఉత్పత్తుల్లో-ముడి చమురు మాత్రమే కాక దాని నుంచి వచ్చే వివిధ ఉత్పత్తులన్నీ కలుపుకుని– 20 శాతం మాత్రమే హార్ముజ్ జలసంధి ద్వారా రవాణా అవుతుంది. అంటే సుమారుగా అది ప్రపంచ జిడిపిలో కేవలం 0.6 శాతం మాత్రమే. మొత్తం ప్రపంచ జిడిపిలో కేవలం 0.6 శాతం రవాణా అవడానికి ఆటంకం ఏర్పడినంత మాత్రాన ప్రపంచ

ఆర్థిక వ్యవస్థలో ఇంత పెద్ద స్థాయిలో సంక్షోభం తలెత్తిందంటే చమురు వంటి ముడిసరుకు ఎటువంటి కీలక పాత్ర పోషిస్తోందో బోధపడుతోంది. ఇంత కీలకమైన పాత్ర పోషించగలగడానికి కారణం చమురు విశ్వవ్యాప్త మధ్యంతర స్థానంలో ఉండడమే. అన్ని రంగాలకూ చమురు అవసరమే. అటువంటి చమురు మొత్తం జిడిపిలో చాలా తక్కువ శాతం ఉండడం వలన అది ఎక్కువ ఇబ్బందులను సృష్టించగలిగే అవకాశం ఎక్కువగా ఉంది. దాని ధర పెరగడం వలన కలిగే ద్రవ్యోల్బణ ప్రభావం అంత తీవ్రగా ఉంటుంది.

చమురు వివిధ దొంతరల ఉత్పత్తి క్రమం ద్వారా అంతిమంగా వినిమయ ఉత్పత్తుల రూపంలో మార్కెట్‌లో ప్రవేశిస్తుంది.ఆ ఉత్పత్తుల విలువ చాలా ఎక్కువగా ఉంటుంది. ప్రతీ దొంతర వద్దా ధర పెరుగుతూ వుంటుంది. ఇది పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థ స్వభావం. ఈ దొంతరలకన్నింటికీ అట్టడుగున ఉన్న ముడి చమురు ధర పెరిగితే ఆపై అన్ని దొంతరలలోనూ దాని ప్రకంపనలు అంతిమ ఉత్పత్తుల ధరల మీద ప్రభావాన్ని చూపిస్తాయి. తక్కువ దొంతరలలో ఉత్పత్తి క్రమం ఉన్నప్పుడు ముడి చమురు ధరలో 10 శాతం పెరుగుదల ఉంటే కలిగే ప్రభావం తక్కువగా ఉంటుంది. అదే ఉత్పత్తి క్రమంలో దొంతరలు ఎక్కువగా ఉంటే అదే 10 శాతం పెరుగుదల ఎక్కువ ప్రభావాన్ని కలిగిస్తుంది. అందుచేత చమురు వంటి సార్వత్రిక మాధ్యమంగా ఉండే ముడిసరుకు ధరలో పెరుగుదల కలిగించే ద్రవ్యోల్బణ ప్రభావం బహు దొంతరల ఉత్పత్తి క్రమం ఉన్న వ్యవస్థలో ఎక్కువగా ఉంటుంది. ముడిచమురు ధరలో వచ్చే మార్పు ఆర్థిక వ్యవస్థ మీద ఇంతటి తీవ్ర ప్రభావాన్ని కలిగించగలదు కనుకనే ప్రపంచంలో ప్రధాన కరెన్సీ అయిన డాలర్‌తో పోల్చినప్పుడు దాని విలువను నిలకడగా కొనసాగించ డం ప్రపంచ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థకు అంత అవసరం.

ఒకప్పుడు అన్ని కరెన్సీల విలువలనూ బంగారం విలువ ప్రమాణంతో పోల్చి నిర్ధారించేవారు.ఇప్పుడు ఆ బంగారం ప్రమాణాన్ని అమలు చేయడం లేదు. ప్రపంచం యావత్తూ డాలర్ ప్రాధాన్యత కలిగివున్నా, దానికి కూడా బంగారం ప్రమాణం లేదు. ఇప్పుడు పైకి చెప్పకపోయినా,డాలర్ విలువ ముడిచమురు విలువతో ముడిపడి పోయి వుంది. దానర్థం ఒకానొక రేటు దగ్గర ముడిచమురు రేటు డాలర్లలో ఖరారై పోయి వుందని కాదు. కాని ముడి చమురు ధర డాలర్ల రూపంలో ఎప్పుడైనా పెరిగితే ఆ పెరుగుదల అదే విధంగా ఎక్కువ కాలం కొనసాగుతుందన్న అంచనాల తలెత్త కుండా పెట్టుబడిదారీ ప్రపంచం అన్ని ప్రయత్నాలూ చేస్తుంది. విశ్వవ్యాప్త మాధ్యమంగా ఉన్న ముడి చమురు ధర డాలర్లలో అదే పనిగా పెరిగిపోకుండా స్థిరంగా ఒకే ధర దగ్గర కొనసాగడం డాలర్ ఆధిపత్యం స్థిరంగా కొనసాగడానికి అత్యంత ఆవశ్య మైన విషయం. ఇప్పుడు మనకి బంగారం ప్రమాణంగా లేకపోవచ్చు. కాని ఒక విధంగా చమురు- డాలర్ ప్రమాణం ఉనికిలో ఉంది. ఈ ప్రమాణం ఇలాగే కొనసాగాలంటే చమురు ధరను డాలర్ల లెక్కలో నిలకడగా కొనసాగించడం చాలా అవసరం. ఈ ప్రమాణాన్ని కొనసాగించాల్సిన అగత్యం వెనుక మరో కారణం కూడా ఉంది.

గత కొన్ని దశాబ్దాలుగా అమెరికా వాణిజ్య చెల్లింపుల్లో భారీ లోటు కొనసాగుతూనే వుంది. ఆ లోటును భర్తీ చేయడానికి అమెరికా డాలర్లను ముద్రించి విడుదల చేస్తోంది. ఆ డాలర్లను స్వీకరించడానికి, వాటి విలువను అంగీకరించ డానికి ప్రపంచం కూడా సుముఖంగానే ఉంది. అందుచేత ఇప్పుడు ప్రపంచం అంతా డాలర్లు ఎక్కడబడితే అక్కడ ఉన్నాయి. ఈ పరిస్థితిలో డాలర్ ప్రమాణం ప్రశ్నార్థకంగా మారే పరిస్థితి దాపురిస్తే మొత్తం పెట్టుబడిదారీ ప్రపంచ స్థిరత్వమే ప్రమాదంలో పడుతుంది. అందుచేత చమురు- డాలర్ ప్రమాణాన్ని నిలబెట్టుకోవడం మరింత కీలకంగా మారింది. అలా నిలబెట్టుకోడానికే చమురును ఉత్పత్తి చేసే దేశాల మీద రాజకీయ ఆధిపత్యాన్ని చెలాయించడానికి అమెరికా పూనుకుంటోంది.

అనేక గల్ఫ్‌దేశాల్లో ఇప్పటికే అమెరికా అటువంటి ఆధిపత్యాన్ని కలిగి వుంది. ఇరాన్‌ను, వెనిజులాను కూడా తన పెత్తనం కిందకు తెచ్చుకుని సంపూర్ణ ఆధిపత్యం సాధించాలని అమెరికా ప్రయత్నిస్తోంది. వెనిజులా విషయంలో కొంతవరకు అమెరికా కోరుకున్నది నెరవేరే సూచనలు కనిపిస్తున్నా,ఇరాన్ విషయం మాత్రం వేరేగా ఉంది. ఇరాన్‌లో ప్రభుత్వాన్ని గద్దె దించేసి తన తొత్తు ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలనన్న ధీమాతో అమెరికా ఇరాన్ మీద దాడికి దిగింది. అయతుల్లా ఆలీ ఖమేనీతో సహా ఇరాన్ ఉన్నతాధి కారులను అంతం చేసి తన చెప్పుచేతల్లోకి ఇరాన్‌ను తెచ్చుకోవాలని, అందుకు ఇజ్రాయిల్‌ను వాడుకోవాలని అమెరికా చూసింది. తన డాలర్ సర్వాధిపత్యాన్ని మరింత బలపరుచు కోవాలన్న ఉద్దేశంతో అమెరికా చేసిన ఈ ప్రయత్నం వాస్తవానికి ఆ డాలర్ ఆధిపత్య స్థానాన్నే బలహీన పరిచే దిశగా పరిణమించింది. ఇరాన్ విషయంలో అమెరికా వేసిన లెక్కలు తప్పాయి. దాంతో ఇరాన్ మీద ఆధిపత్యం సాధించడం మాట అటుంచి, డాలర్ స్థిరత్వమే ప్రమాదంలో పడింది. దాని పర్యవసానంగా ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రమాదంలో పడింది. సామాన్య ప్రజానీకాన్ని తీవ్ర దారిద్ర్యంలోకి నెడుతున్న ఈ పరిస్థితులు ఆ ప్రజానీకంలో పెల్లుబుకుతున్న ఆగ్రహానికి కారణమౌతున్నాయి. ?ఈ ఆగ్రహం ఆ ప్రజానీకాన్ని ఈ పెట్టుబడిదారీ వ్యవస్థకే వ్యతిరేకంగా నిలబెట్టేంత తీవ్ర స్థాయిలో ఉంది. ❑

**(ప్రజాశక్తి సౌజన్యంతో)**

# సామాజిక న్యాయం కోసం సంపద పునః పంపిణీ జరగాల్సిందే

- వెలుగూరి రాధాకృష్ణమూర్తి





ధనికులపై అదనంగా 5% పన్ను విధించి, ఆ నిధులను పేద ప్రజల విద్య, వైద్యం, జీవనోపాధి కోసం వినియోగించాలనే ప్రతిపాదనను మానవతా దృష్టితో పరిశీలిస్తే, ఇది సమాజంలో ఆర్థిక అసమానతలను తగ్గించడానికి కీలకమైన చర్యగా కనిపిస్తుంది. సమాజంలో సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవడం అనేది సహజసిద్ధమైనది కాదు. అది ఆర్థిక విధానాల ఫలితం. మార్కెట్ ఆధారిత వ్యవస్థలో పెద్ద వ్యాపారవేత్తలు, కార్పొరేట్లు అధిక లాభాలను సంపాదిస్తుంటే, అదే సమయంలో సంపద సృష్టికర్తలైన శ్రామికులు, సాధారణ ప్రజలు ప్రాథమిక అవసరాల కోసం కూడా కష్టపడుతున్నారు. ఈ అసమానతలను తగ్గించడానికి సంపద పునఃపంపిణీ జరగాలన్న వాదన ఇటీవల బలం పుంజుకొంటోంది. ఈ నేపథ్యంలో ధనికులపై 5% సంపద పన్ను విధించడం అనేది "ప్రోగ్రెసివ్ టాక్సేషన్" (progressive taxation) భావనకు అనుగుణంగా ఉంటుంది. అంటే అధిక ఆదాయం ఉన్న వారు సమాజానికి ఎక్కువగా సహకరించాలి. ఇది కేవలం ఆర్థికచర్య మాత్రమే కాదు. సామాజిక న్యాయం సాధించడానికి తీసుకునే ఒక కీలక నిర్ణయం.

ఈ పన్నుల ద్వారా వచ్చిన నిధులను పేదల విద్యపై ఖర్చు చేస్తే, సమాజంలో అవకాశాల సమానత్వం పెరుగుతుంది. మంచి విద్య అందుబాటులోకి వస్తే, పేద పిల్లలు కూడా ఉన్నత స్థాయికి ఎదగగలుగుతారు. అదేవిధంగా, వైద్య సేవలను ఉచితంగా లేదా తక్కువ ఖర్చుతో అందిస్తే, ఆరోగ్య సమస్యల వల్ల పేద కుటుంబాలు అప్పులపాలు కావడం తగ్గుతుంది. జీవనోపాధి పరంగా చూస్తే, ఈ నిధులను ఉపాధిహామీ పథకాలు, చిన్న వ్యాపారాలకు సహాయం, వ్యవసాయ రంగానికి మద్దతువంటి కార్యక్రమాలకు వినియోగించడం ద్వారా పేద ప్రజల ఆర్థికస్థితి మెరుగుపడుతుంది. దీని ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థ కూడా స్థిరంగా అభివృద్ధి చెందుతుంది. అయితే, ఈ విధానానికి వ్యతిరేకంగా కొందరు "ఇది పెట్టుబడిదారులను నిరుత్సాహపరుస్తుంది" అని వాదిస్తారు. కానీ, సమాజంలో స్థిరత్వం, సామాజిక శాంతి, సమాన అవకాశాలు ఉండటం పెట్టుబడులకు మరింత అనుకూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. కాబట్టి ఇది దీర్ఘకాలికంగా దేశ అభివృద్ధికి ఉపయోగపడే విధానమే. మొత్తంగా చూస్తే, ధనికులపై అదనపు పన్ను విధించి, ఆ నిధులను పేదల సంక్షేమానికి వినియోగించడం సమానత్వం, సామాజిక న్యాయం, సంక్షేమ రాష్ట్రం లక్ష్యాలకు అనుగుణమైన చర్య. ఇది కేవలం ఆర్థిక విధానం కాదు, ఒక సమానతా సమాజం నిర్మాణానికి దారి తీసే మార్గం.

ధనికులపై అధిక పన్నులు విధించి ఆ డబ్బును పేదల సంక్షేమానికి వినియోగించాలన్న డిమాండ్ కేవలం సిద్ధాంత స్థాయిలో మాత్రమే కాకుండా ప్రపంచవ్యాప్తంగా ఒక శక్తివంతమైన ఉద్యమంగా రూపుదిద్దుకుంటోంది. ప్రజా నిరసనలు, రాజకీయ ప్రచారాలు, అంతర్జాతీయ సంస్థల డిమాండ్ల రూపంలో ఈ ఉద్యమాలు కనిపిస్తున్నాయి.

Tax the Rich గ్లోబల్ ఉద్యమం ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తున్నది. Tax the Rich అనే నినాదంతో అనేక సంస్థలు ఉద్యమాలు నడుపుతున్నాయి. Fight Inequality Alliance, Oxfam వంటి సంస్థలు ధనికులపై అధిక పన్నులు వేయాలని నిరంతరం ప్రచారం చేస్తున్నాయి. ఈ ఉద్యమాల ప్రధాన వాదన ఏమిటంటే, ప్రపంచ సంపద కొద్ది మంది చేతుల్లో కేంద్రీకృతమవడం ప్రజాస్వామ్యానికి ప్రమాదం. సంపద పన్నుల ద్వారా వచ్చిన నిధులను విద్య, ఆరోగ్యం, వాతావరణ మార్పు సమస్యల పరిష్కారానికి వినియోగించాలని వీరు కోరుతున్నారు.

ఈ డిమాండ్ పర్యావరణ ఉద్యమాలతో అనుసంధానం

అవుతోంది. ఇప్పుడు కేవలం ఆర్థికన్యాయం డిమాండ్ మాత్రమే కాదు, "క్లైమేట్ జస్టిస్" ఉద్యమంతో కూడా ఇది కలిసిపోయింది. Extinction Rebellion వంటి సంస్థలు Make Them Pay పేరుతో లండన్‌లో భారీ ర్యాలీలు నిర్వహించాయి. Extinction Rebellion UK Greenpeace వంటి సంస్థలు ధనికులపై పన్నులు పెంచి వాతావరణ, సమస్యలను పరిష్కరించాలని జి 20 దేశాలను డిమాండ్ చేస్తున్నాయి. ధనికులపై పన్ను అంశం ఇప్పుడు ప్రపంచ రాజకీయాల్లో ప్రధాన చర్చగా మారింది. అమెరికాలో Bernie Sanders, Alexandria Ocasio-Cortez లాంటి నేతలు Fighting Oligarchy కార్యక్రమాల ద్వారా ఈ అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లారు. డెన్మార్క్‌లో కూడా ఎన్నికల సమయంలో సంపదపై పన్ను ప్రతిపాదనలు కీలకంగా మారాయి. కాలిఫోర్నియాలో బిలియనీర్లపై 5% పన్ను విధించే ప్రతిపాదన చుట్టూ పెద్ద రాజకీయ పోరాటం జరుగుతోంది.

ధనికులపై అదనంగా 5 శాతం కార్పోరేట్ పన్ను విధించాలన్న డిమాండ్‌పై ప్రపంచమంతా నేరుగా ప్రజా నిరసనలు, ఆందోళనలు జరుగుతున్నాయి. కొన్ని దేశాల్లో ఈ డిమాండ్ ప్రత్యక్షనిరసనలరూపంలో కనిపిస్తోంది. బ్రిటన్‌లో Take Back Power అనే ఉద్యమం ధని కులపైపన్నులు పెంచాలని, ఆ డబ్బును ప్రజల కోసం వినియోగించాలని డిమాండ్ చేస్తోంది.

డావోస్ (World Economic Forum) సమావేశాల సమయంలోకూడా Tax Me Now వంటి గ్రూపులు నిరసనలుచేపట్టాయి. ఐక్యరాజ్యసమితి (UN), +20 స్థాయిలో కూడా ధనికులపై గ్లోబల్ పన్ను విధించాలని చర్చలు జరుగుతున్నాయి. కొన్ని నివేదికలు ప్రపంచస్థాయిలో 2% సంపద పన్ను వసూలు చేస్తే భారీగా ఆదాయం సమకూరుతుందని సూచిస్తున్నాయి. ధనికుల సంపద వేగంగా పెరగడం, పేదల పరిస్థితి దుర్భరంగా మారటం వల్ల ఈ ఉద్యమాలు పెరుగుతున్నాయి. ప్రభుత్వాలు సామాజిక ఖర్చులను తగ్గించడం, రాజకీయాలపై కార్పొరేట్ ప్రభావం పెరగడం వల్ల కూడా ఈ ఉద్యమాలు ఉధృతరూపం తీసుకుంటున్నాయి.

మొత్తంగా చూస్తే, ధనికులపై అదనపు పన్ను విధించాలన్న డిమాండ్ ఇప్పుడు ఒక గ్లోబల్ సామాజిక–రాజకీయ ఉద్యమంగా మారింది. ఇది కేవలం ఆర్థిక విధానం కాదు. సమానత్వం కోసం పోరాటం. ప్రజాస్వామ్యాన్ని రక్షించడానికి జరిగే పోరాటం. పర్యావరణ సమతుల్యత కోసం కూడా ఈ పోరాటాలు అవసరం. అందువల్ల, 5% అదనపు పన్ను ఆలోచన ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న పెద్ద ఉద్యమంలో భాగమే అని చెప్పవచ్చు.

భారతదేశంలో "ధనికులపై అధిక పన్ను వేయాలి" అనే డిమాండ్ ఇప్పుడిప్పుడే ఊపందుకొంటోంది. ప్రపంచంతో పోలిస్తే, ఇది ఇంకా వీధి పోరాటాల రూపం తీసుకోకపోయినప్పటికీ, పెద్దఎత్తున చర్చనీయాంశంగా మారుతోంది. భారత దేశంలో ఈ డిమాండ్ పెరగడానికి ప్రధాన కారణం ఆర్థిక అసమానతల పెరుగుదల. అత్యంత ధనికుల దగ్గర సంపద భారీగా పోగుపడుతోంది. ఒక అధ్యయనం ప్రకారం టాప్ 0.04% ప్రజలు దేశసంపదలో పెద్దవాటాను కలిగి ఉన్నారు. టాప్ 1% సంపద గణనీయంగా పెరిగిందని +20 నివేదికలు సూచిస్తున్నాయి. ఇదిలా ఉండగా, పేద, మధ్య తరగతి ప్రజల మీద పన్ను భారం పెరుగుతోంది. వ్యక్తిగత ఆదాయపు పన్ను వసూళ్లు కార్పొరేట్ పన్నులకంటే ఎక్కువయ్యాయి. జి.ఎస్.టి వంటి పరోక్ష పన్నులు పేదలపై ఎక్కువ ప్రభావం చూపుతున్నాయి. ఈ పరిస్థితిని వామపక్షాలు "రివర్స్ రీ డిస్ట్రిబ్యూషన్" (పేదల నుంచి ధనికులకు సంపద మారడం)గా విమర్శిస్తున్నాయి. భారతదేశంలో ప్రత్యక్షంగా 5% అదనపు పన్నులాంటి ప్రతిపాదనలు ఇప్పుడిప్పుడే చర్చనీయాంశంగా మారుతున్నాయి. 10 కోట్లకుపైగా సంపద వున్న వారిపై 2% సంపద పన్ను, వారసత్వ పన్ను(inheritance tax) పునరుద్ధరించాలన్న ప్రతిపాదనలు ముందుకు వచ్చాయి. ఈ ప్రతిపాదనలను World Inequality Lab వంటి సంస్థలు ముందుకు తెచ్చాయి. విద్య, ఆరోగ్యం, సంక్షేమ ఖర్చులకు నిధులు సమకూర్చడం ఈ ప్రతిపాదనల యొక్క ప్రధాన లక్ష్యం. ఆసక్తికరంగా, భారతదేశంలో ఈ ఆలోచనలకు ప్రజల మద్దతు గణనీయంగా ఉంది. ఒక సర్వే ప్రకారం 74% భారతీయులు ధనికులపై పన్ను పెంచడాన్ని సమర్థిస్తున్నారు. అంటే ఇది కేవలం వామపక్షాల డిమాండ్ మాత్రమే కాదు. సామాన్య ప్రజల్లో కూడా ఈ భావన బలపడుతోంది.

భారతదేశంలో ఇది ఒక రాజకీయ వివాదాంశంగా మారింది. వామపక్షాలు, ప్రగతిశీల ఆర్థికవేత్తలు సంపద పన్ను అవసరం అంటున్నారు. తద్వారా మాత్రమే సంపద పునః పంపిణీ సాధ్యంకాగలదని వారు అభిప్రాయపడుతున్నారు. అసమానత తగ్గించడానికి ఇది కీలకం అంటున్నారు. ప్రస్తుత విధానాలు ధనికులకు అనుకూలంగా, పేదలకు భారంగా ఉన్నాయని విమర్శలు చేస్తున్నారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం 2015లో సంపదపన్ను(wealth tax) రద్దుచేసింది. మళ్లీ తీసుకురావడంపై ఆసక్తి చూపడం లేదు. ధనికులు పెట్టుబడులను బయటకు తరలించవచ్చుననీ, సంపదపన్ను అమలు చేయడం కష్టమనే వాదనలు ఉన్నాయి. రఘురాంరాజన్ వంటి ఆర్థికవేత్తలు ఇది ప్రయోజనకరం కాదని వ్యాఖ్యానించారు. భారతదేశంలో, పాశ్చాత్య దేశాల్లా Tax the Rich పేరుతో ఉద్యమాలు తక్కువగా ఉన్నప్పటికీ, వామపక్ష కార్మిక సంఘాలు, రైతు ఉద్యమాలు విద్య, ఆరోగ్యంపై ప్రజాపోరాటాలు నిర్వహిస్తూనే ఉన్నాయి. ఇవన్నీ పరోక్షంగా, సంపద పునః పంపిణీ డిమాండ్‌నే ప్రతిబింబిస్తున్నాయి. ❑

# మార్క్సిస్టు మహోపాధ్యాయుడు కారల్ మార్క్స్


- జగన్ ఆర్‌సిఎస్

మే 5వ తేదీకి కారల్ మార్క్స్ జన్మించి 200 ఏళ్లు పూర్తవుతాయి. ప్రపంచవ్యాపితంగా కార్మికవర్గం, ఇతర పీడిత ప్రజానీకం, కమ్యూనిస్టు ఉద్యమశక్తులు, ప్రజాతంత్ర మేధావులు మార్క్స్ 200వ పుట్టినరోజు సందర్భంగా కార్యక్రమాలను తమ తమ పద్ధతులలో తమ తమ స్థాయిలలో ఘనంగా నిర్వహిస్తున్నాయి. ఆధునిక చరిత్రపై ఎంతో విశేష ప్రభావాన్ని వేసిన మహోన్నత మానవుడు కారల్ మార్క్స్.

1883 మార్చి 14న కారల్ మార్క్స్ చనిపోయినపుడు ఆయన ప్రియమిత్రుడు ఫ్రెడరిక్ ఎంగెల్స్ "మానవజాతి ఒక మస్తిష్కాన్ని, ఈనాటి గొప్ప మస్తిష్కాలలోకెల్లా గొప్పదానిని కోల్పోయింది" అనేగాక కారల్ మార్క్స్ పేరు, కృషీ యుగయుగాల తరబడి శాశ్వతంగా వర్ధిల్లుతుంది" అన్నాడు. నిజానికి మార్క్స్-ఏంగెల్స్ సంయుక్తంగా సాగించిన సిద్ధాంత కృషి పొందిన రాజకీయ అనుభవాలు-తీసిన గుణపాఠాల సారాంశపు మొత్తమే మార్క్సిజం అయినప్పటికీ ఏంగెల్స్, 1883 జూన్‌లో, అంటే మార్క్స్ మరణానంతరం ఈ క్రింది మాటలను కమ్యూనిస్టు ప్రణాళిక ముందుమాటలో పొందుపరిచాడు. కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో వున్న మూల భావం - ప్రతి చారిత్రక శకంలోనూ ఆర్థిక ఉత్పత్తి విధానమూ, దాని నుంచి విధిగా ఉత్పన్నమయే సామాజిక వ్యవస్థా కలిసి ఆ శకం యొక్క రాజకీయ, బౌద్ధిక (ఇంటలెక్చువల్) చరిత్రకు పునాదిగా వుంటాయి అనీ, తత్ఫలితంగా, (భూమి మీద ఆదిమ సమష్టిస్వామ్యం విచ్ఛిన్నమైనప్పటి నుంచి) చరిత్ర అంతా వర్గ పోరాటాల చరిత్ర, దోపిడీదార్లకు దోపిడీ చేయబడే వాళ్లకూ జరిగే పోరాటాల చరిత్ర, భిన్న సామాజిక అభివృద్ధి దశలలో వున్న పాలక - పాలిత వర్గాల మధ్య జరిగే పోరాటాల చరిత్ర అనీ, అయితే, అణగదొక్కబడిన పీడితవర్గం (కార్మికవర్గం) తన్ను అణగదొక్కి పీడించే (బూర్జువా) వర్గం నుంచి విముక్తి పొందటమనేది మొత్తం సమాజమంతటినీ దోపిడీ నుంచి, పీడన నుంచి, వర్గ పోరాటాల నుంచి శాశ్వతంగా విముక్తి చేస్తే తప్ప సాధ్యం కాని దశకు వర్గ పోరాటాల చరిత్ర ఈనాడు చేరిందనే ఈ మూలభావం పూర్తిగా మార్క్స్ ది, మార్క్స్ ఒక్కనిదే" పై వాక్యాలు ఏంగెల్స్ లాంటి ఒక మహాపండితుడని మేధో నిజాయితీకి నిదర్శనం.

## కారల్ మార్క్స్ బాల్యం-యవ్వనం

జర్మనీ దేశం ఏకీకరణ కాక ముందు 1818 మే 5న ప్రష్యా ప్రాంతపు రైన్లాండ్ రాష్ట్రంలోని ట్రయర్ నగరంలో ఒక సంపన్న యూదు కుటుంబంలో కారల్ మార్క్స్ జన్మించాడు. తల్లి హెన్రెట్టా, తండ్రి హెన్రీ మార్క్స్. ఆ దంపతుల తొమ్మిది మంది పిల్లలలో మూడోవాడు కారల్.



1789లో ఫ్రాన్స్ దేశంలో జరిగిన బూర్జువా ప్రజాతంత్ర విప్లవ ప్రభావం ట్రయర్ నగరంపై బలీయంగా వుండేది. మార్క్స్ తండ్రి న్యాయవాది. మార్క్స్ చిన్నతనంలో ఆయన ప్రొటెస్టెంట్ మతాన్ని స్వీకరించాడు. వారిది సంస్కారవంతుల కుటుంబమే కాని విప్లవ భావాలు గల కుటుంబం కాదు.

ట్రయర్ నగరంలో ఉన్నత పాఠశాల విద్యార్థిగా వున్నప్పుడే వాల్టేర్, రూసో, లెస్సింగుల గ్రంథాలను చదివి వారి భావాలపట్ల మార్క్స్ ఆసక్తిని చూపాడు. సులభ గ్రాహ్యశక్తిగల మార్క్స్ మంచి మార్కులతో పైతరగతులకు వెళ్లగలిగేవాడు. 17 ఏళ్ల వయసుకు పూర్తి చేసిన మార్క్స్ స్కూల్ ఫైనల్ పరీక్ష ప్రోగ్రెస్ రిపోర్టులో యిలా వ్రాశారు : "అతను చాలా తెలివిగల విద్యార్థి. ప్రాచీన భాషలలోనూ, జర్మనీ భాషలోనూ, చరిత్ర పాఠాలలోనూ అత్యంత ప్రశంసనీయమైన కృషి కనబరిచాడు. గణితంలో అమోఘ ప్రజ్ఞ చూపాడు. ఫ్రెంచి భాష విషయంలో అంత పరిశ్రమ చేయనట్టు అర్థమైంది".

సరిగా ఆ కాలంలోనే(1835) "భావి వృత్తి ఎంపికలో ఒక యువకుని భావాలు" అని రాసిన తన స్కూలు వ్యాసంలో" ఒక మనిషి తన కోసం మాత్రమే తాను కృషి చేసినట్లయితే బహుశా అతనొక ప్రసిద్ధ పండితుడు కావచ్చు. ఒక మహాప్రాజ్ఞుడు కావచ్చు. చక్కని కవి కావచ్చు. అంతేకాని అతనెప్పటికీ లోప రహితుడైన సిసలైన గొప్ప వ్యక్తి కాలేడు. (వృత్తి ఎంపిక గురించి. నవయువ సమాఖ్య ప్రచురణ) "మానవజాతికి అత్యధికంగా మేలు చేయగల వృత్తిని మనం ఎంచుకున్నట్లయితే మనం దేనికీ తల వంచనవసరం లేదు. ఎందుచేతంటే, అది అందరి కోసం చేసే త్యాగం. అప్పుడు మనం పొందే ఆనందం అల్పమైనది కాదు. ఎందుచేతంటే, లక్షలాది ప్రజల సౌఖ్యమే మన సౌఖ్యం అవుతుంది. మన కార్యాలు ప్రపంచంలో శాశ్వతంగా నిలిచి పోతాయి". (కారల్ మార్క్స్ జీవిత కథ-రామదాస్)

1835 అక్టోబరు మధ్యలో ఉన్నత విద్య కోసం మార్క్స్ ట్రయర్ పట్టణాన్ని వీడి బాన్ నగరానికి బయలుదేరాడు. తన తండ్రి ఇష్ట ప్రకారం న్యాయశాస్త్ర విద్యలో చేరాడు. దానితో ముడివడిన చరిత్ర, తత్త్వశాస్త్రం కూడా పట్టుదలగా చదవ సాగాడు. కేవలం చదువేకాక ఆ వయసుకు అలవడే ఉద్రేక, ఉత్సాహాలు ప్రదర్శించాడు. కులీన కుటుంబాల నుంచి వచ్చిన విద్యార్థుల అభిజాత్యాలను, అహంకారాలను భౌతికంగా ఎదుర్కొన్నాడు. ఈ పరిణామాలకు ఆందోళన చెందిన తండ్రి, మార్క్సును బాన్ నుంచి బెర్లిన్ విశ్వ విద్యాలయానికి మార్పించాడు. తనకు హైస్కూలు దశలోనే బాగా పరిచయమై స్నేహితురాలిగా వుండిన జెన్నీ పట్ల పెంచుకున్న ప్రేమవల్ల ఈసారి ట్రయర్ పట్టణం వదలి వెళ్లాలంటే మార్క్స్‌కి కొంత కష్టం వేసింది.

జెన్నీ పూర్తిపేరు జెన్నీఫర్ వెస్ట్ ఫాలెస్. ఆమె తండ్రి లుడ్విగ్. ప్రష్యన్ ప్రభుత్వంలో కౌన్సిలర్. బాగా చదువుకున్న ఉదర భావాలు కలవాడు. మార్క్స్ అక్క సోఫీకి జెన్నీ మంచి స్నేహితురాలు. క్రమంగా మార్క్స్‌కు జెన్నీకి నడుమ అనుబంధం పెరిగింది. జెన్నీ ట్రయర్ ప్రాంతానికే పేరు మోసిన అందగత్తె. ఆమె ప్రేమ కోసం ఎందరో సంపన్న కుటుంబాల యువకులు ఎదురు చూస్తూండేవారు. అయితే ఆమె ఒక మామూలు లాయర్ కొడుకైన కారల్ మార్క్సును, తనకంటె నాలుగేళ్లు చిన్నవాడైనప్పటికీ, ప్రేమించింది. పట్టుదలగా చదవాలనే జిజ్ఞాసతో మార్క్సు ట్రయర్ నగరాన్ని వీడి బెర్లిన్ విశ్వ విద్యాలయానికి చేరుకున్నాడు.

ఆర్థిక రాజకీయ స్థాయిలో జర్మనీ దేశం ఫ్రాన్స్ ఇంగ్లాండుల కంటే ఆనాటికి వెనుకబడి వుండినప్పటికీ, విద్యా తాత్త్విక, సాహిత్య విమర్శనా రీతులలో ముందుండేది. తత్త్వశాస్త్రజ్ఞులుగా బాగా పేరు గడించిన జర్మనీ దేశస్తులయిన ఇమాన్యుయెల్ కాంట్ (1724-1804), ప్రొఫెసర్ హెగెల్ (1770-1831), ప్రొఫెసర్ ఫొయెర్ బాక్ (1804-1872)లు మార్క్స్‌కు సమీప పూర్వకాలం వారే. వారి తాత్త్విక భావ జాలాల ప్రభావం ఆనాటి విద్యార్థి యువజనులపై ఎక్కువగా వుండేది. 1818 నుంచి 1831 దాకా బెర్లిన్ విశ్వ విద్యాలయంలో హెగెల్ తత్త్వ శాస్త్ర పాఠాలు బోధించి వున్నాడు. ఆయన శిష్యులే మార్క్స్ కు పాఠాలు బోధించేవారు. మార్క్స్ మాటల్లోనే చెప్పాలంటే "నేను చదవాల్సింది న్యాయశాస్త్ర గ్రంథాలు అయితే అన్నిటినీ మించి తత్త్వ శాస్త్ర గ్రంథాలు చదవాలన్న తపన నాలో బయలుదేరింది" అని తన మిత్రులకు రాశాడు. ఆ విధంగా మార్క్స్ న్యాయశాస్త్ర విద్యను కాక తత్త్వశాస్త్రాన్ని అధ్యయనం చేస్తేగాని విజ్ఞానశాస్త్రపు ఏ ఒక్క శాఖలో ప్రగతిని సాధించజాలం అన్న సత్యాన్ని తెలుసుకున్నాడు. అదే సమయంలో వ్యక్తిగత ఆదర్శవాదానికి (ఐడియలిజం= భావవాదానికి) వున్న పరిమితులేమిటో గ్రహించ గలిగాడు. భావవాదంలో వాస్తవ ప్రపంచం మానవ చైతన్యానికి ప్రతిబింబం మాత్రమే. వారికి తమ వెలుపల ప్రపంచమన్నదే లేదు. ప్రపంచం అవాస్తవ మైనది. ఊహకు నీడలాంటిది. ఈ లోపాన్ని మార్క్సు సునిశిత మేధ వేగంగా పసిగట్టింది. తండ్రికి రాసిన ఒక ఉత్తరంలో "న్యాయం, రాజ్యాంగ యంత్రం, ప్రకృతి యావత్ తత్త్వశాస్త్రం వాస్తవిక ప్రపంచపు వ్యక్తీకరణలు మాత్రమే. ముందుగా అసలు వస్తువును అంటే వాస్తవ ప్రపంచాన్ని, దాని గమనాన్ని పరిశీలించాలి. మన ఇచ్ఛానుసారం అంశాలు జోడించరాదు. మనం చేసే తర్కం వైరుధ్యంలోనూ, ఐక్యతలోనూ గూడా రుజువు కావాలి" అని రాసిన మార్క్స్ (కారల్ మార్క్స్ కథ - రామ్‌దాస్) హెగెల్ తత్త్వశాస్త్ర అధ్యయనాన్ని ముమ్మరం చేశాడు.

హెగెల్ ది కూడా భావవాదమే. ఆయన ప్రకారం "ఈ భౌతిక ప్రపంచం కేవలం ఒక అఖండభావ ప్రతిబింబం మాత్రమే. ఆ అఖండ భావమే ప్రపంచానికి 'వాస్తవికమైన' ఆధ్యాత్మిక పునాదిగా వుందనీ, అది మనిషి చైతన్యంతో నిమిత్తం లేనిదనీ హెగెల్ ఉద్దేశ్యం. చరిత్రను నడిపించేది ఈ అఖండ భావమేననీ, ఈ భావ పరిణామం ఒక నిరంతర క్రమంలో సాగుతుందనీ, అవే మనిషిని క్రిందనుంచి ఉన్నతస్థాయికి క్రమక్రమంగా నడిపిస్తాయని హెగెల్ తలపోశాడు. విరుద్ధ శక్తుల నడుమ నిరంతర సంఘర్షణ - అభివృద్ధి అనే ఈ క్రమమే గతితర్కం.

హెగెల్ సిద్ధాంతపు భావవాదంలోగల వైరుధ్యాల ఫలితంగా 1830వ దశకంలో హెగెల్ శిష్యులమని చెప్పుకునే వారిలో కూడా వైరుధ్యాలు పొడజూపి తీవ్రరూపం దాల్చాయి. పాత హెగెలియన్లు కరడుగట్టిన అభివృద్ధి నిరోధక దృక్పధానికి ప్రతినిధులుగా మారారు. యువ హెగెలియన్లు విప్లవాత్మక ధోరణికీ, గతి తర్క సిద్ధాంతానికీ వారసులు, కారల్ మార్క్స్ యువ హెగెలియన్లతో కలిశాడు. అయితే హెగెల్ ప్రబోధించిన స్వీయాత్మక భావవాదం (సబ్జెక్టివ్ ఐడియలిజం) నుండి

బయటపడ్డాడు. వాస్తవిక ప్రపంచాన్నుండి తత్త్వశాస్త్రాన్ని అభివృద్ధిపరిచి సమాజానికి అన్వయింపజేయాలని తపనపడ్డాడు.

"మత విమర్శ అన్ని విమర్శలకూ మూలం. అందుకే మతం కేంద్రంగా గల ఈ దుఃఖ సముద్రాన్ని విమర్శించాలి" అనే నిర్ణయానికి వచ్చిన తర్వాత మార్క్స్ న్యాయశాస్త్ర విద్యను పక్కన బెట్టి తత్త్వశాస్త్ర ఆచార్యుడవుదామనుకున్నాడు. తండ్రికి యిష్టం లేకపోయినా మార్క్స్ పట్టుదల చూసి అంగీకరించక తప్పలేదు. ఆ తర్వాత కొద్దిరోజుల్లోనే 1838లో తండ్రి హెన్రీ చనిపోయారు. 1839లో "డెమోక్రటిస్ - ఎపిక్యురస్ ప్రకృతి తత్త్వాల నడుమ వ్యత్యాసం" అన్న అంశంపై తన డాక్టరేట్ పరిశోధనను ప్రారంభించి, అత్యంత సునిశిత మేధా సామర్థ్యంతో ఆ ఇద్దరు గ్రీకు తత్త్వవేత్తల బోధనలను అధ్యయనం చేశాడు. వీరిరువురూ క్రీస్తుకు పూర్వమే భౌతికవాద దృక్పథాన్ని బోధించిన వారు. తన డాక్టోరల్ థీసిస్‌ను బెర్లిన్ విశ్వ విద్యాలయానికి సమర్పించటానికి మనసొప్పలేదు. అక్కడ అభివృద్ధి నిరోధక సిద్ధాంత వేత్తలు తిష్ట వేసి వున్నారు. అందుకనే తన థీసిస్‌ను -1841లో జెనా విశ్వ విద్యాలయానికి సమర్పించాడు. దాన్ని పరిశీలించిన ప్రొఫెసర్ "ఎంత అధ్యయనం వుందో అంత మేధాశక్తి, నిశిత దృష్టిగలవాడు" అంటూ మార్క్సుని అభినందించాడు.

1841 ఏప్రిల్‌లో మార్క్స్ బెర్లిన్ నుండి ట్రయర్‌కు తిరిగి వచ్చాడు. అతను బాన్ విశ్వ విద్యాలయంలో ఆచార్యునిగా చేరతాడని అందరూ అనుకున్నారు. ఆ రోజుల్లో యువ హెగెలియన్లలో ఒకడైన మోజెస్ హెస్ 2-9-1841న మార్క్స్ గురించి తన మిత్రునికిలా రాశాడు: "ప్రస్తుతం జీవించివున్న వారిలో బహుశా ఒకే ఒక నిజమైన తత్త్వవేత్త, మహామహుడు అయిన వ్యక్తిని కలుసుకునేందుకు నీవు సిద్ధం కావాలి. త్వరలోనే అతను ఎక్కడైనా కనిపించవచ్చు ఉపన్యాసకునిగా, రచయితగా ఎలా కనిపించినా జర్మనీ దృష్టినంతా ఆకర్షిస్తాడు. డాక్టర్ మార్క్స్ ఇప్పటికింకా చిన్నవాడే. (బహుశా ఇరవై నాలుగేళ్లకంటే ఎక్కువ వుండవు). మధ్యయుగాల నాటి మతాన్ని, రాజకీయాలనూ ఆయన చివరి దెబ్బ కొడతాడు. సునిశితమైన తాత్త్విక చిత్తశు ద్ధిని, పదునైన వాక్చాతుర్యాన్ని ఆయన ఏకకాలంలో ప్రయోగిస్తాడు. రూసో, వాల్టేర్, హోల్బక్, లెస్సింగ్, హైనే, హెగెల్... వీరంతా ఒకే వ్యక్తిలో వున్నారనుకో అందరినీ ఒకచోట చేరిస్తే అని నేనడం లేదు. అందరూ కలిసి ఒకేవ్యక్తిగా రూపుదాలిస్తే ఆ వ్యక్తి మార్క్స్ అవుతాడు". చాలా స్పష్టంగా మోజెస్ మాటల్ని చరిత్ర రుజువుపరిచింది.

తన డాక్టోరల్ థీసిస్‌ని జెన్నీ తండ్రికి అంకితమిచ్చాడు. అప్పటికి ఎన్నో ఏళ్లుగా ఎడబాటునుభవిస్తున్న యువ ప్రేమికులు - మార్క్స్, జెన్నీ - ఒకటి కావాలనుకున్నారు. 1843 జూన్ 12 నాటికి కానీ మార్క్స్, జెన్నీలు వివాహం చేసుకోలేకపోయారు.

ఇక్కడ మార్క్స్ జీవన సహచరి జెన్నీ గురించి ఒక్కమాట చెప్పుకుందాం. 38 ఏళ్ల వారి దాంపత్య జీవితంలో (1881 డిసెంబరులో జెన్నీ మరణించింది) చెప్పనలవి కాని కష్టాలను వారు అనుభవించారు, భరించారు. సహించారు. జెన్నీ ఎంత సంపన్న కుటుంబం నుంచి వచ్చిందంటే ఆమె సోదరుడు జర్మనీ దేశపు అంతరంగిక శాఖామంత్రిగా పనిచేశాడు. తానేమో ఒకొకసారి పూట గడవటానికి లేక, పిల్లలకు సరైన తిండి, రోగానికి మందులు సమకూర్చలేక వారు చనిపోతున్నా కన్నీళ్ళు దిగమింగుకొని ఊహించలేనన్ని బాధలు భరించింది. అదీ! వారిరువురి నడుమ వుండిన అపూర్వమైన ప్రేమబంధం, ప్రపంచ శ్రమజీవుల చరిత్రను, మానవజాతి చరిత్రను, మానవీయ పునాదులపై నిర్మించే కృషి సల్పుతున్న మార్క్స్‌కు అండదండలను అందించటమేకాక ఆయనలో గొప్ప ఆత్మ బలాన్ని, గొప్ప భావనా శక్తిని ప్రోదు చేసిన మహిమాన్వితురాలు జెన్నీ! 1850లో ఆమె ఒక లేఖలో ఇలా రాసింది; "ఈ చిన్న చిన్న కష్టాలు నన్ను లొంగదీశాయనుకోవద్దు. పోరాటం ఒంటరిది కాదని నాకు బాగా తెలుసు. నా జీవనాధారం అయిన నా ప్రియమైన భర్త నా పక్కనున్నంత వరకు, నేను అత్యంత అదృష్టవంతులలో ఒకర్తిగానే భావించుకుంటాను", (కారల్ మార్క్స్ కథ)

## మార్క్సిస్టు తత్త్వశాస్త్రం - గతితార్కిక భౌతికవాదం

అప్పటికి ఎంగెల్స్‌తో మార్క్స్‌కు పరిచయం లేనప్పటికీ, ఎంగెల్స్ కూడా హెగెల్ ప్రభావానికి గురయ్యాడు. 1842లకు మార్క్స్-ఎంగెల్స్ తొలిసారి కలుసుకున్నా, 1844లో పారిస్‌లో పది రోజులపాటు సుదీర్ఘ చర్చల క్రమంలో ఇరువురి భావాలలో ఏకీభావం కుదిరింది. అప్పటికి ఏంగెల్స్, మార్క్స్ వలెనే హెగెల్ ని గతితర్క దార్శనికతను గ్రహించి, 'అఖండ చైతన్యం' అనే భావవాదాన్ని సంశయిస్తున్నాడు. తర్వాత హెగెల్లోని భావ వాదాన్నీ, మత దృష్టిని ఖండిస్తూ లుడ్విగ్ ఫొయరా అనే తాత్త్వికుడు భౌతికవాదాన్ని బలంగా ప్రతిపాదించటంతో ఇరువురూ లుడ్విగ్ ఫాయర్ బా ప్రభావంలోకి వెళ్లారు. ఏ తత్త్వ శాస్త్రమయినా సామాజికంగా అన్వయం కావాలనే భావన బలంగా వున్న కారణంగా, మనిషిని సామాజిక కార్యాచరణ జీవిగా చూడని ఫోయర్బాలోని యాంత్రిక దృక్పథాన్ని విడిచి పుచ్చి భౌతికవాదాన్ని మాత్రం స్వీకరించారు. హెగెల్ విషయంలో ఎంగెల్స్ చెప్పినట్లు "దాని రూపాన్ని విమర్శ ద్వారా నాశనం చేస్తూనే, అది సృష్టించిన నూతన సారాన్ని కాపాడు కోవాలి" అనుకున్నారు. (లుడ్విగ్ ఫోయర్బా, సాంప్రదాయక జర్మన్ తత్త్వశాస్త్ర పరిసమాప్తి - పేజీ16) అలా హెగెల్లోని భావవాదాన్ని వీడి గతితర్కాన్ని మిగుల్చుకున్నట్లే, ఫాయెర్బాలోని

'యాంత్రిక' ధోరణిని వీడి భౌతికవాదాన్ని స్వీకరించారు. ఆ విధంగా గతితార్కిక భౌతిక వాదమనే తాత్త్విక దృక్పథం ఆవిష్కృతమైంది. ఇది ప్రకృతీ, సమాజం, మానవుని ఆలోచనలను అవగాహన చేసుకోవటానికి తోడ్పడే శాస్త్రీయ చలనసూత్రాల సమాహారం, అదే సమయంలో వాటిని మార్పుకు గురిచేయగల నూతన సిద్ధాంతం. ప్రకృతిలోనూ సమాజంలోనూ గల వివిధ అంతర్ వైరుధ్యాల నడుమ సాగే సంఘర్షణల ఫలితంగా వాటిలో సంభవించే మార్పులను (చలనాన్ని) భౌతికవాద దృక్పథంతో విశ్లేషించే శాస్త్రీయ సిద్ధాంతమే గతితార్కిక భౌతికవాదం. వానరుని నుండి నరునిగా రూపొందటంలో మానవశ్రమ నిర్వహించిన పాత్రను శాస్త్రీయంగా ఏంగెల్స్ వివరించగలిగాడు. ఈ సిద్ధాంతంతోనే సమష్టి మానవశ్రమ ఫలితంగా పోగుపడిన మిగులు సంపదే (అదనపు విలువ) తిరిగి పెట్టుబడిగా అవతరిస్తోందన్న సత్యాన్ని తొలిగా మార్క్స్ ఆవిష్కరించడానికి తోడ్పడిన తాత్త్విక సిద్ధాంతం, గతితార్కిక భౌతికవాదం. ఇది సమస్త మానవ సమాజ జీవిత అనుభవాల సారం నుండి పుట్టి, తిరిగి మానవ జీవితాలలో వెలుగు నింపటానికి కార్యాచరణకు తోడ్పడే కార్మికవర్గ సైద్ధాంతిక ఆయుధం. దీన్ని మానవ సమాజ చరిత్రకు అన్వయం చేయగా రూపొందినదే గతితార్కిక చారిత్రక భౌతికవాదం. అలాగే మానవుని ఆలోచన, మేధస్సుకు అన్వయించగా రూపొందినదే జ్ఞాన సిద్ధాంతం. వ్యక్తిగత ఆస్తులు లేని, ఆహారోత్పత్తి నెరుగని, రాజ్యమూ, కుటుంబమూ లేని, సుదీర్ఘ ఆదిమ కమ్యూనిస్టు సమాజాన్ని విడిచిపెడితే, ఉత్పత్తైన సంపదను మిగుల్చుకోగల బానిస సమాజంనుండి అర్ధబానిస సమాజమైన ఫ్యూడల్ రాచరిక సమాజమూ, తర్వాత పెట్టుబడిదారీ వ్యవస్థలో వేతన బానిస సమాజమూ రూపొందుతూ వచ్చాయని చారిత్రక భౌతికవాదం నిర్ధారించింది.

నూతన సమాజ ఆవిర్భావానికి గల మౌలిక కారణాలను మార్క్స్ యిలా విప్పిచెప్పాడు : "తమ అభివృద్ధి క్రమంలోని ఒకనొక దశలో, సమాజ ఉత్పత్తికి సంబంధించిన భౌతిక సాధనాలకూ, ఆనాడున్న ఉత్పత్తి సంబంధాలకూ మధ్య వైరుధ్యం ఏర్పడుతుంది.లి లిదీన్ని మరోరకంగా చెప్పాలంటే, అమలులోవున్న ఆస్తి సంబంధాలలో వైరుధ్యం ఏర్పడుతుంది. లోగడ ఉత్పత్తికి అభివృద్ధికి దోహదపడిన ఈ సంబంధాలే ఇప్పుడు దానికి ఆటంకాలవుతాయి. అపుడు సామాజిక విప్లవాల దశ ఆరంభమవుతుంది.లి

లిఆర్థిక పునాది మారిపోవడంతో బ్రహ్మాండమైన దాని ఉపరితల కట్టడం మెల్లగానో, వేగంగానో పూర్తిగా మారిపోతుంది.లి లిఒక సమాజం తాను యే ఉత్పత్తి సాధనాలనయితే నిర్మించగలదో అవి పనికి రాకుండా పోనిదే ఏ సాంఘిక వ్యవస్థా అదృశ్యం కాదు. అలాగే తమకు అవసరమయిన భౌతిక పరిస్థితులు పాత సమాజ గర్భంలోనే గనక ఏర్పడి వుండకపోయినట్లయితే, నూతన ఉత్పత్తి - సంబంధాలు ఉద్భవించవు. పరిష్కారానికి అవసర మయిన భౌతిక పరిస్థితులు లేనట్లయితే కర్తవ్యాలు రానే రావు"లి.

**ఈ చారిత్రక భౌతికవాద ఆవిష్కరణనే**

మార్క్స్- ఎంగెల్స్ మహాప్రవక్తలై, మానవ పురోగమన మార్గాలు తెరువగా" అని కవిత్వీకరించాడు మహాకవి శ్రీశ్రీ.

శ్రమ-పెట్టుబడి: రాజకీయ అర్థశాస్త్ర విమర్శ:

మార్క్స్ తన జీవితంలో ఎక్కువ కాలాన్ని పెట్టుబడిదారీ విధానపు అభివృద్ధి క్రమాన్ని, సంక్షోభ కారణాల్ని పరిశోధించటానికి వెచ్చించారు. లాభం కోసం, మార్కెట్లో సరుకులను అమ్మటం కోసం ఉత్పత్తి చేయించే విధానమే పెట్టుబడిదారీ విధానానికి ముఖ్యమైన గుర్తు. ఉత్పత్తి సాధనాలైన భూమి, యంత్రాలు, పనిపరికరాలు, ముడిసరుకు కలిగిన వారూ, వాటితో శ్రమ చేసే శ్రామికుల శ్రమ శక్తిని కొనుగోలు చేయగలిగిన పెట్టుబడిదారులు ఒక వైపూ, తమ శ్రమనూ, శ్రమ నైపుణ్యాలను అమ్ముకోవటం ద్వారా తప్ప బతుకు తెరువు లేని శ్రమజీవులు వుండే వ్యవస్థే పెట్టుబడిదారీ విధానం.

పెట్టుబడిదారులకు వచ్చే లాభం, సరుకుని దాని అసలు విలువకంటే హెచ్చు విలువకు అమ్మడం వల్ల పొందడం లేదు అన్నాడు మార్క్స్. అలాంటి అమ్మకాలు - కొనుగోళ్ల వల్ల ఒక పెట్టుబడిదారునికి లాభమూ, మరొకరికి నష్టమూ వస్తుందని, అది ఒకరినొకరు దగా చేసుకోవడంగా తయారై సారాంశంలో లాభం ఏమీ మిగలనిదవుతుందని చెప్పాడు. పెట్టుబడిదారునికి లాభం అన్నది అమ్మకాలలోగాక, ఉత్పత్తి క్రమంలోనే లభించే సున్నిత దోపిడీ ప్రక్రియ. ఈ రహస్యాన్ని కనుగొన్న ఆర్థిక శాస్త్రజ్ఞుడు కార్ల్ మార్క్స్. అలా దోపిడీ అయిన భాగానికే ఆయన "అదనపు విలువ" అని పేరుపెట్టాడు.

అన్ని సరుకుల విలువలోగల ఉమ్మడి అంశం మానవశ్రమ. మానవ శ్రమ లేకుండా ఏ వస్తువూ సరుకు కాదు. సరుకుకుండే సామాన్య లక్షణం ఉపయోగపు విలువ, మారకపు విలువలు. మానవ శ్రమ శక్తి కూడా అమ్ముకోవటం, కొనుగోలు చేయటం అనే ప్రక్రియలో భాగమే కనుక అది కూడా ఒక సరుకుగానే చలామణిలో వుంటుంది.

ఏ సరుకైనా దాని ఉత్పత్తి వ్యయాన్నిబట్టి అమ్ముకోవటం వుంటుంది. మానవ శ్రమ శక్తి అనే సరుకు ఉత్పత్తికావటానికి కేవలం కార్మికుని శ్రమ శక్తి యొక్క మారకపు విలువేకాక ఆ శ్రమ శక్తి యొక్క ఉత్పత్తి విలువనంతటినీ పరిగణించాల్సి వుంటుంది. శ్రమ శక్తి అనే సరుకు విలువ దాన్ని సృష్టించే కార్మికుడూ, అతని కుటుంబం జీవించటానికి, పెంపొందటానికీ

అవసరమైన సమస్త సాధనాల విలువకు సమానంగా వుంటుంది. కార్మికుని యొక్క శ్రమ శక్తికుండే పూర్తి విలువను చెల్లించకుండా, మార్కెట్టు విలువను మాత్రమే చెల్లించటం ద్వారా "మిగుల్చుకున్న అదనపు విలువనే మార్క్స్ శ్రమదోపిడీ" అన్నాడు. కార్మికులకు చెల్లించే విలువకన్నా, కార్మికులు ఉత్పత్తి చేసే విలువ అధికంగా వుండటమే లాభాల సంపాదనలోని ప్రధానమైన షరతు. ఈ భేదాన్నే మార్క్స్ అదనపు విలువగా నిర్వచించాడు. ఈ అదనపు విలువ దోపిడీపైన ఆధారపడి జీవనం సాగించేదే పెట్టుబడిదారీ విధానం. ఈ అదనపు విలువ నుంచే వర్తకుడు వర్తకలాభాన్నీ, అప్పులిచ్చిన బ్యాంకులు వడ్డీని, భూయజమాని కౌలుని తీసుకోగా మిగిలినది పారిశ్రామిక పెట్టుబడిదారునిది అవుతుంది. ప్రభుత్వాలు వసూలు చేసే పన్నులు కూడా ఈ అదనపు విలువ నుండి పొందేవే. ఒక్కమాటలో సమస్త వ్యవస్థా శ్రామికుల శ్రమ శక్తి నుండి పొందే 'అదనపు విలువ' ద్వారానే తన రోజువారీ కార్యకలాపాలను నిర్వహించుకుంటూ వుంటుంది. పెట్టుబడిదారీ విధానపు కీలక వైరుధ్యం శ్రమకూ పెట్టుబడికీ మధ్యన వుందని మార్క్స్ నిర్ధారించాడు. శ్రామికుల సమష్టి శ్రమ ద్వారా ఉత్పత్తయే సామాజిక సంపద, వ్యక్తిగతంగా కొద్దిమంది పెట్టుబడిదారుల స్వంతం కావటమనేదే ఈ వ్యవస్థలో వుండే కీలక వైరుధ్యం. ఈ కారణంగా శ్రామికుల కొనుగోలు శక్తి ఉత్పత్తయిన సరుకులు, మార్కెట్టు విలువకంటే తరిగిన ఫలితంగా, ఒకవైపు అధికోత్పత్తితో మరోవైపు కొనటానికి డబ్బు కరువుతో సంక్షోభాలకు అనివార్యంగా గురవుతుందని మార్క్స్ చెప్పిన జోస్యం అనేక పర్యాయాలు రుజువవుతూనే వుంది. పెట్టుబడిదారుల నడుమ పోటీ ఫలితంగా నిరంతరాయంగా పెట్టుబడి సాంద్రతను, నూతన సాంకేతికతను పెంచుకోలేని వారు మార్కెట్టులో నిలువ లేక పెద్ద చేపల ఎరకు బలవుతూ వుంటారు. యంత్రాలపై పెట్టుబడి పెరిగిన కొద్దీ శ్రామికుల వినియోగం తరిగి, నిరుద్యోగ సైన్యం పెరిగి, శ్రామికుల నడుమ పోటీ ఫలితంగా వారి వేతనాలు తగ్గి తిరిగి అది మార్కెట్టు డిమాండును మరింత తగ్గించి, ఉత్పత్తిని ఇంకా తగ్గించుకోవాల్సిన తప్పనిసరి పరిస్థితులను తెచ్చిన ఫలితంగా ఆర్థిక వ్యవస్థ నిరంతరాయమైన ఒడిదుడుకులను, సామాజిక అభద్రతను కలిగిస్తూ వుంటుంది. వ్యక్తిగత ఆస్తుల రద్దు అనే నినాదాన్ని విని గగ్గోలు పెట్టే బూర్జువా మేధావులు, పెట్టుబడిదారీ విధానమే నిరంతరాయంగా వ్యక్తిగత ఆస్తులు లేని వారి సంఖ్యను, శాతాలను పెంచుతూ ఉంటుందనే సత్యాన్ని చూడ నిరాకరిస్తారు.

పెట్టుబడిదారీ విధానం గుత్తపెట్టుబడిదారీ విధానంగా, అది ద్రవ్య పెట్టుబడిని ఎగుమతి చేసే, వెనుకబడిన దేశాల జాతుల సమస్త వనరులను కొల్లగొట్టే సామ్రాజ్యవాదంగా, ప్రపంచాన్ని యుద్ధాలలోకి లాగే అగ్రరాజ్యోన్మాదంగా పరిణామం చెందటం మార్క్స్ తదనంతర కాలపు లక్షణంగా రూపుదాల్చింది. ఇదే కార్మికవర్గ విప్లవాల కాలంగానూ, సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ విముక్తి ప్రాముఖ్యత వహించే కాలంగానూ, దేశాలు స్వాతంత్ర్యాన్ని కోరే కాలంగానూ.. లెనిన్, మావోలు చెప్పారు. ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ ఒక సంక్షోభం నుండి మరొక సంక్షోభానికి గురవుతూ నిరంతర సంక్షోభ స్థితిలో చిక్కుబడి వుంది. మార్క్స్, ఏంగెల్స్‌లు కమ్యూనిస్టు పార్టీ ప్రణాళికలో చెప్పినట్టు "బూర్జువావర్గపు నాయకత్వంలో ప్రజాస్వామిక విప్లవాలు సంభవించే కాలంపోయి, కార్మివర్గ నాయకత్వాన బూర్జువా ప్రజాస్వామిక విప్లవాలూ, జాతీయ విముక్తి యుద్ధాలూ విజయవంతం కాగలుగుతాయనే చారిత్రక అనుభవం మార్క్సిస్టు-లెనినిస్టు సిద్ధాంత రూపాన్ని పొందింది" ఇవన్నీ ప్రపంచ సోషలిస్టు విప్లవంలో అంతర్భాగమై వున్నాయి. ఏకకాలంలో "ప్రపంచ వ్యాపితంగా కార్మికవర్గం సాగించే శ్రమ దోపిడీ వ్యతిరేక సోషలిస్టు విప్లవమూ, వెనుకబడిన దేశాలలో ఫ్యూడల్ దోపిడీకి వ్యతిరేకంగా రైతాంగం విస్తృతంగా పాల్గొనగలిగే ప్రజాస్వామిక విప్లవమూ, సామ్రాజ్యవాద దోపిడీ పీడనల్నుండి స్వాతంత్ర్యాన్ని కోరుకునే దేశాల, జాతుల విముక్తి పోరాటమూ కలగలిసి సాగాల్సిన దశలో నేటి ప్రపంచ శ్రామికోద్యమం వుంది."

సామ్రాజ్యవాద రూపుదాల్చిన గుత్తపెట్టుబడిదారీ (కార్పొరేట్) విధానానికి, తమ సులువైన దోపిడీకి, అభివృద్ధిలో వెనుకబడిన ప్రపంచం వుండటం తప్పనిసరి. అత్యధిక దేశాలను, జాతులను, ప్రజానీకాన్ని, దోపిడీ పీడనలతో అణచి వుంచే సామ్రాజ్యవాద దశ అత్యంత అభివృద్ధి నిరోధకమైనది, నిరంకుశమైనది, జాత్యహంకార పూరితమైనది. తన సంక్షోభపు ప్రభావాలనన్నిటినీ ప్రపంచ ప్రజానీకంపై రుద్దటంద్వారా తాను బతికి బట్టకట్టాలని చూస్తున్నది. సామ్రాజ్యవాదానికి చారిత్రకంగా కాలంచెల్లినా, అది కొనసాగు తూండటమే నేటి ప్రపంచపు విషాదాల్లో ముఖ్యమైనది.

## శాస్త్రీయ సోషలిజం

మార్క్స్ తన ముందు కాలం నాటికి జర్మనీ దేశంలో బాగా ఉచ్ఛదశలోనున్న తత్త్వశాస్త్రాన్ని లోతుగా అధ్యయనం చేసి హెగెల్ బోధనలలోని గతితార్కిక చింతననూ, లుడ్విగ్ ఫ్యూయర్బా లోని భౌతికవాద దృక్పథాన్ని గ్రహించి, గతితార్కిక భౌతికవాద తాత్త్విక దర్శనాన్ని రూపొందించినట్లే, ఇంగ్లాండ్ దేశంలో అప్పటికే బూర్జునా ఆర్థిక శాస్త్రవేత్తలయిన ఆడమ్ స్మిత్, డేవిడ్ రికార్డోలు విలువ, శ్రమ సిద్ధాంతాలకు వేసిన పునాదులపై పెట్టుబడిదారీ దోపిడీ సూత్రమైన అదనపు విలువ రహస్యాన్ని కనుగొన్నాడు. అలాగే.. ఫ్రెంచి విప్లవం నుండి, తదనంతరం

దాని ప్రభావంనుండి తలెత్తిన అనేక ఉదారవాద, ఊహాజనిత సోషలిజాలను పరిశీలించి వాటిలో తప్పును ఎత్తిచూపాడు, కార్మికవర్గ నాయకత్వాన పెట్టుబడిపై సాగించే విప్లవ విజయంతో ముడిపడిన, వ్యక్తిగత ఆస్తుల సమాజపు రద్దుతో తప్ప సాధ్యం కానిదైన శాస్త్రీయ సోషలిజాన్ని చారిత్రక పరిణామపు అనివార్యతగా నిర్ధారించాడు. దీన్నే యాంటీ డూరింగ్ పుస్తకంలో ఏంగెల్స్ ఇలా తెలియజేశాడు: "భౌతికవాద చారిత్రక భావన, అదనపు విలువ సిద్ధాంతం ద్వారా పెట్టుబడి ఉత్పత్తి రహస్య వివరణ అన్న ఈ రెంటినీ మార్క్స్ ఆవిష్కరించాడు. ఈ ఆవిష్కరణలతో సోషలిజం శాస్త్రంగా మారింది". "అజ్ఞానపుటంధ యుగంలో ఆకలిలో ఆవేశంలో తెలియని ఏ తీవ్రశక్తులో నడిపిస్తే నడిచే మనుష్యులు" – (శ్రీశ్రీ – దేశ చరిత్రలు')

వ్యక్తిగత ఆస్తుల సమాజపు లక్షణమైన వర్గదోపిడీ వర్గపీడన సాగుతున్న కాలం నుండీ తమవైన పద్ధతుల్లో పీడిత మానవ సమూహాలు వాటికి వ్యతిరేకంగా పోరాడుతూనే వున్నాయి. అవన్నీ చాలా కాలం తక్షణ ప్రతి చర్యలుగా, మానవ సహజాతాలుగా (ఇన్స్టింక్ట్స్‌గా) జరిగినవి. సమాజమంతా పునర్నిర్మాణం కావాలని శ్రమ జీవులకు ఈ దశలో కలిగే కోరికలు ఆలోచన ద్వారా వివేకం ద్వారా, దీర్ఘకాలిక దృష్టితోకాక హఠాత్తుగా, అప్రయత్నంగా, అనాలోచితంగా కలిగినవి. చాలా కాలం వరకు కార్మికులకు వర్గచైతన్యంగానీ, రాజకీయ పరిజ్ఞానం కానీ తగిన విధంగా లేకుండానే చరిత్ర సాగింది.

ఎప్పుడైతే మార్క్స్ – ఏంగెల్స్‌లు వర్గ పోరాటాన్ని సామాజిక చోదకశక్తి (మోటివ్ ఫోర్స్)గా గ్రహించారో, ఆస్తి సంబంధాల చరిత్ర చలన సూత్రాలను ఆవిష్కరించారో, అదనపు విలువ రహస్యాన్ని బట్టబయలు చేశారో, ఉత్పత్తి సామాజికం కావటమూ, పంపిణీ వ్యక్తిగతంగా సాగటమూ ఒక సంఘర్షణాత్మక వైరుధ్యంగా భావించారో దీనికంతటికీ శాస్త్రీయ సోషలిజమే పరిష్కారమార్గమని నిర్ధారించగలిగారు. ఆధునిక చరిత్ర నిర్మాతలైన ప్రజలను నడిపించే నాయకత్వ శక్తిగా కార్మికవర్గాన్ని పరిగణించారు. "బూర్జువా వర్గపు సమష్టి వ్యవహారాలు చక్కబెట్టే కమిటీలాంటి ఆధునిక రాజ్యాన్ని" (కమ్యూనిస్టు ప్రణాళిక) తన సంఘటిత పోరాటశక్తి ద్వారా స్వాధీనపరుచుకోవటమే సోషలిస్టు సమాజాన్ని నిర్మించే క్రమానికి షరతుగా బోధించారు.

ఏంగెల్స్ చెప్పినట్లు "గతితార్కిక దృష్టి నుంచి చూస్తే మానవ జాతి చరిత్ర గందరగోళంగా అనిపించదు. అర్థరహిత హింసాకృత్యాల సుడిగుండంలా కనిపించదు. అది ఇప్పుడు మానవ జాతి అభివృద్ధి క్రమంగా అర్థమవుతుంది. రీతి, రివాజ లేనట్టుగా కనిపించే పరిణామాల్లో అంతర్నిహితంగా వుండే క్రమాన్ని పసిగట్టటమే ఆలోచనకర్తవ్యంగా మారింది". (యాంటీ డ్యురింగ్ నుండి)

కారల్ మార్క్స్ ఆచరణతో సంబంధంలేని కేవలం సిద్ధాంతవేత్త కాదు. రాజకీయ, ఉద్యమ, నిర్మాణ కృషిలో ప్రత్యక్షంగా తలమునకలై పాల్గొన్న సజీవ విప్లవకారుడు. పుట్టిన దేశం నుండి బహిష్కృతుడైనా, ఇరుగు పొరుగు రాజ్యాలలో నిలువనీకపోయినా, కుటుంబ, ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో నిరంతరం సతమతమైనా, అనేకానేక సిద్ధాంత – రాజకీయ పెడధోరణులతో అనునిత్యం సంఘర్షిస్తూండినా 65 ఏళ్ల తన జీవిత సర్వస్వాన్ని మానవాళి ఉజ్వల భవిష్యత్తు కోసం అంకితం చేసిన అసమాన త్యాగజీవి. తాను స్వయంగా రాసిన పెట్టుబడి నాలుగు భాగాలూ, ఇతర గ్రంథాలూ, వ్యాసాలూ, ఉత్తరాలూ – అలాగే ఏంగెల్స్‌తో కలిసి చేసిన అనేక ప్రామాణిక రచనలూ, ఇంకా ఏంగెల్స్ రచనల సర్వస్వం.. వీటన్నిటి సారాంశమే మార్క్సిజంగా, ఆధునిక కార్మికవర్గ విమోచన శాస్త్రంగా, శ్రామిక విప్లవ సిద్ధాంతంగా చరిత్రలో నిలిచివుంది.

మార్క్స్ – ఏంగెల్స్ కాలంలోనే కార్మికవర్గ ఉద్యమంలో అనేక అవకాశవాద, దిగజారుడు, దొంగముఖాల బూర్జువా. ధోరణులను, అరాచకవాదులను వారు ఎదుర్కొన్నారు. వారి తదనంతరం లెనిన్–స్టాలిన్ మావోలు అనేక పెడధోరణులను ఎదుర్కొంటూ కార్మికవర్గ సిద్ధాంతాన్నీ, వర్గపోరాట పంథానూ నిలబెట్టారు. సామ్రాజ్యవాద వ్యతిరేక ప్రపంచ కార్మికవర్గ విప్లవ వ్యూహాన్ని అమలు జరిపారు. తమ తమ దేశాల్లోని శ్రమ దోపిడీశక్తులపై అలుపెరగని పోరాటం సాగించారు.

అయినా సామ్రాజ్యవాదులతో శాంతియుత సహజీవనం నెరపాలనుకున్న (రష్యా దేశపు) కార్మిక విద్రోహులదీ, బూర్జువా పునరుద్ధరణకు (చైనాలో) దారులువేసిన అవకాశవాదులదీ పైచేయి అయింది. సోషలిస్టు వ్యవస్థలు ఓటమికి గురయిన తర్వాత అమెరికా సామ్రాజ్యవాద అగ్రరాజ్య ఆధిపత్యానిది తాత్కాలిక ఏకధ్రువ ప్రపంచమైంది. అయినా ప్రపంచ పెట్టుబడిదారీ వ్యవస్థ సంక్షోభంలో కొట్టుమిట్టాడుతూనే వుంది. వర్గదోపిడీ తీవ్రంగా సాగుతూనే వుంది. పెట్టుబడిదారీ శక్తుల నడుమ పోటీ–కుమ్ముక్కులతో కూడిన సంఘర్షణ సాగుతూనే వుంది. ప్రపంచ వ్యాపితంగా శ్రమజీవుల పోరాటాలు తరతమస్థాయిలో జరుగుతూనే వున్నాయి. మార్క్స్– ఎంగెల్స్ బోధనల్లోని కార్మికవర్గ దృక్పథం, విప్లవ దార్శనికత శ్రమజీవుల కరదీపికగా, సైద్ధాంతిక ఆయుధంగా మరింత పదునెక్కి తళతళలాడుతూనే వున్నది. మనం అందుకోవలసినది ఈ విప్లవ మార్క్సిజాన్నే!

మార్క్సిజం అజేయం!

కార్మికవర్గ విప్లవం అనివార్యం !.

సోషలిజం సాధన సాధ్యం ! సాధ్యం !! ❑

# వ్యక్తిగత పొగడ్తలు, కీర్తి కాంక్షలపై మార్క్స్ వైఖరి శిరోధార్యం




పి.ప్రసాద్ (పిపి)

ఇటీవల సమాజంలో "వ్యక్తివాదం"(కెరీరిజం) బాగా పెరిగింది. ఇదేమీ కాకతాళీయ పరిణామం కాదు. ఇది పెట్టుబడి దారీ వ్యవస్థ సృష్టించే బౌద్ధిక ఉత్పత్తులలో ఒకటి. సాంస్కృతిక రంగంలో బూర్జువా వర్గ బైప్రొడక్ట్! ఇది ఆకాశం నుండో, గాలి నుండో అసంకల్పిత చర్యగా ఊడిపడే వస్తువు కాదు. బూర్జువా వర్గం ఉత్పత్తి చేసే కల్చరల్ సరుకుల్లో ఒకటి. పెట్టుబడిదారీ మార్కెట్‌లో ధర కట్టని అమూల్యమైన సరుకు! అది ఉత్పత్తి చేయడమే కాదు. అది స్వయంగా పెంచి పోషించే వికృతవాదం. దానికి కార్మిక సంఘాల, ప్రజా ఉద్యమ సంస్థల, ప్రజాతంత్ర సంస్థల నాయకులు, ఆర్గనైజర్లు దూరంగా వుండాలి. రాజకీయంగా స్ఫూర్తిదాత పాత్ర పోషించే కమ్యూనిస్టు సంస్థల మీద రాజకీయ బాధ్యత మరింత ఎక్కువ. ఈ తప్పుడు ధోరణులు కమ్యూనిస్టు ఉద్యమాన్ని వెంటాడతాయి. వాటికి వ్యతిరేకంగా నిరంతరం సాంస్కృతిక పోరాటం చేపట్టాల్సిన బాధ్యత కమ్యూనిస్టు పార్టీలపై వుంది. దిద్దుబాటు కృషి ఏ మేరకు జరుగుతుందో వాటి నుండి ఆ మేరకు అధిగమిస్తాయి. ఆ కృషి ఏ మేరకు చేపడుతూ వున్నాయో, ఏ మేరకు ఫలితాలు సాధిస్తూ వున్నాయో ఆయా కమ్యూనిస్టు సంస్థలకు సంబంధించిన విషయం. వాటి సంస్థాగత సమీక్ష విషయాలలోకి వెళ్లడం లేదు. కానీ వ్యక్తివాద ధోరణులు కమ్యూనిస్టు నిర్మాణాల ప్రభావంలోని ప్రజా ఉద్యమ సంస్థల, ప్రజా సంఘాలపై పడి క్రమంగా బలపడడం ఒక భౌతికసత్యం. అక్కడే ఆగలేదు. కమ్యూనిస్టు సంస్థలపైన వాటి ప్రభావం పడుతున్నది. వాట్సాప్, ఫేస్‌బుక్ వంటి ప్రచార ప్రక్రియ ఉనికిలోకి వచ్చాక కమ్యూనిస్ట్ సంస్థలపై ఎక్కువ స్థాయిలో పడసాగింది. అది దిగువ స్థాయి పార్టీ శ్రేణులకే పరిమితం కాలేదు. ఎగువ స్థాయి పార్టీ నాయకత్వ శ్రేణులకూ ఎగబాకుతున్న పరిస్థితి ఏర్పడింది. ఇది ఎగువస్థాయి పార్టీ నాయకత్వ శ్రేణులకు వ్యాపిస్తే, అది దిగువ స్థాయి శ్రేణులకు ఆదర్శంగా మారి పెద్ద ఊపు ఇస్తుంది. ఇది వ్యక్తిగతంగా ఎవరినీ ఉద్దేశించి చెబుతున్నది కాదు. నాతో సహా సకల కామ్రేడ్స్‌కి వర్తిస్తుందనే దృష్టితో చెబుతున్నది. తమను ఉద్దేశించి చేసే విమర్శగా వ్యక్తిగతంగా ఏ ఒక్క కామ్రేడ్ అపార్థం చేసుకోరని ఆశిస్తున్నా.

ఈ ప్రతిస్పందనకు మొన్నటి మేడే ఒక సందర్భం. కార్మికవర్గ సంస్థలకు చెందిన కొందరు కామ్రేడ్స్ ప్రతిస్పందనలపై ఇదొక ప్రతిస్పందన. ఒక్క మేడే సందర్భమే కాదు. భగత్‌సింగ్, అల్లూరి, జార్జిల నుండి చేగువేరా వరకు, మార్క్స్ నుండి మావో వరకూ, పూలే దంపతుల నుండి అంబేద్కర్ వరకు వర్ధంతులు, జయంతుల సందర్భాలకు వర్తించేదే. ఆ సందర్భాల్లో కొందరు కామ్రేడ్స్ అత్యుత్సాహం, మితిమీరిన ఉత్తేజాలతో వ్యక్తీకరించే అభినందన పరంపరలను, ప్రతిస్పందనల్ని దృష్టిలో ఉండి స్పందిస్తున్నా. వర్ధంతులు లేదా జయంతులు జరిగిన సందర్భాలలో లేదా చారిత్రిక సంఘటనలు, విప్లవ వార్షికోత్సవాల సందర్భాలలో లేదా కార్మికవర్గ, పీడితవర్గ పోరాటాలు విజయాలు సాధించిన సందర్భాల్లో సోషల్ మీడియా వేదిక ద్వారా కామ్రేడ్స్ నుండి ప్రతిస్పందనలు వ్యక్తం కావడం తెల్సిందే. అవి నివాళి సందేశాలు కావచ్చు. సానుభూతి సందేశాలు కావచ్చు. సంఘీభావ సందేశాలు కావచ్చు. శుభాకాంక్షల సందేశాలు కావచ్చు. అభినందన సందేశాలు కావచ్చు. వాటికి తమ పదవులను జోడించడం అలవాటుగా మారింది. అక్కడితోనూ ఆగకుండా తమ స్వంత ఫోటోలను సైతం కొందరు కామ్రేడ్స్ జోడిస్తున్నారు. ఇటీవల ఇదో తప్పుడు ధోరణిగా బలపడుతోంది.

మొన్నటి మేడేని ఒక ఉదాహరణగా ఎంచుకొని ప్రస్తావన చేస్తున్నా. కొన్ని కార్మిక సంస్థలకు చెందిన కొందరు ఆర్గనైజర్లు తమ మిత్రులు, సాటి కామ్రేడ్స్ ముఖ్యంగా కార్మికోద్యమ సహచరులకు మేడే సందర్భంగా విప్లవ శుభాకాంక్షలు చెప్పడం అర్థం చేసుకోదగిందే. అందులోనూ కీర్తి కాంక్ష ఉండదని చెప్పలేం. అది వ్యక్తివాదాన్ని ప్రోత్సహించే ప్రచారానికి అవకాశం ఇవ్వకూడదు. అది సమిష్టి సంస్కృతికి లోబడాలి. పోనీ దానిని అర్థం చేసుకుందాం. అది ఇప్పుడు "పేరు కాంక్ష" నుండి "ఫోటో కాంక్ష" వరకూ విస్తరించింది. ఉదాహరణకి మేడే విప్లవ శుభాకాంక్షలు చెప్పడానికి తమ స్వంత ఫోటోలను జోడించడం ఏ సంస్కృతి? శ్రామిక సంస్కృతి అవుతుందా? బూర్జువా సంస్కృతి అవుతుందా? సమిష్టి సంస్కృతి అవుతుందా? వ్యక్తివాద సంస్కృతి అవుతుందా? కొందరి ప్రచార సరళి చూస్తే వారి మేడే సందేశాలలో చికాగోలో ఉరితీయబడ్డ అమర కార్మిక యోధుల ఫోటోలు వుండవేమో గానీ, తమ వ్యక్తిగత ఫోటోలు మాత్రం విధిగా వుండే పరిస్థితి. పైగా అలంకరించిన తమ ఫోటోల్ని జోడించి పంపే తీరు చూస్తున్నాం. మేడే మనకు ఏమి నేర్పినట్లు? ఇది నేటికీ అరుదైన, స్వల్పమైన ధోరణిగానే వుంది. సంతోషిద్దాం. నేడు బీజ రూపంలో మొదలైనది. మున్ముందు వట వృక్షంగా ఎదగదని చెప్పగలమా ? **(మిగతా 24వ పేజీలో)**

# ఫాసిజం అంటే నియంతృత్వానికి మించి!



- డి.రమేష్ పట్నాయక్

ఈమధ్య కాలంలో ఫాసిజంపై జరుగుతున్న చర్చల్లో నియంతృత్వాన్నీ ఫాసిజాన్నీ ఒక్కటిగా చూసే గందరగోళం కనిపిస్తుంది. ఫాసిజం నియంతృత్వమే కాని, ప్రతి నియంతృత్వం ఫాసిజం కాదు. ఫాసిజం సమాజంలో ఒక లేక కొన్ని విభాగాలను (మైనారిటీ విభాగాలను) ఇతరులుగా (others) చూపిస్తుంది. మైనారిటీలను మెజారిటీ ప్రజానీకానికి శత్రువులుగా చూపిస్తుంది. దేశ అభివృద్ధికి ఆటంకమైన వారిగా, దేశ రక్షణకు ప్రమాదకరమైన వారిగా చూపిస్తుంది. మైనారిటీలకు వ్యతిరేకంగా మెజారిటీ ప్రజానీకాన్ని సమీకరిస్తుంది. ఇది జాతి హననం దాకా వెళ్తుంది. జర్మనీలో ఇది 90 లక్షల యూదుల్లో 60 లక్షల యూదుల ప్రాణం తీసింది. నిజానికి ఈ విధంగా మైనారిటీ, మెజారిటీ అనే భావజాలాన్ని రూపొందించడంలోనే కుట్ర ఉంది. భారతదేశంలో ఒక్క ఆరెస్సెస్ మాత్రమే మైనారిటీలను ఇతరులుగా చూస్తుంది. వారిని అభివృద్ధిని అడ్డుకునే వారిగా, దేశ రక్షణకు ప్రమాదకారులుగా, శత్రువులుగా చూపిస్తుంది. వారికి వ్యతిరేకంగా వందేళ్లుగా భావజాలాన్ని నిర్మించింది. అటువంటి సిద్ధాంతాన్ని రూపొందించుకుని, అందుకు తగిన నిర్మాణాన్ని తయారు చేసుకున్న ఆరెస్సెస్‌ను మాత్రమే మనం ఫాసిస్టు సంస్థ అనగలం.

కాంగ్రెస్ విషయం వేరు. ఇందిరాగాంధీ చనిపోయిన సందర్భంలో పెద్ద ఎత్తున సిక్కు వ్యతిరేక అల్లర్లు చెలరేగిన మాట వాస్తవమే. వాటిని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం అనుమతించిన, ప్రోత్సహించిన మాటా వాస్తవమే. కాని అది మహా అయితే ఎన్నికల ఎత్తుగడ మాత్రమే. సిక్కు వ్యతిరేకత కాంగ్రెస్ సిద్ధాంతంలో భాగమని రుజువు చేయలేం. హైదరాబాద్‌లో ఎన్టీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టడానికి ఒకసారి, చెన్నారెడ్డి ప్రభుత్వాన్ని పడగొట్టడానికి మరొకసారి కాంగ్రెస్ హైదరాబాద్‌లో మత కలహాలు సృష్టించిన అనుభవం మనకుంది. ఆ కలహాలు కూడా తక్షణ రాజకీయ అవసరాలకు సృష్టించబడినవేగాని మతోన్మాద రాజ్య స్థాపనకు జరిగినవి కావు. ఫాసిజం ప్రధాన లక్షణమైన మెజారిటీ ఉన్మాదం కాంగ్రెస్ సిద్ధాంతం కాదు. కాంగ్రెస్ పార్టీ 1975లో ఎమర్జన్సీ విధించి నియంతృత్వ పాలన సాగించింది. మెజారిటీ ప్రజలను మైనారిటీ ప్రజల మీదకు ఉసిగొల్పలేదు. అది ప్రజలందరిపైన జరిగిన రాజ్యహింస. నేడు కూడా రెండు తెలుగు రాష్ట్రాల్లోనే కాక అనేక బీజేపీయేతర ప్రభుత్వాలు ప్రజల, ప్రతిపక్షాల హక్కులను కాలరాస్తున్నాయి. అయినా ఈ పార్టీలు ఒక మతాన్ని మరొక మత ప్రజల మీదకి ఉసిగొల్పటం లేదు. సమాజంలో ఒక విభాగాన్ని బయటవారిగా చూపించడం లేదు. కావున ఆ పార్టీలను ఫాసిస్టు పార్టీలుగా చెప్పలేం.

హక్కుల విషయానికి వస్తే, "పెట్టుబడిదారీ వ్యవస్థలో ప్రజలకు హక్కులు ప్రయత్నరహితంగా లభించవు. ప్రజలు తమ పోరాటాల ద్వారానే వాటిని సాధించుకోవాలి, నిలబెట్టుకోవాలి" అని మార్క్సిస్టు రచయిత డేవిడ్ హార్వే చెప్పాడు. నేడు వివిధ రాష్ట్రాల్లో వివిధ పార్టీల నియంతృత్వాన్ని అందరూ గమనిస్తున్నారు. అయితే ఆ పార్టీలను ఫాసిస్టు పార్టీలని చెప్పలేం. నియంతృత్వ పాలన దీర్ఘకాలంగా ప్రజలకు స్వానుభవం. కాగా ఫాసిజం ఇప్పుడు సంఘ్ పరివార్ నాయకత్వంలో మతోన్మాదంగా, మనువాదంగా విజృంభిస్తున్నది. నియంతృత్వానికి ఆధిపత్య ఉన్మాదం కలసినప్పుడే అది ఫాసిస్టు రూపాన్ని తీసుకుంటుంది.

'కార్పొరేటు పెట్టుబడి లూటీ'ని ముందుకు తీసుకువెళ్ళడం ద్వారా మాత్రమే సంఘ్ పరివార్ శక్తులు హిందూ రాష్ట్ర ఏర్పాటుకు అవసరమైన ప్రయత్నాలు చేయగలవు. అందుకే వారు తమ హిందూత్వ ఎజెండాను ముందుకు తీసుకువెళ్ళడానికి కార్పొరేటు ప్రయోజనాలను కాపాడుతూ, ఇంకా ప్రధానంగా ఎంపిక చేసుకొన్న కొన్ని కార్పొరేటు సంస్థల ప్రయోజనాలకు ఎక్కువ ప్రాధాన్యతనిస్తూ ముందుకు వెళ్తున్నారు. వారు ఎంపిక చేసుకొన్న కార్పొరేటు సంస్థల ప్రయోజనాలకు అనుకూలంగా వారు చూపిస్తున్న పక్షపాత ధోరణి అన్ని అవధులను దాటుతూ ఉంది. వారు చేపడుతున్న మతోన్మాద చర్యలు వాస్తవ సమస్యల నుంచి ప్రజల దృష్టిని మరల్చడానికి ఉపయోగపడుతున్నాయన్నది వాస్తవమే. అయితే, అంతకంటే ఆ చర్యలు దేశాన్ని 'హిందూరాష్ట్ర' వైపు నడిపిస్తున్నాయి. వారు తక్షణ, దీర్ఘకాలిక ప్రయోజనాలను కూడా పొందుతున్నారు. బీజేపీ చర్యల్లో పాలక కార్పొరేటు శక్తుల తక్షణ ప్రయోజనాన్ని మాత్రమే చూడగలుగుతున్నవారు ఆరెస్సెస్ యొక్క దీర్ఘకాలిక, విస్తృత లక్ష్యమైన 'హిందూరాష్ట్ర' ను చూడలేకపోతున్నారు. సంఘ్ పరివార్ చర్యలను 'అసలు సమస్యల నుంచి దృష్టి మరల్చే విషయాలు' గా తీసిపారేస్తున్నారు. ఇది చాలా ప్రమాదకరమైన ధోరణి.

ఆరెస్సెస్ ఒక ఉన్మాద సిద్ధాంతానికి బద్ధులైన కార్యకర్తలున్న సంస్థ; విస్తృత సమాజంలోకాని, తన సొంత నిర్మాణంలో కాని ప్రజాస్వామిక సూత్రాలకు తావుండకూడదని నమ్మే సంస్థ. ఆరెస్సెస్‌కు ఈ సిద్ధాంత భావజాలంపై సమీకరించబడిన, శిక్షణ

పొందిన బలగం ఉంది. వారి ప్రతి చర్య 'హిందూ రాష్ట్ర' స్థాపన కొరకే. 'హిందూ రాష్ట్ర' వారికి ఒక ఎన్నికల ఎత్తుగడ లేదా ప్రజల అసంతృప్తులను పక్కదారి పట్టించే మార్గం మాత్రమే కాదు. అదే వారి లక్ష్యం. అటువంటి లక్ష్యాన్ని సాధించడం సాధ్యం కాకపోవచ్చు, సాధించినా జర్మనీలో రద్దు చేయబడినట్లు రద్దుచేయబడుతుంది. కాని ఆ క్రమాన్ని అడ్డుకోకపోతే, రెండు మూడు దశాబ్దాల పాటు కనీవినీ ఎరుగని రక్తపాతాన్ని చూస్తాం.

ఆర్థిక విధానాల్లో కాంగ్రెస్, బీజేపీలు రెండూ కార్పొరేట్ ఎజెండానే అమలు చేస్తాయి. అయితే రాజకీయ రంగంలో ఒక ముఖ్య వ్యత్యాసం ఉంది. పాలక వర్గ రాజకీయాలు ప్రధానంగా ప్రజా ఉద్యమాలకు వ్యతిరేకంగా ఉంటాయి. ప్రజా ఉద్యమాలను బలహీనపరచడానికి కాంగ్రెస్ ఒక మార్గాన్ని అనుసరిస్తే బీజేపీ మరొక మార్గాన్ని అనుసరిస్తున్నది, అదే వ్యత్యాసం. 2004–2014 కాలంలో కేంద్ర కాంగ్రెస్ ప్రభుత్వం నయా సరళీకరణ విధానాలను నెమ్మదిగా అమలు చేస్తూ, కొన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి పెద్ద తిరుగుబాట్లు రాకుండా చూసుకుంది. బీజేపీయేతర పార్టీలన్నీ ప్రధానంగా కాంగ్రెస్ పద్ధతినే అనుసరిస్తాయి. అది కీన్స్ 'సంక్షేమ రాజ్యం' తో కొంత పోలిక కలిగి ఉంటుంది. ఇక బీజేపీ విషయానికి వస్తే ఆ పార్టీ నయాసరళీకరణ విధానాలను తీవ్రస్థాయికి తీసుకుపోతూ, అదే సందర్భంలో సంక్షేమ కార్యక్రమాలను నీరుగారుస్తూ, ఫలితంగా ప్రజలనుంచి వస్తున్న అసంతృప్తిని పక్క మార్గం పట్టించడానికి మతోన్మాదాన్ని ఉపయోగిస్తున్నది. ఆ క్రమంలో తన సొంత ఎజెండా అయిన 'హిందూ రాష్ట్ర' నిర్మాణానికి పునాదులు వేసుకుంటున్నది.

ఆరెస్సెస్ వారు తమ సిద్ధాంతానికి 'హిందుత్వ' అని ముద్దు పేరు పెట్టుకున్నారు. ఈ సిద్ధాంతాన్ని ప్రజాస్వామిక వాదులు అదే పేరుతో పిలవటం ఆత్మహత్యా సదృశం. సంఘ్ సిద్ధాంతం మతతత్వం, మనువాదంపై ఆధారపడి ఉంది. వారు భారత రాజ్యాంగాన్ని బహిరంగంగా తూలనాడుతున్నారు. మనువాదంపై ఆధారపడిన రాజ్యాంగాన్ని రాయాలని 1950లోనే వారు చెప్పారు. వర్ణవ్యవస్థను పునరుద్ధరించటం ద్వారానే హిందూజాతి బలమైన జాతిగా అభివృద్ధి చెందగలదని గట్టిగా నమ్ముతారు. మతతత్వాన్ని వారు ప్రజలను పక్కదారి పట్టించడానికి మాత్రమే తీసుకురావటం లేదు. అధిపత్య వ్యవస్థను, నిచ్చెనమెట్ల వ్యవస్థను స్థాపించడానికి వివిధ రకాల ఉన్మాదాలను పెంచిపోషిస్తున్నారు. మైనారిటీలపైన మెజారిటీ ఆధిపత్యం, అగ్రవర్ణాధిపత్యం, సాంస్కృతికాధిపత్యం, పురుషాధిపత్యం వారి సిద్ధాంతం. ఫాసిజం ఒక ఆధిపత్యాల సిద్ధాంతం.

పార్లమెంటు ద్వారా సోషలిజం రాదు, కాని ఫాసిజం రాగలదు. అందుకే ఫాసిజాన్ని అడ్డుకోదలచిన వారు పార్లమెంటును నిర్లక్ష్యం చేయలేరు. ఎన్నికలను సొంత పార్టీ ప్రయోజనాలకు పరిమితం చేయలేరు. ప్రస్తుత పరిస్థితుల్లో సంతోషించాల్సిన విషయమేమంటే ప్రజలింకా మతోన్మాదులుగా మారిపోలేదు. బీజేపీ దుష్పరిపాలనను గ్రహిస్తూనే ఉన్నారు. అందుకే అనేక రాష్ట్రాల్లో బీజేపీ ఓడిపోయింది. రానున్న ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో బీజేపీ, దాని బహిరంగ, లోపాయికారీ మిత్రపక్షాలు అధికారంలోకి రాకుండా వామపక్ష, ప్రజాస్వామిక, లౌకిక, ప్రతిపక్ష శక్తులు కలసి ప్రయత్నాలు చేయాలి. బీజేపీ తిరిగి అధికారంలోకి వస్తే రాజ్య వ్యవస్థ (కార్యనిర్వాహక వర్గం, న్యాయాంగం, సైన్యం, పోలీసు) మొత్తం పరివార్ శక్తులతో నిండిపోగలదు. అప్పుడు పార్లమెంటు రద్దు కావచ్చు లేదా పూర్తిగా విలువలేనిదిగా మారిపోవచ్చు. **(ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# వ్యక్తిగత పొగడ్తలు, కీర్తి కాంక్షలపై మార్క్స్ వైఖరి శిరోధార్యం

**(21వ పేజీ తరువాయి)**

మేడేని ఉదహరించా. మిగిలిన వర్ధంతుల, జయంతుల వంటి సందర్భాలకి సైతం తరతమ స్థాయిల్లో ఇది వర్తిస్తుంది. వ్యక్తిగత పొగడ్తలు, కీర్తి కాంక్ష, ఆత్మస్తుతి వంటి తప్పుడు ధోరణులపై మార్క్స్ ప్రతిస్పందన ఏమిటో తెలుసుకుందాం. తన మరణానికి దాదాపు ఐదున్నర ఏళ్లకు ముందు 1877 నవంబర్ 10 తేదీ హంబర్గ్‌లోని బ్లోస్ అనే తన మిత్రుడికి మార్క్స్ ఒక చిన్న లేఖ రాశాడు. దాని నుండి అవసరమైన మూడు వాక్యాలను క్రింద ఉదహరిస్తున్నా. తనతో ఎంగెల్స్‌ని కలుపుకొని ఆయన రాసిన వాక్యాలవి. ఇవి వ్యక్తిగత పొగడ్తల పట్ల మార్క్స్ వైఖరిని అర్థం చేసుకోవడానికి సహకరిస్తాయి. మా ఇద్దరిలో ఏ ఒక్కరమూ కీర్తి సంపాదనకు గడ్డిపరక ఎత్తు విలువ ఇవ్వం. దీనికి రుజువు ఏమిటంటే, ఉదాహరణకు అన్ని రకాల వ్యక్తి పూజ పట్లా నాకున్న అసహ్యత మూలంగా వివిధ దేశాల నుండి వస్తూ ఉండిన అభినందనపూర్వక పలు వ్యక్తీకరణలను (ఇంటర్నేషనల్ అస్తిత్వ కాలంలో వాటితో నన్ను వేధిస్తుండే వారు) నేను ఎన్నడూ పైకి పొక్కనివ్వలేదు. అడపా దడపా చీవాట్లు పెడుతూ తప్ప నేను ఎన్నడూ వాటికి జవాబు రాయనూ లేదు.

మార్క్స్ చెప్పిన మూడు వాక్యాలు మనకు ఎన్నో పాఠాలు నేర్పుతాయి. ఆదర్శంగా తీసుకుందాం. ఆదర్శంగా తీసుకుంటే సరిపోదు. వాటిని మన విప్లవాచరణలో కూడా మార్గదర్శకంగా తీసుకొని ఆచరిద్దాం. మార్క్స్ నుంచి నేర్చుకోవడానికి పూనుకుందాం. నాతో సహా మనలో ఎవరిలో ఏ లోపాలున్నా వినయంగా గుర్తించి దిద్దుకుందాం. మనకు తెలియకుండా మన మనస్సులను ఆవహిస్తున్న బూర్జువా భావజాల ధోరణులను మార్క్స్ అందించిన విప్లవ సాంస్కృతిక కళా ఖడ్గంతో నరికివేసి దాని నుండి మనల్ని మనం విముక్తి చేసుకుందాం. ❑

# జీవన వ్యవస్థగా మారుతున్న ఫాసిజం



- ఎస్.గోవిందరాజులు

ఇటీవలి కాలంలో ఫాసిజం అనే పదం అనేక మంది నోట తరచుగా వినవస్తోంది. బీజేపీ రెండోసారి కేంద్రంలో అధికారాన్ని చేపట్టిన తరువాత దీని గురించిన చర్చ అధికమైంది. నిరంకుశత్వం, అణచివేత, నిర్బంధం, హక్కుల హననాన్ని ఫాసిజానికి పర్యాయపదాలుగా వాడుతుంటారు. అధికార పార్టీ సాగిస్తున్న నియంతృత్వ పాలన ఫాసిజమేనని, ప్రభుత్వాధినేతను ఫాసిస్టు అని ప్రతిపక్షం ఆరోపించడం పరిపాటి అయింది. అయితే ఫాసిజమనే భావనను ఈ తరహా సాధారణ అవగాహనకు కుదించడం సరైందేనా? ఎందుకంటే రెండో ప్రపంచయుద్ధంలో జర్మనీ, ఇటలీ, జపాన్ కూటమి సైనికంగా ఓడిన తరువాత మానవాళికి ఫాసిజమనే ప్రమాదం తప్పిందని చాలామంది భావించారు. కానీ అది వాస్తవం కాదని తర్వాతికాలంలో స్పష్టమైంది. ఫాసిస్టులు సైనికంగా ఓటమి చెందినప్పటికీ, అది ఒక ప్రగతినిరోధక భావజాలంగా అన్ని సామ్రాజ్యవాద, పెట్టుబడిదారీ దేశాలలో వ్యాప్తిచెందడం కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన పశ్చిమదేశాలలోనే కాక ఆఫ్రికా లాంటి వెనుకబడిన దేశాలలో కూడా ఫాసిజం ఒక సార్వత్రిక దృగ్విషయంగా మారింది. ఇందుకు మనదేశం ఏ మాత్రం మినహాయింపు కాదు.

ఫాసిజం పోకడలను నిశితంగా పరిశీలిస్తే, సమాజపు నియమానుగత ప్రగతిని నిరోధించడానికి, అట్టడుగు పీడితప్రజల చైతన్యంతో సాగించే పోరాటాన్ని అడ్డుకోవడానికి తలెత్తిన ఒక రాజకీయ, ఆర్థిక, సైద్ధాంతిక, తాత్వికభావజాలంగా దాన్ని పరిగణించవచ్చు. 17, 18 శతాబ్దాలలో అప్పటి రాజరికపాలనను తొలగించి, ఆధునిక ప్రజాస్వామ్య వ్యవస్థల ఆవిర్భావానికి నాయకత్వం వహించిన సామాజికశక్తులు ఒకదశ వరకు సమాజానికి దిశా నిర్దేశం చేశాయి. మార్క్సిస్టు పరిభాషలో వీరిని పాలక బూర్జువావర్గం అంటారు. అయితే వీరు కాలక్రమంలో మరొక రూపంలో దోపిడి, పీడనల వ్యవస్థను ప్రతిష్ఠించి, గుత్తపెట్టుబడికి జన్మనిచ్చి, ప్రగతి నిరోధక శక్తులుగా రూపాంతరం చెందారు. నాటి స్వేచ్ఛాయుత మార్కెట్ స్థానంలో సామ్రాజ్యవాదం పాదుకుని సామాజికరంగాలు అన్నింటా సంక్షోభం వ్యాపించింది. తదుపరి దశలో, ఒకనాడు వీళ్లు ఘనంగా ఎలుగెత్తి చాటిన స్వేచ్ఛా, సమానత్వ, సౌభ్రాతృత్వ నినాదాలను, శ్రేయోరాజ్య స్థాపన ప్రకటనలను, మ్యాగ్నాకార్టాలను, ప్రజాస్వామ్య హక్కుల పత్రాలను, రాజ్యాంగపీఠికలను 20వ శతాబ్ది తొలినాళ్లనుంచి వాళ్లే కాలరాసేయడం ప్రారంభమైంది. దీనికి ప్రతివాదంగా కార్మికవర్గ పోరాటాలు, తిరుగుబాట్లు, విప్లవాత్మక మార్పులు ప్రపంచమంతటా ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఈ పరిణామాల కారణంగా పాలకశక్తులలో కమ్ముకున్న మరణభీతి వాళ్లు ఫాసిజాన్ని ఆశ్రయించేలా చేసింది. ఈ నేపథ్యంలో కార్మికవర్గ విప్లవాన్ని నివారించడానికి, తమ పాలనను సుస్థిరం చేసుకోవడానికి పాలకవర్గాలు ముందస్తుగా చేపట్టే ఒక సమగ్ర ప్రగతినిరోధక పథకాన్నే ఫాసిజంగా నిర్వచించడం అధునాతన అవగాహన అవుతుంది. మన దేశంలో 20వ శతాబ్ది ద్వితీయార్థంలో మార్క్సిస్టు అవగాహనను బహుముఖంగా పెంపొందించిన శిబ్దాస్ ఘోష్ రచనలలో ఈ ఫాసిజం గురించిన లోతైన అధ్యయనాన్ని మనం గమనించవచ్చు. ఆయన పరిశీలనల ప్రకారం ఫాసిజానికి ఉన్న మూడు మౌలిక లక్షణాలను ఆర్థిక, రాజకీయ, సాంస్కృతిక, తాత్విక పార్శ్వాలుగా విడదీసి అర్థం చేసుకోవచ్చు. **ఒకటి :** ఆర్థికంగా సామాజిక సంపద భారీస్థాయిలో కొద్ది మంది చేతు ల్లోనే పోగుపడడం. **రెండు :** రాజకీయంగా అడ్మినిస్ట్రేటివ్ బ్యూరో క్రసీ చేతుల్లో అధికారాలన్నీ కేంద్రీకృతం కావడం. ఈ రెండూ రాజ్యాన్ని కార్పొరేట్ సంస్థల ప్రయోజనాలతో మమేకమై పనిచేసేలా తీర్చిదిద్దుతాయి. **మూడు :** సాంస్కృతిక రంగంలో ప్రజల ఆలోచనలలో అధ్యాత్మికవాదాన్ని సైన్సులోని సాంకేతిక అంశాలతో మిళితం చేయడం.

ఒకచోట శిబ్దాస్ ఘోష్ ఇలా రాశాడు "ఫాసిజం ఒక వైపు ప్రజల్లో హేతుబద్ధ ఆలోచనా ప్రక్రియను నాశనం చేస్తుంది. వారిని పచ్చి స్వార్థపరులుగా మారుస్తుంది. జ్ఞానం, అధ్యయనం, విద్యా రంగాలను సాంకేతిక అంశాలకు పరిమితమయ్యే విధంగా చేస్తుంది. దీని అర్థం అన్ని రకాల మానవ విలువలను పూర్తిగా పరిత్యజించి, సమాజం పట్ల బాధ్యతాయుతమైన భావన లేవీ లేని ఒక టెక్నోక్రాట్ల సమూహాన్ని సృష్టిస్తుంది. వీరికి ఉద్యోగం, వేతన బానిసత్వమే పరమావధిగా ఉంటాయి. డబ్బు కోసం ఏమైనా, ఏదైనా చేయడానికి వీరు సిద్ధంగా ఉంటారు. ఇలాంటి మార్గం వైపు వారు సైన్సును, అధ్యయనాన్ని మళ్లిస్తారు. మరోవైపు ఫాసిజం అన్నిరకాల ఆధ్యాత్మిక వాదాన్ని, మూఢ నమ్మకాలను, అహేతుక మనస్తత్వాన్ని, గుడ్డితత్వాన్ని పెంచి పోషిస్తుంది. వీటన్నిటిని సాంకేతిక అంశాలతో విచిత్రంగా మిళితం చేస్తుంది". జనావళిలో ఈ మూడు లక్షణాలు పెరిగే కొద్దీ ప్రగతి నిరోధక శక్తులకు బలం చేకూరుతుంది. వారు పరిరక్షించడానికి పూనుకున్న ప్రగతి నిరోధక వ్యవస్థకు జీవనకాలం పెరుగుతుంది. ఫాసిజం రూపు రేఖల విషయానికి వస్తే ఆయా స్థల కాలాదులను బట్టి **(మిగతా 26వ పేజీలో)**

# మతతత్వ ఫాసిజాన్ని ప్రశ్నించిన కథలు



- రాఘవ


చీకటి జైలు గదిలాంటి బురఖాలో ఊపిరాడని ఉజ్మా. అత్తరు స్నేహ పరిమళాన్ని పంచిన సాహిల్ దర్జీ దుకాణం విధ్వంసం. అమెరికాలోనూ సెంటిమెంట్ల వెనుకబాటుతనం. కరోనాని మించిన కుల పిచ్చి, మత పిచ్చి. కబరిస్థాన్‌గా మారుతున్న అందమైన కశ్మీర్. గోసంరక్షణ పేరుతో ఘోరమైన దాడులు. ఇలాంటి ముస్లింల జీవిత అస్తిత్వ పోరాట కథల సమాహారం గీతాంజలి 'అత్తరు మునక' పహెచాన్-2 కథల సంపుటి.

### సిక్స్ పాక్ రాముడు

చనిపోయిన ఆవు చర్మం ఒలుస్తుంటే, ఆవును చంపారని గో సంరక్షకుల దాడి. గుళ్లలోకి రానివ్వరు. మా చిన్నప్పుడు రాముడు మంచి బాలుడు. ఇప్పుడు సిక్స్ పాక్ బాడీతో, ఉగ్రరూపంతో రగిలిపోతూ కనిపిస్తాడు. గ్రామాల్లో ఒకప్పుడు కుల రాజకీయాలే. ఇప్పుడు మత రాజకీయాలు తోడైన వైనాన్ని దృశ్యమానం చేసిన కథ 'పిలగా.. పక్కకు జరుగు'.

### ఎక్కడి నుంచి ఎక్కడికెళ్లాం !

అపార్ట్‌మెంట్ నిర్మాణానికి ముస్లిం కూలీలు చెమటోడ్చి పనిచేసినా, వారికి మాత్రం ఫ్లాట్ అమ్మమని ఏజెంట్ అంటాడు. దానికి నిరసనగా భార్యాభర్తలు సుధ, ఇంద్ర కొనకుండా వెనుదిరుగుతారు. అమెరికాలో ఉంటున్న వారి ఇద్దరు కూతుళ్లు తుషార్, శిశిర అక్కడి పరిస్థితులను తల్లికి ఫోన్ చేసి, 'గత ఏడేళ్లుగా పిల్లలకు 'జై శ్రీరాం' అని రాసిన కాషాయరంగు రిబ్బన్లు కడుతున్నారు. గాయత్రీ మంత్రాలు, హనుమాన్ చాలీసాలు, రాముని స్తోత్రాలు చదివిస్తున్నారు. ఇండియా జెండాల పక్కన కాషాయ జెండాలు ఎగరేశారు. 'వుయ్ ఆర్ హిందూస్' అని చెప్పుకునే దాకా వెళ్లారు. 'సీ బ్యాచ్' అంటే చిరంజీవి ఫ్యాన్ బ్యాచ్ అని, 'చౌ బ్యాచ్' అంటే చౌదరి (బాలకృష్ణ) బ్యాచ్ అని ఒకరినొకరు కొట్టుకు చస్తున్నారు కులపిచ్చితో. అరెరే ! మనం ఎక్కడి నుంచి ఎక్కడికెళ్లిపోయాం !' బాధపడి పోతారు అక్కా చెల్లెళ్లు 'రియల్ ఎ(స్టేట్)'లో.




పుస్తకం పేరు : అత్తరు మునక
రచయిత్రి : గీతాంజలి (8897791964)
పేజీలు : 213 - వెల : 250
ప్రచురణ : అజు పబ్లికేషన్స్
ప్రతులకు : అమెజాన్‌లో,
అన్ని ముఖ్య బుక్ షాపుల్లో..

### కరోనాకంటే భయంకరం

కరోనా విషాదకాలంలో, దానికంటే భయంకరమైన కులం, మతం వివక్షతో కూడిన మానవ సంబంధాలు. వంటమనిషిగా ఉన్న మరియంను మానిపించేస్తేనే వస్తానని అత్త మొండికేస్తుంది. బతకలేక, చేసిన దొంగతనం బైటపడితే మరియం భర్త జేమ్స్ ఉరి వేసుకుని మరణిస్తాడు. కరోనాలో గర్భిణీకి చికిత్స నిరాకరించడంతో తల్లీ బిడ్డ మరణించడం, రాకేష్‌కు ఉద్యోగం ఊడడం వంటి విషాదాలు. కరోనాకు కుల పిచ్చి లేదు. ఎవరి నైనా ఎలా కాటేస్తుందో 'దూరం.. దూరం..' కథలో కనిపిస్తుంది.

### ఖబరిస్థాన్‌గా కశ్మీర్ !

'కరెంటు, ఫోన్లు, ఇంటర్‌నెట్ అన్నీ బంద్. అబ్బా ఎన్‌కౌంటర్ అయినప్పటి నుంచి అమ్మ ఎంత కష్టపడి పెంచిందో! తమ్ముడు(సమర్) గాయబ్ అయ్యి నెల రోజులైంది. మిలటరీ వాళ్లు కాలిస్తే, నాలుగేళ్ల చిన్నారి సహా కుటుంబం అంతా గాయపడింది. మగవాళ్లను బయటకు పంపితే కాల్చి పడేస్తున్నారు. ఎత్తుకు పోతున్నారు. ఆడవాళ్లను సతాయిస్తున్నారు. ఇక్కడ ఎప్పుడూ కర్ఫ్యూనే. తమ అన్నదమ్ములను, అబ్బాలను చంపిన మిలటరీ పైన పిల్లలు రాళ్లు రువ్వుతున్నారు. ఆజాదీ కోసం చనిపోయిన అబ్బా కల నిజమైతే చూద్దాం అనుకున్నాం. కానీ ఆ కల ఛిద్రమైంది. ప్రతిరోజూ మృత్యువు వస్తూ పోతూ ఉంది. ఎప్పట్నుంచో కశ్మీర్ ఖబరిస్థాన్(శ్మశానం) అయిపోయింది. అడుగుకో లాష్ దాచుకున్న సమాధి భూమి.' అంటూ కశ్మీర్‌లో ఉన్న ఒక యువతి, తన అక్కకు రాసిన ఉత్తరం 'రాళ్లు రువ్వే పిల్లాడు..!' కథలో నేటి కశ్మీరీల స్థితిగతులు అర్థమవుతాయి.

### ఇది మునుపటి భారత్ కాదు

'ఒద్దు రా, కుర్తా పైజామాలో నువ్వు ముస్లింవని తెలిసి పోతుంది. వాళ్లేమైనా చేస్తారు' అంటుంది అమ్మీ. అబ్బాజాన్‌ని కూడా కుర్తాపైజామాతో బయటకు పోనివ్వదు. ఆడవాళ్లనైతే బుర్ఖా

వేసుకోనివ్వదు. బీఫ్ వ్యాపారం చేస్తున్నాడని, ఆవుల్ని చంపుతున్నాడని వాళ్ల చిన్నతమ్ముడు రఫీక్‌ను కొట్టి చంపినప్పటి నుంచి ఆ తల్లికి భయం మొదలైంది. తమ్ముళ్లిద్దరికీ గడ్డాలు తీయించేసింది. తలపై టకియా కూడా వేసుకోవద్దంటుంది. 'మనం ముసల్మాన్లమన్న విషయం మర్చిపోండి. ఇది పాత భారతదేశం అనుకున్నావా?' అంటుంది. రోడ్డు పక్క నమాజ్ చేస్తున్న వారిని కాళ్లతో తన్ని వెళ్లకొట్టారు. అయోధ్య తీర్పు వచ్చినప్పటి నుంచి ఆమె భయంతో వణికిపోతోంది. అనుక్షణం ముస్లింల అస్తిత్వ పోరాటమే 'కలల రాజ్యం' కథ.

### ఇక్బాల్ గీతం పాడించినందుకు సస్పెన్షన్ !

'సారే జహాసె అచ్చా' రాసిన ఇక్బాల్ మరో ఐక్యతా గీతం 'లబ్ పే ఆతీ హై దువా బన్ కే తమన్నా మేరే'ను ప్రార్థనలో పాడడానికి అంగీకరించిన హెడ్మాస్టర్ హఫీజ్ ఆలీని సస్పెండ్ చేస్తారు. హఫీజ్ ఆలీపైన ఫిర్యాదు చేసిన వీహెచ్‌పీ నాయకుడు మహేందర్, ఆవుల్ని చంపుతున్నారని ముస్లింలు, ఎస్సీల నుంచి వాటిని స్వాధీనం చేసుకుంటాడు. మంచి టీచర్‌గా పేరున్న హఫీజ్‌ను సస్పెండ్ చేయడాన్ని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు ఆందోళనకు దిగడం 'లబ్ పే ఆతీ హై దువా' కథ.

### చీకటి జైలు గదిలా బురఖా

'బురఖా వేసుకోకపోతే కాలేజీకి మానేయ్' అంటుంది దాదీమా. 'బురఖాలో ఉక్కపోత. చెమటలు కారుతున్నాయి. దురదలతో పిచ్చెక్కుతోంది. బురఖాలో ఉంటే చీకటి జైలు గదిలో ఉంటూ, చిన్న కిటికీ లోంచి లోకాన్ని చూస్తున్నట్టుంది అబ్బా..' అంటూ ఉజ్మా ఏడ్చేస్తుంది. కాలేజీ నుంచి వస్తూ పోతుంటే 'అరేయ్ సైతాను వస్తుంది చూడరా, నల్ల దయ్యం' అని ఒకడు, 'ముసుగు తీసెయ్ ప్రియురాలా' అంటూ మరొకడు. 'బురఖా వేసుకోమని ఒత్తిడి చేసే అబ్బాకు, అసలు దీన్ని కనిపెట్టిన వాడికి ఈ బురఖా వేయాలి' అనుకుంటుంది ఉజ్మా. సంప్రదాయానికి, పోకిరీల వేధింపులకు మధ్య నలిగిపోతున్న ముస్లిం యువతుల దీనగాథలకు సజీవ రూపం 'ఉజ్మా' కథ. కరెంట్ షాక్ కొట్టి చనిపోయిన ఆవు తోలు ఒలుస్తున్న మధుకర్‌పై గోసంరక్షకుల దాడి. గోసంరక్షణ పేరుతో ముస్లింలపై చేసే దాడులు, హింసల నేపథ్యంలో కౌసల్యావు, సీతావు, శబరి ఆవుల మధ్య సంభాషణల మ్యాజిక్ రియలిజం కథ 'కౌ, కోబ్లర్, హంజా'

### 'హమ్ హై భారత్ దేశ్ కి వాసీ'

టైలర్ సాహిల్ ముత్తాత స్వాతంత్ర్య సమరయోధుడు. కాబా నుంచి 'అత్తర్ అల్ కాబా'ను తెప్పిస్తానంటాడు లక్ష్మితో. 'మా దగ్గరకు వచ్చిన వారికి మా నుంచి వచ్చే పరిమళం సుకూన్ ఇస్తుంది. అత్తరు పెట్టుకోవడం మమ్మల్ని మేం గౌరవించుకోవడం, ఇతరులకు ఇవ్వడం కూడా అంతే' అంటాడు సాహిల్. పహెల్గాం సంఘటనతో సింధూరోద్యమం జోరుగా సాగుతోంది. 'హమ్ హై భారత్ దేశ్‌కి వాసీ, భారత్ అప్నా జహాన్ హై' అని గర్వంగా చెప్పిన సాహిల్ దుకాణాన్ని కూడా ధ్వంసం చేశారు. హిందుత్వవాదుల ఉన్మాదాన్ని, ముస్లింల నిస్సహాయతకు అద్దం పట్టే 'అత్తరు మునక' కథ ఈ పుస్తకానికి పేరుగా పెట్టారు. ముస్లింల జీవన సంఘర్షణను, వారి అస్తిత్వ పోరాటాన్ని, వారి మనోవేదనలను గీతాంజలి సజీవంగా ఆవిష్కరించిన కథలివి.

## జీవన వ్యవస్థగా మారుతున్న ఫాసిజం

(24వ పేజీ తరువాయి)

అవి దేశ దేశానికి వేర్వేరుగా ఉంటాయి. ఒకచోట అది మిలటరీ నియంతృత్వం కావచ్చు లేదా అధ్యక్షతరహా పాలన కావచ్చు. పాకిస్థాన్‌లో సైనిక ఆధిపత్యం, మయన్మార్‌లో మిలటరీ జుంటా పాలన దీనికి ఉదాహరణలు. మరోచోట పార్లమెంటరీ ప్రజాస్వామ్య ముసుగులో రెండు ప్రధాన పార్టీలు లేదా కూటముల పాలన ద్వారా ఫాసిజం చాప కింద నీరులా వేళ్లూనుకోవచ్చు. ఒక పార్టీ లేదా కూటమి ప్రజల్లో అపఖ్యాతి పాలైనప్పుడు మరొకదాన్ని ముందుకు తెస్తారు. అమెరికా, ఇంగ్లండ్, భారతదేశం దీనికి సరైన నమూనాలు. అందువల్ల ఫాసిస్టురాజ్యం అన్నిచోట్లా, అన్ని సమయాలలో నిరంకుశ పాలనగా, అణచివేత సాధనంగా పైకి కనిపించకపోవచ్చు. అది చాలాసార్లు ప్రజలను ఒప్పించడం ద్వారా వారిని తన వెనుక పెద్దసంఖ్యలో సమీకరించుకునే ప్రయత్నం చేస్తుంది. ఇందుకు కొన్ని జనాకర్షక పథకాలను, నినాదాలను విస్తృతంగా ప్రచారం చేసి ప్రజలను ఆకట్టుకునే చర్యలు చేపడుతుంది. ఒక నాయకుణ్ణి అన్ని శక్తులు కలిగిన అసమాన వ్యక్తిగా, అద్భుత వ్యక్తిగా చాటుతుంది. జర్మనీలో హిట్లర్‌ను ఫ్యూరర్‌గా చిత్రీకరించిన సంగతి మనకు తెలుసు. మనదేశంలో కూడా ఒకప్పుడు ఇందిరాగాంధీని, ప్రస్తుతం మోదీని ఆకాశానికి ఎత్తి చూపించడం అలాంటి ప్రయత్నాల్లో భాగమే.

ఫాసిజం ఒక్క పాలక పార్టీకే పరిమితమైన విధానం కాదు, అదొక పాలకవర్గ పథకం. ఏ పార్టీ అయితే పాలకవర్గ ప్రయోజనాలను, ముఖ్యంగా కార్పొరేట్ సంస్థల అనుకూల ఆర్థిక, పారిశ్రామిక విధానాలను వేగంగా అమలుచేస్తోందో, దాని పర్యవసానంగా ప్రజలలో పెచ్చరిల్లే అసంతృప్తిని నేర్పుగా, చాకచక్యంగా పక్కకు మళ్లిస్తుందో ఆ పార్టీ వైపు ప్రగతి నిరోధక శక్తుల తూకం మొగ్గుతుంది. ఈ పరిస్థితుల్లో ఫాసిజాన్ని నిలువరించే ప్రతి నిరోధకం ఎన్నికల సమీకరణల ద్వారా పెంపొందదు. ఫాసిస్టు భావజాలానికి విరుద్ధంగా సైద్ధాంతిక, సాంస్కృతిక, తాత్విక ప్రతి ప్రవాహ ప్రచారాన్ని విస్తృతంగా నిర్వహిస్తూ, బాధిత జనబాహుళ్యాన్ని దైనందిన సమస్యలపై సమరశీల పోరాటాల దిశగా సంఘటితం చేయాలి. అప్పుడే ఫాసిజాన్ని బలంగా ప్రతిఘటించే శక్తిని నిర్మించడం సాధ్యమవుతుంది. ❑

# బౌల్ కవిత్వం - సమతా గానం



- డా.జె.రవీంద్రనాథ్

**ము**కుంద రామారావు గారి అనువాద "బెంగాలీ బౌల్ కవిత్వం" తెలుగు, బెంగాలీ రెండు సాహిత్యాల మధ్య సృజనాత్మక వారధి. ఈ పుస్తకానికి రామారావు గారి ఉపోద్ఘాతంలో బౌల్ కవిత్వం మూలాలు, వస్తువు, ప్రతీకలు, ఆ కవిత్వ గాన ప్రభావం గురించి వివరించారు. జార్జి బెర్నార్డ్ షా నాటకాల ముందు పీఠికలు లాగా రామారావు గారి పుస్తకాలలోని ఉపోద్ఘాతాలు ఎంతో పరిశోధనతో, ఆలోచనలతో కూడి మనకు నూతన, లోతైన జ్ఞానాన్ని అందిస్తాయి.

ముకుంద రామారావు గారు తెలుగులో తొమ్మిది కవిత్వ పుస్తకాలు, పదిహేను తెలుగు అనువాదాలు, రెండు ఇంగ్లీషులో, ఒకటి కన్నడంలోకి, ఆరు కథలు/ వ్యాసాల పుస్తకాలు రాశారు. ఐదు పుస్తకాలు ఇంకా వెలుగు చూడాల్సి ఉంది. వివిధ గ్రంథాలలో పరిచయ వ్యాసాలు వచ్చాయి. అజో - విభో - కందాళం ఫౌండేషన్ వారి 2024- ప్రతిభామూర్తి జీవిత కాల సాధన పురస్కారంతోపాటు పలు పురస్కారాలు పొందారు. ఆయన అనువాద గ్రంథాలు-అదే ఆకాశం, అదే గాలి, అదే నేల, అదే కాంతి, అదే నీరు, శతాబ్దాల సూఫీ కవిత్వం, నోబెల్ బహుమతి గ్రహీతల కవిత్వం, భరత వర్షం, చర్యా పదాలు, మిణుగురులు, ఇసుక నురగ, మియా కవిత్వం, బెంగాలీ బౌల్ కవిత్వం, వలస పోద మందహాస, The Smile That Migrated and Other Poems మొదలగునవి. జాతీయ, అంతర్జాతీయ కవిత్వాన్ని తెలుగు భాషలోకి అనువదించి అందరికీ అందించటంలో విరామ మెరుగక పరిశ్రమించిన పరిశోధకుడు. బహుభాషా కోవిదుడు.

అసలు బౌల్ అనేది సంస్కృత పదం 'వతుల' (అంటే వెర్రి/ వ్యాకుల/గాలి సోకి వచ్చిన జబ్బు) నుంచి వచ్చింది. బౌల్ గాయకులు మత, సామాజిక ఛాందసవాద వ్యతిరేకులు. మనిషిలోని మనిషి "మానేర్ మనుష్" లేదా "ఆధార్ మానుష్" అన్వేషకులు. వారు సహజ కవి గాయకులు. వారిది హృదయ గానం. కవిత్వం ఒక జీవిత విధానం. స్వతంత్ర ఆలోచన పరులు. హృదయంలోని మనిషి అన్వేషణలో మధ్యన ఎవరి అవసరం లేదని నమ్ముతారు. వారి దృష్టిలో స్త్రీ, పురుషులు ఆధ్యాత్మిక రంగంలో సమ భాగస్వాములు.

బౌల్ కవితల సారాంశం హిందూ వైష్ణవ, ఇస్లాం, సూఫీ




బౌద్ధాల స్వర సమ్మేళనం. సర్వ మానవ, సర్వమత సోదరత్వం వారి ఆకాంక్ష. వారు మౌఖిక సంప్రదాయకులు. మనిషిలోని దైవత్వ వ్యాకులురు. ప్రేమ పూర్వక సంగీతంతో నిర్వాణ సాధకులు. వారి సంగీత వాయిద్యాలు ఎక్తారా, డుగ్గీ. అంతర్దృష్టిలో విప్లవకారులు. బెంగాలీ సాహిత్యంపై విశేష ప్రభావం నెరిపిన వారు. కేవలం బోధకులు, కళాకారులు కాక ఆత్మను జాగృతం చేసేవారు. అంతిమ సత్యానికి ఉల్టా సాధనలో గురువులను (ముర్షీద్‌లను) అనుసరిస్తారు. వారికి అంధ విశ్వాసం లేదు. పునర్జన్మ పట్ల నమ్మకం లేదు. మరణ భీతి లేదు. బౌల్ కవి గాయకులు ప్రకృతి, గ్రామీణ జీవిత ఆధారిత సరళ పదాలు, భావ చిత్రాలతో కూడిన రాగ, ఛందోబద్ధ పాటలు మనకు అందించారు.

అధర్వణ వేదంలోని అత్యంత మార్మిక శ్లోకాల నుంచి క్రీస్తు

శకం 950 –1200ల మధ్య చర్య గీతాలు, వీటి ప్రభావంతో వైష్ణవ పదాలు, బౌల్ గీతాలు వచ్చాయి. 13వ శతాబ్దికి చెందిన చైతన్య మహాప్రభు తొలి బౌల్. బెంగాలీ బౌల్‌లకు చివర వైష్ణవ నామం దాస్ అని బంగ్లాదేశ్‌లో బౌల్ కళాకారుల పేరు చివర సూఫీ నామం షాహ్ అని ఉంటుంది. బౌల్ గాయకులు స్వేచ్ఛా జీవులు. అహంకార వ్యతిరేకులు. సమానత్వ కాముకులు. వారిలో ఎందరో బడుగు కులాల, వృత్తుల సమాజాల భావాల ప్రకటన చేసినవారు. వారికి గానమే జ్ఞానం. జ్ఞానమే విముక్తి సాధనం.

రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రప్రథమంగా పశ్చిమ దేశాలకు బౌల్ కవితలను పరిచయం చేశారు. ఆయన బౌల్ కవి గాయకులలో సజీవ భావావేశ భరిత నిజాయితీని గుర్తించారు. వారు విశ్వ జనీన ప్రేమ వైపు రోజూ నడక సాగిస్తారు అన్నారు.

ఠాగూర్ ప్రఖ్యాత లాలన్ ఫకీర్, నబానీదాస్‌లకు సన్నిహితంగా ఉన్నారు. ప్రతి ఏడాది శాంతినికేతన్‌లో జరిగే ఉత్సవంలో ప్రపంచవ్యాప్తంగా కవులను ఆహ్వానించి వారికి బెంగాలీ బౌల్ గానాన్ని, కవిత్వాన్ని పరిచయం చేసేవారు. బౌల్ గీతాల ప్రభావితులలో ఖాజీ నజ్రుల్ ఇస్లాం, అలెన్ గిన్స్బర్గ్ కూడా ఉన్నారు. భారత్, బంగ్లా జాతీయ గీతాలపై బౌల్ ప్రభావం ఉంది. సంపూర్ణుడినీ బౌల్‌లు పాటలో అన్వేషిస్తే, ఠాగూర్ సాహిత్య రూపాల్లో అన్వేషించారు. బౌల్ తత్వాన్ని ఠాగూర్ క్షితి మోహన్‌దాస్‌తో కలిసి వ్యాప్తి చేశారు. ఠాగూర్ బౌల్ కవిత్వ అనువాదాలు సైతం కూడా ఈ పుస్తకంలో మొదట్లో చేర్చడం సంతోషదాయకం. పుస్తకం చివర్లో బౌల్ స్త్రీలు రీనా దాస్, పార్వతీ బౌల్‌ల గురించిన సంక్షిప్త వ్యాసాలు ఎంతో ఆసక్తికరమైనవి. ప్రాసంగికమైనవి.

లాలన్ షా ఫకీర్ తన కవిత్వంలో మూలాలు వెతుకుతూ తప్పిపోయే వాడి గురించి, హృదయానికి నచ్చని హృదయాన్ని కలిపేందుకు మనిషి పడే తిప్పలు, సృష్టిలో కలిసి ఉండే మంచి, చెడు, అమృతం విషం గురించి ప్రస్తావిస్తాడు. తన తల్లి/ చనుపాలు బిడ్డ తాగుతుంటే/ స్త్రీ రొమ్ము మీద జలగ / రక్తాన్ని పీలుస్తుంది" (పే.41).

ఈయన రాసిన వేలాది గీతాల భావ, గాన ప్రవాహంలో మనిషి ఈ ప్రపంచంలోకి రాక, పోక ఒంటరిగానే ఉంటాయని, అదృశ్య శక్తి కోసం అన్వేషణ, దేహం అనే సొంత గదిలో నివసించేవాడు విశ్వ వ్యాప్త దైవశక్తినీ చేరలేడని, దానిని కళ్ల గంతలు చూడనీవు అని అర్థం చేసుకోనీయవని అంటాడు. మానవతా ప్రేమ కోసం, మనిషి సృజించబడినాడు కానీ దానవత, విద్వేషాల కోసం కాదు అని నేడు దేశంలో రెచ్చిపోతున్న మతోన్మాదం ఎపుడు గుర్తిస్తుంది?

లాలన్ కవితల్లో కుల, మత, లింగ వివక్షకు అతీతంగా గురు/ప్రేమ/ఆత్మ/ సాధన/ పరమతత్వం కనిపిస్తాయి. విరిగిన పడవలో నీరు తోడుతూ ముగిసే జీవితం, "నేను" అనుకుంటూ మరింత కలవరానికి లోనవటం, ఇరుకుదారుల్లో మునిగే జీవిత పడవలు దర్శనమిస్తాయి.

స్వర్గ, నరకాలను వేరువేరు పేర్లతో పిలుస్తూ విడిపోయిన హిందూ ముస్లిం సోదరుల గురించి, పవిత్ర గ్రంథాలు రాసింది మనుషులే కాబట్టి వేరువేరుగా ఉన్నాయని, ఒకే దేవుడు రాస్తే వేరు వేరు ప్రాంతాలకు భిన్న సందేశాలు ఎందుకని ప్రశ్నిస్తాడు లాలన్. ప్రేమతత్వం గురించి రాస్తూ అలల్లో సజీవంగా/నేను ప్రేమ జలాశయాన్ని/ ఒక్క నీటి బిందువు/ సముద్రమంత పెరిగింది ఓడలు పోలేనంతగా." (పే.54)

ఇంకా ఈయన కవితల్లో శరీరతత్వం దాటడం, హృదయంలోని దేవుణ్ణి మేఘాలలో మెరుపులా ఉండే వానిని పట్టుకోవటం గురించి ఉంది. కోరికలు తొలగితే ఏ మనో మృగం ఏమీ చేయలేదని, మరణంకంటే ముందే మరణించడం అమరమని లాలన్ అభిప్రాయం.

ఇస్లాం మతస్థుడు అయిన మదన్ షా ఫకీర్ దైవం పిలుపుకు ప్రవక్తలు, గురువులు, భిన్న దురభిమాన మార్గాలు అడ్డు అని కుమిలిపోతాడు.

కులం పోగొట్టుకున్నావని అరిచే వారికి జవాబుగా పుట్టిన లేదా గిట్టిన క్షణంలో నీది ఏ కులమని, చివరికి అందరినీ నీరు శుభ్రం చేస్తుందని, మరణం ఎవరిని విడిచిపెట్టదని అంటాడు. గురువును కనులకు జ్ఞానాంజనం ఇవ్వమని కోరుతాడు. జాతి భేదాలు సంతలో సరుకులు. ఒకే చంద్రుడి వెలుగులో ప్రపంచం వెలుగుతుంటే, అదే నది నీరు తాగుతూ భేదాలు ఎందుకు అని ప్రశ్నిస్తాడు. కులాన్ని అగ్గి వెలిగించి తగల బెడతానని, దివ్యజ్ఞానం ఆకారం లేని కాంతికి ఆకారం అయినప్పుడు వివాదాలు వల్ల సమయం వృథా అని పలుకుతాడు.

లాలన్ కవితలు మనిషి తనలో తాను చూసుకోవాలని, పదం వల్ల పరమ పదం దొరకదని, రాజును పొగిడినా శిస్తు పోదని, భక్తికి మతం, కులం, జాతితో సంబంధం లేదని, ఇహ లోక బంధాల కోసం కన్నీరు వ్యర్థమని అంటాడు.

నబానీ దాస్ ఖ్యాపా బౌల్ "ఆకాశ అద్దం/నా ఆత్మను ప్రతిబింబిస్తుంది/" (పే.68) అంటే,

అనంత గోసాయి మట్టితో తయారైన దేహంలో వివేకి చోరుడు, సైతాను మనిషి, విషము అమృతము కలిసే ఉంటాయి అని పలికారు.

అజో యోద్ధన్యద్ పక్రాషి తన హృదయాన్ని సత్యం దారి

ఎక్కమని, ప్రేమ దారి దీపం కావాలని, సుగుణ సంపదను తీసుకొని భ్రమ, దురాశలనే దొంగల నుంచి శాంతం, నిగ్రహంతో తప్పించుకొని ప్రపంచం అనే విదేశం నుంచి ఇంటికి పోదామంటాడు.

చండీదాస్ గోసాయి విశ్వ ప్రభువు కోసం వేచి హృదయాన్ని వెతుకుతుంటే అనుభూతులు ఆలోచనలను అణచి వేస్తాయని పలికితే,

ద్విజ కైలాస్ చంద్ర తన కవితలో కామాన్ని తీరాలు లేని, తుఫాన్లు రేగే నది అంటూ వర్ణిస్తాడు.

లాలన్ శిష్యుడైన దృదు షాహ్ ఈ భూమి బజారులో ఎవరు మన దగ్గర ఏమీ కొనరని, గురు కృపతో రత్నాలని తెలుసుకుంటే మంచి ఖరీదు వస్తుందని అంటాడు.

సత్యం వైపు సాగితే వేదన మాయమని, దేవుని కోసం తీవ్ర ఆరాటం బౌల్ కవులు నిరంతర పోరాటమని ఫతిక్ చాంద్ పలికాడు.

గోబింద దాస్ కవితలో జవాబు ఇవ్వని వారిని పిలిచి లాభం ఏమిటి అని, పేర్లు మారినా, విధానాలు మారిన తన ప్రకారమే తాను ఉన్నాడని అంటారు. "నీ శ్రోతల్ని తెలుసుకుని/నీ మాటలని ఎన్నుకో/ నువ్వు సత్యం మాట్లాడితే /కర్రతో నిన్ను కొడతారు/ అసత్యం నువ్వు మాట్లాడితే / ప్రపంచాన్ని నువ్వు ఆకర్షిస్తావు." (పే.92) నేను అంటే ఎవరో తెలియదని, నాలో నేను భిన్న దుస్తులు, భిన్న పాత్రలు పోషిస్తుంది. వాటిని తొలగిస్తే అసలు తిరిగి వస్తుంది అని అంటాడు.

హావుడే గో సాయి "ప్రేమ సారం తెలిసినవాడు /ఎవరికి భయపడడు / ప్రేమ స్వీయ రూపానికే అనురక్తుడు అవుతాడు" (పే.99) అంటాడు.

లాలసను ప్రేమ అతిక్రమిస్తుందని నారాన్ పలికితే, ప్రేమ ఎన్నడు కాముకత్వంలో ఉండదని తారణ్ అంటాడు. లాలస ప్రేమలో పాలలో నీరులా కలిసిపోతే హంసలాంటి వాడే సారం తీయగలడని నిత్య ఖ్యాపా పలుకుతాడు.

ఇషాన్ జోగి కూడా తన కవితలలో స్వరమాధుర్యంలో కొట్టుకుపోవడం మినహా ఏమీ కోరుకోనని పలికారు. కాలా చాంద్, శరీరం అనే నేలను పనితో దున్నితే, ఉత్సాహాలు ఎద్దులు అయితే, రత్నాల పంట వచ్చి భౌతిక ఆశలు ఫలిస్తాయి అంటాడు.

ఫకీర్ పాంజ్ షాహ్ సూఫీ మార్గంలో సాగి జాతి గర్వం మంచిది కాదని, దానికి చితిమంట పెట్టమని, వంశభారాన్ని మోస్తున్నా కూడా హిందువులు, ముస్లింలు శరణార్థులే అవుతున్నారని, జాతి ఏమిటి, దాని గుర్తులు ఏమిటి, జాతిని నీవు తినలేవు లేదా జాతి వ్యాధికి మందు కాదు అని పలుకుతాడు.

ఇక రాధా వల్లభ్ ఒక ప్రత్యేక స్థలమే దేవుని నివాసమైతే ఎవరూ వారి వారి ఇళ్లకు తిరిగి వచ్చేవారు కాదని, దేవుడికి కావలసింది కానుకలే అయితే రాజు అత్యంత దయను పొంది తిరస్కారాలను తప్పించుకో గోరుతాడు అంటాడు.

రసరాజు గోస్వామి నేను విశ్వాసిని కాదు అవిశ్వాసినీ కాదు అయినా ప్రేమ ప్రభువును మాత్రం వదిలేయలేను అంటాడు.

శశాంకో గోసాయి బంధాల గదికి తాళం వేసి, స్త్రీత్వాన్ని హత్తుకోవాలని, మానిష కోసం అన్వేషిస్తే మనిషిని పూజించమంటాడు.

వాదిన్ శరత్ కోరిక కావాలని అనుకుంటే విముక్తినే కోరుకోమని సెలవిస్తాడు.

అనామకుల బౌల్ గీతాల్లో లొంగుబాటే ప్రేమ రహస్యం అని, ప్రేమలోనే దైవమని, పదాల గోడల్ని కూల్చిన వారే హద్దుల్ని జయించారని, జీవితం సాహస నౌకా యానమని, ప్రియతమ అన్వేషణలో సర్వం వదలాలి అని, దుఃఖాన్ని చెబితే ప్రకృతి సైతం స్పందిస్తుంది అనే భావనలు ఉన్నాయి.

బౌల్ కవిత్వం కేవలం అదృశ్యశక్తి ఆరాధన మార్గం అయినట్లయితే అది పలాయనవాదంగా మిగిలేది. కానీ ప్రశ్నలతో, సామాజిక దురాచారాల పట్ల, అసమానతల పట్ల నిరసనతో అది కొంత వరకు పరివర్తన వాదం అయింది.

భౌతిక ఉత్పత్తి వ్యవస్థకు ఏ వర్గం పూర్తిగా దూరంగా ఉండటాన్ని, యాచక, దేశ దిమ్మరి స్వభావాన్ని మార్క్సిజం అంగీకరించదు. అయితే సంకుచితంగా చూసి మేధా, కళా రూప ఉత్పత్తిని తిరస్కరించడం తగదు. కవులు, ప్రజా కళా కారులు సామాజిక సంపదను సమృద్ధిగా చేయడంలో ఆవేశాల్ని, ఉత్సాహాన్ని కలిగించే పాత్రధారులు.

భక్తి ఉద్యమంలోని సామాజిక విప్లవాత్మకాంశమే బౌల్ గానంలో కూడా ఉంది. అదృశ్య శక్తి పరమ సత్యమనే భావన నేటి దోపిడీ వ్యవస్థ సమూల మార్పుకి మార్గం కాదు. మధ్యయుగాల మార్మిక వాద మూలాల నుంచి, అదృశ్య శక్తి ఆరాధన నుంచి నేటి యుగ పీడితుల కోసం బౌల్ సంగీతం సమ సమాజ దారిలో ప్రవహించాలి.

ప్రజా కళాకారుడు బౌల్ సంగీత హృదయ గాన స్ఫూర్తితో ప్రజా చైతన్యం పెంచవచ్చు. గద్దర్ లాంటి కవి గాయకుడు, కళాకారుడు పాట రచన కోసం జానపద బాణీలు గ్రహించి, మత ప్రభావిత ప్రజానీకంలో మార్పు కోసం పాటను తీసుకుని వెళ్లడం తెలిసిందే. అయితే ప్రజా కళా, భావ ప్రకటన స్వేచ్ఛ నిజమైన ప్రజాస్వామ్యంలో మాత్రమే సాధ్యం. ❑

# సాహితీరంగ కొవ్వొత్తి ఏటుకూరి



- ఆర్వీ రామారావు

**లోకాన్ని, మనుషులను ప్రేమించే వారు తమను తాము అంతగా పట్టించుకోరేమో! సాహిత్యోద్యమ నిర్మాణం కోసం తమ సృజ నాత్మక శక్తిని త్యాగం చేసేవారు కొందరే ఉంటారు. డాక్టర్ ఏటుకూరి ప్రసాద్ అలాంటి విశిష్ట వ్యక్తిత్వం గల మనిషి. అనేక విషయాల గురించి సమగ్ర అవగాహన ఉన్న వారు ఏదో ఒక రంగం మీద దృష్టి నిలిపి పేరు ప్రఖ్యా తులు సంపాదించాలనుకోరు. ఏటుకూరి ప్రసాద్ సరిగా అలాంటివారే.**



ఊహ తెలిసినప్పటి నుంచి ఆయన అభ్యుదయ పథంలోనే నడిచారు. 1955లో అనుకుంటా అభ్యుదయ రచయితల సంఘంలో చేరారు. అప్పటికి ఆయనకు 19 ఏళ్లు. ఇంటర్ మొదటి సంవత్సరంలో చేరగానే అఖిల భారత విద్యార్థి సమాఖ్యలో చేరినప్పటి నుంచి ఆయన కమ్యూనిస్టు భావాల వేపు ఆకర్షితులయ్యారు. దీనికి కారణం ఆయన పెదనాన్న ఏటుకూరి సీతారామయ్య ప్రభావం, వారి కుమారులు ఏటుకూరి బలరామ మూర్తి, కృష్ణమూర్తి నడిచిన బాటే కారణం. 1955 తరవాత అభ్యుదయ రచయితల సంఘం - నిస్తేజంగా మారింది. 1970 ఆరంభంలో అభ్యుదయ రచయితల సంఘ పునర్నిర్మాణ ప్రయత్నాలు మొదలైనప్పుడు అందులో ప్రసాద్ క్రియాశీల పాత్రధారి. అక్కడి నుంచి ఆయన అభ్యుదయ రచయితల సంఘం జెండాను కడదాకా బుజం మీంచి దించనే లేదు. జీవితాంతం కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) సభ్యుడిగానే - కొనసాగారు.

అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణ కార్యకలాపాలు ప్రారంభమైనప్పుడు రాంభట్ల కృష్ణమూర్తి, గజ్జెల మల్లారెడ్డి ఆ ప్రయత్నాలకు చుక్కానులుగా ఉన్నా, ప్రధాన నిర్మాణ బాధ్యత అంత ప్రసాద్‌దే. 1970లో మొదలైన ప్రయత్నాలు 1973లో గుంటూరు మహాసభలో సంఘటితమయ్యాయి. అప్పుడు ప్రసాద్ ఆంధ్రప్రదేశ్ విభాగం కార్యదర్శిగా ఎన్నికయ్యారు. అప్పటికే ఆయన 1972లో హైదరాబాద్ అభ్యుదయ రచయితల సంఘానికి ప్రధాన కార్యదర్శిగా ఉండేవారు. శనివారం (2026 మే 23) దాకా తెలంగాణ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్ష వర్గ సభ్యులుగా కొనసాగారు.

ఎర్రజెండా, ఎర్రబాట, శివాలయ్య (రూపకం) ఆయనకు కవిగా మంచి గుర్తింపు తెచ్చాయి. ఆయన తన గేయాలను తానే పాడి వినిపించే వారు. ఆయన పాడే తీరు జనాన్ని బాగా ఉత్సాహపరిచేది. ఆయన ఏ కవిత రాసినా నాబోటి వారు కొందరికి ఫోన్లో చదివి వినిపించే వారు. ఇది మీరు విశాలాంధ్రలో వేసుకుంటారా అని అడిగేటంతటి సౌమ్యమూర్తి ఆయన. తాపీ ధర్మారావు మీద ఆయన ఉస్మానియా విశ్వ విద్యాలయానికి సమర్పించిన పి.హెచ్.డి. సిద్ధాంత గ్రంథం అత్యంత ప్రామాణికమైంది. మానుష శాస్త్రంలో తాతాజీ కృషిని ఎత్తి చూపింది ఈ సిద్ధాంత గ్రంథమే.

శిష్ట్లా ఉమామహేశ్వరరావు "నవమి చిలుక", "విష్ణు ధనువు" గ్రంథాలను వెతికి పట్టుకోవడానికి ఆయన పడ్డ శ్రమ అసామాన్యమైంది. ఈ రెండింటినీ ఆవంత్స సోమసుందర్ దగ్గర వుంటే తీసుకుని ప్రసాద్‌కు పంపించాను. కొంపెల్ల జనార్దనరావు రచనలన్నింటినీ సేకరించి ముద్రించారు. మొదటి ప్రయత్న సమయంలో దొరకని, జారిపోయిన కొంపెల్ల రచనలన్నింటినీ సేకరించి ఇటీవలే పరివర్ధిత ప్రతి ప్రచురణ పని పూర్తిచేశారు. ఆ గ్రంథం నమూనా ప్రతిని ఇటీవలే కళ్లారా చూసుకున్నారు. ఇది ప్రస్తుతం ముద్రణలో ఉంది. త్వరలో వెలువడుతుంది. మొదటిసారి కొంపెల్ల రచనల కోసం ప్రసాద్ ప్రయత్నిస్తున్న సమయంలో నేను విశాఖపట్నంలో ఉండేవాడిని. ఓ కార్డు ముక్క రాసి విశాఖపట్నంలో ఫలానా వాళ్లు ఉంటారు. వారిని కలిసి కొంపెల్ల గురించి సమాచారం సేకరించి పంపు అని అడిగే వారు. ప్రసాద్ మాట అంటే నాకు సుగ్రీవాజ్ఞే. విశాఖపట్నం వీధులన్నీ తిరిగి మరుగున పడ్డ అనేక మంది రచయితల ఆచూకీ తెలుసుకుని, వారితో మాట్లాడే అవకాశం నాకు కలిగింది. వడ్డాది సీతారామాంజేయకవి, కాళూరి నరసింగరావు, అయల సోమయాజుల నరసింహశర్మ వంటి వారి గురించి ఈ ప్రయత్నంలోనే తెలుసుకోగలిగాను. ఇటీవల కొన్నేళ్లుగా

యామిజాల ఆనంద్ ఆయనకు తోడయ్యారు. ఆనంద్ ప్రసాద్‌కు దాదాపు పదాతిదళ సైనికుడిలా పనిచేశారు. ఆయన నికార్సైన పరిశోధకుడు. ప్రతి చిన్న అంశాన్ని వదలకుండా నిరంతరం పరిశోధించేవారు. ఆయన చేసిన గొప్ప పని "పొయెట్రీ వర్క్ షాప్" వెలువరించడం. ఇది వినూత్నమైన గ్రంథం. కవుల చేతి రాతలను సంపాదించి ఒక వేపు చేతి రాత,

మరో వేపు ముద్రణా రూపం కలిపి అందించారు. గతంలో లభించని వాటికోసం, కొత్తగా చేర్చాల్సిన కవుల రచనలను చేర్చడం కోసం ఆయన ఎంత శ్రమపడ్డారో ప్రత్యక్షంగా చూసిన వేడిని. ఇలాంటి ప్రయత్నం ప్రపంచ సాహిత్య చరిత్రలోనే లేదని తేలింది. ఈ సంపుటిలో గురజాడ అప్పారావు మొదలుకుని యాకూబ్ దాకా అనేక మంది చేతి రాతలను సేకరించడం ప్రసాద్ లాంటి వ్యక్తికి మాత్రమే సాధ్యమయ్యే పనేమో. 2022లో దీని రెండో ముద్రణ వచ్చింది. కానీ ఈ క్రమంలో ఆయన తన సృజనాత్మకత శక్తిని తానే చిదిమేసుకున్నారన్నది నా బాధ. ఆయన కేవలం కవో, పాటలు రాసే వాడో కాదు. గొప్ప పండితుడు. ఈ మధ్య కాలంలో ఎప్పుడు కలిసినా ఫలానా పదం ఎలా వచ్చిందో తెలుసా అని ఆ పదం నేపథ్యాన్ని, పుట్టు పూర్వోత్తరాలను వివరించే తీరు ఆయన పాండిత్యానికి అద్దం పట్టేది. అవన్నీ రాయొచ్చుగా అని నేను పోరేవాడిని. కొన్నిసార్లు కటువుగా చెప్పాను. ఆ తరవాత ఆర్వీ రామారావు వచ్చినప్పుడల్లా నన్ను తిట్టిపోతున్నాడు అని అనేవారు. నా మాట కొంచెం కటువైన మాట నిజమే.

అభ్యుదయ రచయితల సంఘం పునర్నిర్మాణం దగ్గర నుంచి ఆయన ధ్యాసంతా దాని మీదే. ఇంట్లో ఏదైనా చిన్న ఖాళీ డబ్బా కనిపిస్తే "కుసుమా (ఆయన జీవిత సహచరి. దాదాపు అయిదేళ్ల కింద పోయారు) ఇది తీసుకెళ్లనా, ఇందులో పిన్నులు పోసుకుంటాం" అనేవారు. "అ.ర.సం. ఆఫీసుకేగా తీసుకెళ్లు" అనే వారామె. ఇద్దరూ, ఉద్యోగాలు చేసేవారు. పెళ్లింట్లో హాలులో ఓ టేబుల్ ఉంటుంది. దానికి రెండు సొరుగులు. ఎవరికి డబ్బు అవసరమైనా అందులో నుంచి తీసుకెళ్లేవారు. ఇది నా సంపాదన అన్న భావన ఇద్దరికీ ఉండేది కాదు.

ఆయన నాకు పితృ సమానుడు. నాకు ఉద్యోగం సద్యోగం లేనప్పుడు ఎన్నిసార్లు చేయూతనిచ్చారో లెక్కే లేదు. ఆ మధ్య అభ్యుదయ రచయితల సంఘానికి, ప్రజా నాట్యమండలికి చెరో లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. తన సంపాదన అంతా జనం కోసమే అన్నట్టుగా ఉండేది ఆయన ధోరణి. కొందరికైతే విదేశీ యానానికి అవకాశం వస్తే బూట్ల దగ్గరి నుంచి కొని పెట్టారు. ఆయనకు చాలా రోజులు కొనసాగిన మరో అలవాటు కవిత్వం పుస్తకం ఏది వచ్చినా వెతికి వెతికి దాన్ని కొని దాచే వారు. ఆ గ్రంథ సంచయమంతా కొద్ది నెలల కింద "నవచేతన" ప్రచురణాలయానికి ఇచ్చేశారు. ఆయన నవచేతన ప్రచురణాలయానికి సంపాదకులు. పనిచేసే వారి బాగోగుల్ని ప్రసాద్ చూసుకున్నట్టు చూసుకున్న వారు మరొకరు ఎవరూ నాకు తారసపడలేదు. ఆయన తన సృజానాత్మక శక్తిని పూర్తిగా వినియోగించి ఉంటే సాహిత్యరంగం మరింత సుసంపన్నం అయ్యేది. ఆయన ఇంకా ప్రసిద్ధుడయ్యే వారు. కానీ ఇతరుల అలభ్య రచనలను వెలికి తీసి వెలుగులోకి తీసుకురావడం మీద ఆయనకు ఉన్న శ్రద్ధ తనను తాను మరిచిపోయేట్టు చేసింది. సాహిత్య రంగ కొవ్వొత్తిగానే మిగిలిపోయారు. ❑

## ఎర్రబాటరా...

- ఏటుకూరి ప్రసాద్

ఎర్రబాటరా – ఇదే
ఎర్రపాటరా
శ్రమజీవుల రక్తంతో
ఎరుపెక్కిన బాటరా –
॥ఎర్ర॥

మహనీయుడు మార్క్సునాడు
చూపినట్టి బాటరా
మనకామ్రేడ్ లెనిన్ ప్రజల
నడిపినట్టి బాటరా
॥ఎర్ర॥

దోపిడీలు లేని
దొరబాబు లుండబోని
సమసమాజ ఆశయాల
సాగిపోవు బాటరా
॥ఎర్ర॥

వీరులకే సాధ్యమైన
విప్లవాల బాటరా
పోరాటాలుద్యమాల
మైలురాళ్లు నాటరా
అడుగుడగున అడ్డంకులు
ఎదురయ్యే బాటరా
వడివడిగా పోరాడుతు
పోవలసిన బాటరా
॥ఎర్ర॥

# ఎర్రజెండా హసాద్ ఏటుకూరి ప్రసాద్!



- మందలపర్తి కిషోర్

అభ్యుదయ రచయితగానూ, దశాబ్దాల తరబడి ఉద్యమ గీతాలను వేదికల మీంచి వినిపించిన వాగ్గేయకారుడిగానూ, ఏటుకూరి ప్రసాద్ సుప్రసిద్ధులు. ఆయన పూర్తి పేరు ఏటుకూరి బాలశంకర ప్రసాదరావు. గుంటూరులో పుట్టి, అక్కడే హిందూ కాలేజీలో బియ్యే చేసి, విశాఖలోని "ఆంధ్ర కళా పరిషత్తు" అనే ఆంధ్రా యూనివర్సిటీలో తెలుగు సాహిత్యంలో ఎమ్మే చేశారు ఏటుకూరి ప్రసాద్. హైదరాబాద్ పాతబస్తీలోని అగర్వాల్ విద్యాసంస్థల్లో మొదట తెలుగు ఉపాధ్యాయుడిగానూ, తర్వాత అధ్యాపకుడిగానూ పనిచేశారు ప్రసాద్ గారు. బోధన వృత్తిలో ఉండగానే ఉస్మానియా విశ్వ విద్యాలయం నుంచి "తాపీ ధర్మారావు జీవితం-రచనలు" అనే అంశంపై పీహెచ్‌డీ కూడా చేశారాయన. బోధన వృత్తిలోంచి రిటైరయ్యాకా విశాలాంధ్ర, నవచేతన ప్రచురణ సంస్థల ప్రధాన సంపాదకుడిగా కృషి చేశారు. ఆయన కృషి అక్షరాలా బహుముఖీనమే కానీ, ఏటుకూరి ప్రసాద్ ప్రవృత్తి రీత్యా సాహిత్య ఉద్యమకారుడు. తెలుగు ప్రజల జ్ఞాపకావరణంలో ఆయన అదే రూపంలో నిలిచిపోతారనడంలో సందేహం లేదు. మే 23, రాత్రి తొమ్మిదిన్నరకు ఏటుకూరి ప్రసాద్ 92 యేళ్ల పండు వయసులో కన్నుమూసిన వార్త పత్రికల్లో వచ్చిందే. మర్నాడు మధ్యాహ్నం మండుటెండలో వందలాది మంది ఏటుకూరి ప్రసాద్ గారికి జోహార్లర్పించిన వార్త కూడా పత్రికల్లో ప్రముఖంగా వచ్చిందే!



ఏటుకూరి ప్రసాద్ గారి పేరు నేను బాల్యం నుంచీ వింటున్నదే. ఆయన రాసిన "ఎర్రజెండా", "ఎర్రబాట", "పోరాటం" తదితర ఉద్యమ గీతాల సంకలనాలు అచ్చయిన వెంటనే మా యింటికి నడుచుకుంటూ వచ్చేవి! వాటి మీద కవి గారి సంతకం పెద్దక్షరాలతో కనిపించేది. ఆయా సంకలనాల్లోని గీతాలను ఏరి, కూర్చి "జనం నుండి జనంలోకి" అనే పుస్తకం ఆ మధ్యన ప్రచురించారు ఏటుకూరి ప్రసాద్. ఆయన తొలి పాటల సంకలనం "ఎర్రజెండా" అచ్చయిన కొత్తలో, ప్రముఖ కవి డాక్టర్ ముకురాల రామారెడ్డి ఆ పుస్తకాన్ని "విశాలాంధ్ర"లో సమీక్షించారు. దానికి "ఎర్రజెండా హసాద్-ఏటుకూరి ప్రసాద్!" అనే శీర్షిక తగిలించారు డా.రామారెడ్డి. హసాద్ అనే మాటకు "తీవ్రమైన కాంక్ష", "గాఢమైన అభిమానం" అని అర్థాలు ఉన్నాయట. పాడగలిగినంత కాలం ఎర్ర పాటలే పాడిన ఏటుకూరి ప్రసాదును ఎర్రజెండా వీరాభిమానిగా అభివర్ణించడం ఉచితంగానే ఉంది. ఆ మాట ఇప్పుడు ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు ! "హసాద్" అంటే అసూయ అనే అర్థమూ ఉందట! తొంభయ్యేళ్ళ యవనవ్వనంలో కూడా తాను నవ్వుతూ, మనల్ని అందరినీ నవ్విస్తూ ఉండిన ఏటుకూరి ప్రసాద్ గారిని చూస్తే ఎవరికైనా అసూయ పుట్టదూ మరి?!

"తాతాజీ తాపీ ధర్మారావు పేరిట ఏర్పాటు చేసిన జీవన సాఫల్య పురస్కారం" అందుకున్న ఏటుకూరి ప్రసాద్ గారి గురించి కచ్చితంగా చెప్పవలసిన విశేషాలు కొన్ని వున్నాయి. అవి మనవి చేస్తా-చిత్తగించండి!

హైదరాబాద్ హిమాయత్ నగర్‌లోని "నార్ల చిరంజీవి గ్రంథాలయం"లో కళ్లు తెరిచిన మూడు నాలుగు తరాల వారికి, తాపీ ధర్మారావు, పెండ్యాల సుబ్రహ్మణ్య శాస్త్రి, గౌరిబోయిన పోలయ్య లాంటి "పుర్రచేతి పౌరాణికు"లను పరిచయం చేసిన పుణ్యం ప్రసాద్ గారిదే. పిట్టకథల్లాంటి ఎపిసోడ్ల సహాయంతో మమ్మల్ని సామాజిక పరిణామశాస్త్రం గడప దాకా తీసుకెళ్ళింది ఏటుకూరి ప్రసాదే. అయితే, ఆ పాతాళభైరవి గుళ్లోకి, ఆ గుళ్లోని గుండంలోకి మమ్మల్ని తోసిపారేసిన మాయలపకీరు మాత్రం రాంభట్ల కృష్ణమూర్తి గారే!

ప్రసాద్ గారు ఆంధ్రా యూనివర్సిటీలో ఎమ్మే చేసే రోజుల్లో బంగోరె, కేజీ సత్యమూర్తి, వకుళాభరణం రామకృష్ణ, ఆర్వియార్ మేస్టారూ, సూరపనేని హరిపురుషోత్తమ రావు, ఆయనకు సమకాలికులుగా ఉండేవారని ఆయన తరచు చెప్పేవారు. దాదాపు అదే రోజుల్లో, బూదరాజు మేస్టారు పీహెచ్‌డీ కోసం అక్కడే పరిశోధన చేసేవారట. ఎన్నో యేళ్ల తర్వాత, బూదరాజు మేస్టారూ ప్రసాద్ గారు హిమాయత్ నగర్లో ఎదురుబదురు ఇళ్లలో ఉండేవారు. ఆంధ్రా యూనివర్సిటీలో ఆనర్స్ కోర్స్ పూర్తి వచ్చిన తర్వాత ప్రసాద్ గారు కొన్నాళ్ళు గుంటూరు అంధ్ర క్రైస్తవ (ఏసీ) కళాశాలలో ట్యూటర్‌గా పని చేశారు. అప్పట్లో

"కరుణశ్రీ" జంధ్యాల పాపయ్యశాస్త్రి అదే కాలేజీలో లెక్చరరుగా ఉండేవారట. "కరుణశ్రీ"తో ముచ్చట్ల గురించి ప్రసాద్ గారు ప్రేమగా తలపోసుకునేవారు. అదే రోజుల్లో ప్రసాద్ గారు "యువజన" పత్రికకు అసలు ఎడిటర్‌గా పనిచేసేవారు. వాస్తవానికి ఆయన నేరుగా పత్రికా రంగంలోకే వచ్చి పడిపోవలసిన మాట ! అనేక కారణాల వల్ల అలా జరగలేదు– అది వేరే మాట!!

ఏసీ కాలేజీలో పనిచేసే రోజులోనో, ఆ తర్వాతో, ప్రసాద్ గారు దూరదృష్టితో బీయెడ్ కోర్స్ కూడా చేశారు. దాని సాయంతోనే, ఆయన "బతక లేని బడిపంతులు" అవతారం ఎత్తగలిగారు. ప్రసాద్ గారి ఇల్లు అక్షరాలా పుస్తకధామం. తొంభయ్యేళ్ళ పండు వయసులో, మోకాళ్లు సరిగా పనిచెయ్యని ముసలితనంలో సైతం ప్రసాద్ గారు పదుల వేల పుస్తకాలను చంటి పిల్లాల్లా సాకేవారు. అంతకుమించి, పుస్తకాలు చదివే దురభ్యాసం ఉన్నవాళ్ళని ఆయన చటుక్కున గుర్తుపట్టేసే వారు. మంచి పుస్తకాలు ఎంచి, వారికిచ్చేవారు. వాళ్లు ఆ పుస్తకాలు చదివేసినట్లు వాసన పట్టిన ఉత్తర క్షణం, తాను పిలిచి ఇచ్చిన మంచి మంచి పుస్తకాలను, వాళ్ల కాలర్ పట్టుకొని – పైలాకులా – వసూలు చేసేవారు! (అలా ఆయనకు ఎన్నో గొప్ప పుస్తకాలు వెనక్కి ఇవ్వవలసివచ్చిన దుఃఖభారంతో అంటున్న మాటలివి– సహృదయులు అర్థం చేసుకుంటారని ఆశ!!)

తాతాజీ కృషి చేసిన అధ్యయన రంగాల్లోనే ప్రసాద్ గారు కూడా కృషి చెయ్యడమూ, ఆయన జీవిత సాహిత్యాలపైనే పరిశోధన గ్రంథం రాయడం కాకతాళీయం కాదు. ప్రసాద్ గారు హైదరాబాద్ వచ్చిన కొత్తలో, చిక్కడపల్లిలో తాతాజీ ఇంటి దగ్గిరే ఉండేవారట. అక్కడికొచ్చే రాంభట్ల కృష్ణమూర్తి, తిరుమల రామచంద్ర తదితర సామాజిక శాస్త్ర పరిశోధకులతో ఆయనకు సన్నిహిత పరిచయం ఏర్పడింది. రాంభట్ల "సొంత కథ"లో వారిద్దరి పరిచయం గురించి విపులంగా రాశారు.

మన దేశానికి స్వాతంత్ర్యం రావడానికి పుష్కరం ముందు ప్రసాద్ గారు పుట్టారు. ప్రముఖ వామపక్ష పత్రికీయుడు యేటుకూరి బలరామమూర్తి, ప్రసాద్ గారికి స్వయానా పెత్తండ్రి కొడుకు. అయితే ఈ తమ్ముయ్యపై, ఆ అన్నయ్య ప్రభావం పరిమితమనే చెప్పాలి. ఇది దోషం కాదు – గుణమేననిపిస్తుంది నాకు. సొంతంగా ఆలోచించగల స్వభావం ఉన్నవాళ్ళు, స్వాతంత్ర మౌలిక రంగాల్లో కృషి చెయ్యగలుగుతారు. అలాంటి వారిపై, కుటుంబ సభ్యుల ప్రభావం పరిమితంగానే వుంటుంది. ప్రసాద్ గారికి ఓటు హక్కు వచ్చిన మూడేళ్లకు పుట్టిన వాణ్ణి నేను. మాకన్నా ఐదారేళ్ళు పెద్దవారైన కాచినేని రామారావు, ఆర్వీ రామారావు, దేవులపల్లి రామారావు, తెలిదేవర భానుమూర్తి తదితరులతోపాటు నేనూ "దొల్లుడు పుచ్చకాయ"లా తిరుగుతూ వుండేవాణ్ణి. ఈ పెద్దలెవరూ నన్ను చిన్నపుచ్చలేదు ఎప్పుడూ! ఆ సంస్కారం మాకందరికీ సంక్రమించింది ప్రసాద్ గారి నుంచే!! ఆయన మాకన్నా కుర్రతనం పోకిళ్లు పోయే వారు అప్పుడప్పుడు. "కొంత మంది కుర్రవాళ్ళు పుట్టుకతో వృద్ధులు" అన్నాడు మహాకవి. "కొంతమంది వృద్ధులు ఎల్లపుడూ యువకులే!" అనుకునే వాళ్ళం మేం ప్రసాద్ గారిని చూసి. ఇప్పుడు ఎవరిని చూసి అలా అనుకోగలం ? ❑

# ఎర్ర జెండా

**– ఏటుకూరి ప్రసాద్**

ఎర్రజెండేరో : తమ్ముడ
ఎర్రజెండేరా: మనదీ
ఎర్రజెండేరా తమ్ముడ
ఎర్రజెండేరా : మనదీ
ఎర్రజెండేరా

అమెరికా నడి బొడ్డు లోపల
శ్రామికుల పోరాటమందున
రక్తధారలో ముంచి ఎత్తగ
రాగ రంజితమైన దేదీరా "ఎర్ర"

జారు రాజును కూలదోయగ
లెనిన్ నడిపిన విప్లవమ్ములో
జనులందరు కూడ గట్టి
ముందు నడిపిన దెవ్వరోయీ "ఎర్ర"

అమెరికా సామ్రాజ్యవాదుల
విషపు కోరల నూడ బెరికి
వీర వియత్నాం – ముక్తిసేనకు
శక్తినిచ్చిన దెవ్వరోయీ "ఎర్ర"

లెనిన్ గ్రాడ్ పొలిమేరలందున
హిట్లరూ నాజీల మూకల
చావ గొట్టి చెవులు మూసిన
ఎర్రసేనను నడిపె నెవరొయ్ "ఎర్ర"

భుక్తికి, భూసేద్యమునకూ
విద్యకూ, ఉద్యోగమునకూ
నిత్యమూ పోరాడు ప్రజలను
ఐక్యపరచే దెవ్వరోయీ "ఎర్ర"

కొండలన్నీ పిండి కొట్టే
కండలన్నీ కరగ జేసే
శ్రామికుల కెల్లపుడు నీడగ
అండ దండగ నుండు జెండా "ఎర్ర"

దొరల దొంగల తరిమికొట్టి
రజాకారుల గుండెలందున
వాడిగల కైజార్లుదించిన
ప్రజాదండుకు అండ ఏదిర "ఎర్ర"

# ఒక అరుణతార గగనమెక్కె...



-పెనుగొండ లక్ష్మీనారాయణ

**'ఎర్రజెండెరో తమ్ముడ ఎర్రజెండెరా..**
**ఎర్రబాటరా ఇదే ఎర్ర పాటరా'**

జీవితాన్ని ఎరుపెక్కించుకొని అరుణాక్షరాలతో అభ్యుదయ సాహిత్యాన్ని అందించిన కామ్రేడ్ ఏటుకూరి ప్రసాద్ కలం మొన్న శనివారం నాడు సెలవు తీసుకుంది. ఒక పరిపూర్ణ జీవితం గొప్ప వారసత్వాన్ని అందించి నిష్క్రమించింది. గుంటూరులో 1936 జూలై 13న జననం. సొంత ఊరు ఏటుకూరు. 'నా ఏటుకూరు' గీతంతో స్వగ్రామం రుణం తీర్చుకున్నారు. విద్యార్థిగానే వామపక్ష భావాలు సంతరించుకున్నారు. 1951లో గుంటూరులో జరిగిన శాంతి సభలకు శ్రీశ్రీ హాజరైతే వారికి వాలంటీర్ ప్రసాద్, గుంటూరు నుంచి తొలితరం అభ్యుదయ రచయితలు వట్టికొండ రంగయ్య, విశాలాక్షి దంపతులు నిర్వహించిన 'ప్రజావాణి' పత్రికలో తొలుత రచనలు చేశారు. 1955లో తన గురువైన ప్రసిద్ధ ఆంగ్ల సాహితీవేత్త అమరేంద్ర (చతుర్వేదుల సరసింహశాస్త్రి) సూచనతో 'అరసం" సభ్యత్వం స్వీకరించారు.



బీఏ ఆనర్స్ పూర్తి చేసిన ప్రసాద్ ఎ.సి. కళాశాలలో తెలుగు ట్యూటర్‌గా పనిచేశారు. కమ్యూనిస్టు పార్టీ నిర్ణయం మేరకు హైదరాబాద్ చేరారు. తాను తన శ్రీమతి కుసుమ కుమారి అధ్యాపక వృత్తిలో కుదురుకున్నారు. 6 దశాబ్దాల హైదరాబాద్ జీవితంలో తన దేహం గేహం ధనం అరసం కొరకు, మిత్రుల సంక్షేమం కొరకు ధారవోశారు.

1955 తరువాత అరసం స్తబ్ధతకు గురైంది. గజ్జెల మల్లారెడ్డి, రాంభట్ల కృష్ణమూర్తి, వై.విజయ్‌కుమార్‌లతో కలసి పునర్నిర్మాణ బాధ్యతలు చేపట్టారు. 1973 ఆగస్టులో అరసం ఆరవ మహా సభలను గుంటూరులో నిర్వహించారు. కార్యదర్శిగా ప్రసాద్ ఎన్నికయ్యారు. కాకినాడలో 1978లో జరిగిన 8వ మహాసభలో ప్రధాన కార్యదర్శి అయ్యారు. 1936లో జన్మించిన ప్రసాద్ అదే సంవత్సరంలో ఆవిర్భవించిన అరసం జాతీయ కార్యదర్శిగా ఎన్నికై సేవలందించారు.

భౌతికంగా బక్కపల్చగా ఉండే ప్రసాద్‌కు 'సరాల బిగువూ కరాల సత్తువ 'ఎక్కువ. 'విశాలాంధ్ర', 'నవచేతన' ప్రచురణ సంస్థల సంపాదకుడిగా ఎంతో విలువైన వందలాది పుస్తకాలకు సంపాదకత్వం వహించారు. తాను ఎంతగానో గౌరవించే 'తాపీ ధర్మారావు జీవితం రచనల'పై ప్రామాణిక పరిశోధన చేసి డాక్టర్ గౌరవం పొందారు. గొప్ప గాయకుడైన ప్రసాద్ 'ఎర్రజెండెరో.. శివాలయ్య' వంటి నృత్య రూపకాలను, 'జనం నుంచి.. జనంలోకి' గీతాల సంపుటాలను ప్రజా సాంస్కృతికోద్యమానికి సమర్పించారు.

మనం విస్మరించిన ఉత్తమ తెలుగు రచయితలు శిష్ట్లా ఉమా మహేశ్వరరావు సమగ్ర రచనలను (యామిజాల ఆనంద్‌తో కలసి) సంపాదకత్వం వహించి వెలుగులోకి తెచ్చారు. 'పాయిట్రీ వర్క్ షాప్' పేరుతో తెలుగు పూర్వ ఆధునిక రచయితల స్వదస్తూరిలో పుస్తకాన్ని రెండుసార్లు ముద్రించారు. నూరేళ్ల కన్యాశుల్కం (సమగ్ర) వ్యాస సంపుటిని వెలువరించారు. కొంపెల్ల జనార్ధనరావు రచనలను ప్రచురణకు సిద్ధం చేశారు. అరసం అధికార పత్రిక 'అభ్యుదయ'ను తన సంపాదకత్వంలో నిర్వహించారు. "యాభై ఏళ్ల అరసం పత్రాలు' చారిత్రక గ్రంథాన్ని. ఎన్నో ప్రత్యేక సంచికలను వెలువరించారు. 'అభ్యుదయ సాహిత్యోద్యమంలో తొలితరం కమ్యూనిస్టులు' పుస్తకాన్ని ప్రచురించారు. ఇవన్నీ తన సొంత ఖర్చుతోనే.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఇరవయ్యవ రాష్ట్ర మహాసభలు తిరుపతిలో జరుగుతున్న సందర్భంలో 90 ఏళ్ల ప్రసాద్ అమరత్వం వార్త అందింది. ఆదివారం వారి స్మృతి సభను జరిపి అరసం తన నేతకు ఘనంగా నివాళి అర్పించింది. అరసంలో పనిచేస్తున్న మా తరాన్ని ప్రభావితం చేసిన మార్గదర్శి ప్రసాద్, ఆయనొక జ్ఞాన నిధి. వారితో మాట్లాడటం ఒక ఎడ్యుకేషన్. వారి ఏకైక కుమారుడు అరుణ్ ప్రసాద్‌కు సానుభూతి.

**'కొవ్వొత్తిలాగ కాలి ప్రదీపించువారికి**
**చేయెత్తి లాల్ సలాం సమర్పించుతూ...!** ❑

# పురోగామి చింతనాశీలుర ఐక్యతా దిశగా అరసం 20వ రాష్ట్ర మహాసభలు



- పి.పి.శాస్త్రి

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం 20వ మహాసభల సభలు మరియు 83వ వార్షికోత్సవాలు తిరుపతి పట్టణంలో 2026 మే 23, 24 తేదీలలో ఘనంగా జరిగాయి. ఉమ్మడి చిత్తూరు జిల్లా (చిత్తూరు - తిరుపతి శాఖలు) నిర్వహణలో జరిగిన మహాసభలకు (కామ్రేడ్ గంధమనేని, శివయ్య, కృష్ణారెడ్డి భవనం, బైరాగి పట్టెడ, తిరుపతి) అరసం పూర్వాధ్యక్షులు ఆచార్య కేతు విశ్వనాథరెడ్డి సాహిత్య ప్రాంగణం వేదిక అయ్యింది. అరసం రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు డాక్టర్ పి.సంజీవమ్మ గారి చేతుల మీదుగా జెండా ఆవిష్కరణ కార్యక్రమంతో ప్రారంభమైన మొదటిరోజు కార్యక్రమంలోనే ఆమె తన తొలి పలుకలతో మహాసభలకు దిశా నిర్దేశం చేశారు. సభల ప్రారంభానికి ముందు ప్రజా నాట్యమండలి కళాకారులు చక్కటి పాటలు ఆలపించి సభ్యులను ఉత్సాహభరితం చేశారు.

శంకరంబాడి సుందరాచారి వేదికపై జరిగిన ప్రారంభ సమావేశానికి అరసం తిరుపతి జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ యువశ్రీ మురళి ఆహ్వానం పలుకగా, రాష్ట్ర అరసం అధ్యక్షులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి అధ్యక్షత వహించగా, ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక జాతీయ సమన్వయకర్త, ఆచార్య కె.కాత్యాయని విద్మహే గారు అద్భుతమైన ప్రసంగం చేశారు. ఆమె ప్రసంగంలో 20వ శతాబ్ద కవులు, రచయితల గురించి ప్రస్తావిస్తూ అరసం అంటే కె.వి.రమణరెడ్డి గారు, కొడవటిగంటి కుటుంబరావు గారు, మరియు ఒక్కరే మహిళ వట్టికొండ విశాలాక్షి (1920లో జన్మించి 1940-50లలో రచనలు చేశారు) అభ్యుదయ రచయిత్రి అని చెప్పారు. "అరసం" ఏర్పడింది కూడా ఫాసిజానికి వ్యతిరేకంగా కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని స్థిరపరచడం కోసం అనీ, విశాలాక్షి గారు కూడా ఫాసిజానికి వ్యతిరేకంగా రచనలు చేశారని అన్నారు. ఆమె కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని ఇష్టపడుతూ ఉండేవారు, పితృ సామ్యాన్ని వ్యతిరేకించారు అని గుర్తు చేసుకున్నారు. ప్రగతిశీల రచయితలు ఐక్యతగా, ఆచరణ దిశగా, సామూహికంగా, ఐక్యతగా ఉండాల్సిన అవసరం ఉంది అని కాత్యాయని గారు పిలుపునిచ్చారు. ప్రస్తుతం ఫాసిస్టులు ఐక్యతగా ఉన్నారు కానీ ప్రగతిశీల భావాలు కలవారు ఐక్యతగా లేరు అని బాధ వ్యక్తం చేశారు. మహిళలలో సామాజిక ఐక్యత లేకపోవడం, కుటుంబాలలో వ్యక్తులు సంస్కృతిని ఆచరిస్తూ ఉండడం, వారి వెనుకబాటుతనానికి కారణం అని చెప్పారు.

మహిళలలో ప్రగతి శీల శక్తులను కలుపుకోవాలి. సమాజం ఎప్పుడూ చలనంలో ఉండాలి. అసమానతలు, మూఢ విశ్వాసాలు లేని సమాజం కోసం సంస్కరణ ఉద్యమం జరగాలి అని పిలుపునిచ్చారు. హేతువాద దృష్టి ఇటీవల తగ్గిందని, మతం ఈ రోజుల్లో ఇంట్లోకి, సమాజంలోకి వచ్చి అదే జీవితాన్ని నడిపిస్తోంది అన్నారు. ఆమె ప్రసంగంలో అనేక విషయాలను స్పృశిస్తూ ఇలా చెప్పారు. 1990 తర్వాత మతం ముందుకు వచ్చి అదే జీవితాన్ని నడిపిస్తోంది. 1990లకు ముందు వామ పక్షాలు, రైటిస్టులు ఇద్దరే ఉండే వారు రెండు భావాలుగా. ఎవరితో పోరాడాలి అనే స్థిరమైన అభిప్రాయం ఉన్న పరిస్థితి ఉంది. లాభాలు, ప్రయోజనాలు పొందుతున్నవారే ఉన్న స్థితి కావాలనుకుంటారు. పీడితులు, బాధితులు మార్పు కోరుకుంటారు. అరసం, విరసం, జనశక్తిగా విడిపోయాం. భావాల ప్రకారం కలుపుకోక పోతే అస్తిత్వ ఉద్యమాలు అన్నిచోట్ల



వస్తాయి. విద్యార్థి సంఘాలు రకరకాలుగా ఉద్యమిస్తున్నాయి. ప్రపంచీకరణ, ప్రైవేటీకరణ బుల్డోజర్లలా ప్రపంచమంతా వ్యాపించాయి. దీనివల్ల వామపక్ష ఐక్యత సాధ్యం కావడం లేదు. రాముడు మీద సాహిత్యకారులు రాయడానికి సాధ్యం కావడం లేదు. అది వారి పేటెంట్ రైట్‌గా కొన్ని పొలిటికల్ శక్తులు, స్వాములు, రాజ్యమేలుతున్నారు. రాజకీయ, సామాజిక సమస్యల్ని అడిగే శక్తి తగ్గిపోయింది లేదా పూర్తిగా పోయింది కూడా. ఇదంతా ఐక్యతా లోపం వల్లనే. మేధావుల్ని అర్బన్ నక్సలైట్స్‌గా చిత్రీకరించడం వల్ల వారికి స్వేచ్ఛ కూడా లేదు.

మతం గురించి మాట్లాడే వారికి స్వేచ్ఛ ఉంది. చిన్న సమూహాలుగా ఉంటే సమీకరించుకోవాలి. జై శ్రీరామ్ అనకపోతే శిక్షార్హులుగా ఉన్నారు. ఆర్థిక, రాజకీయ సామాజిక, లౌకిక ప్రజాస్వామ్య రచయితలు ఐక్యతగా ఉండి, విద్వేషాలని వీడనాడాలి. ప్రజాస్వామ్య ఐక్యత ఉండాలి. వందలుగా జైలులో ఉన్నవారు కొందరు, మనకు మనం బందీలుగా ఉన్నాము, భయంతో ఉన్నాము. సనాతన ధర్మం సాహిత్యాన్ని చదవాలి. ఎందుకంటే వెనుకబాటుతనాన్ని ఎక్కడికో తీసుకెళుతున్న సాహిత్యాన్ని ఎండగట్టి దాన్ని వ్యతిరేకించాలి. చిన్న కథలు, వ్యంగ్య కథలు, లౌకిక కథలు, చట్టాల గురించిన కథలు, ప్రచారం చేయాలి. సమాజంలో బాధితుల సమస్యలతో మమేకం అవ్వడం, సృజనాత్మకంగా ఆలోచించటం చేయాలి. 'సమూహ' సంస్థ వరంగల్లో కొంతవరకు కలుపుకుని పని చేస్తోంది. రాజ్యాంగాన్ని పాలకులే అమలు చేయడం లేదు. జస్టిస్ చిన్న ప రెడ్డి తదితరులు న్యాయవ్యవస్థను న్యాయమూర్తులుగా కాపాడా రు. ఇప్పుడు నేరస్థులకు సన్మానాలు చేయడం జరుగుతోంది. దేశభక్తి పేరుతో అత్యాచారులకు సన్మానాలు చేస్తున్నారు. మార్క్సిస్టులు అందరూ కలవాలి, అందరినీ కలుపుకోవాలి అని ఆమె ఆకాంక్షించారు. ఆహ్వాన సంఘం అధ్యక్షులు డాక్టర్ సాకం నాగరాజు, భారతీయ అభ్యుదయ రచయితల సంఘం అధ్యక్షులు శ్రీ పెనుగొండ లక్ష్మీ నారాయణ, భారతీయ అభ్యుదయ రచయితల సంఘం కార్యదర్శి శ్రీ వేల్పుల నారాయణ, విశాలాంధ్ర విజ్ఞానసమితి జనరల్ మేనేజర్, శ్రీ పి. హరినాథరెడ్డి, తెలంగాణ రాష్ట్ర అరసం అధ్యక్షులు డా. పల్లేరు వీరాస్వామి, ఆంధ్రప్రదేశ్ అరసం ప్రధానకార్యదర్శి శ్రీ వల్లూరు శివప్రసాద్, తదితరుల సందేశాలతో మహాసభలకు హుందాతనం వచ్చింది. ప్రారంభసభలో గురజాడ 'దేశమును ప్రేమించుమన్నా...' శంకరంబాడి సుందరాచారి 'మా తెలుగు తల్లికి మల్లెపూదండ...' గీతాలను ఆలపించారు.

విద్వాన్ విశ్వం వేదిక మీద మొదటి సదస్సుకు అరసం కార్యదర్శి వర్గ సభ్యులు, శ్రీ కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ, స్వాగతం పలుకగా, అరసం అధ్యక్షవర్గ సభ్యులు, శ్రీ నల్లి ధర్మారావు సభాధ్యక్షులుగా, 'అస్తిత్వ వాద సాహిత్యం – అరసం దృక్పథం' అనే అంశంపై ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి గారు వివరణాత్మక ప్రసంగం చేశారు. సంఘ సంస్కరణ ఉద్యమం నుంచి సంస్కరణ సాహిత్యం, స్వాతంత్ర్యోద్యమం నుంచి అటువంటి సాహిత్యం వచ్చింది అన్నారు. అభ్యుదయ సాహిత్యం ఒక అంతర్జాతీయ సాహిత్యంగా అవతరించింది అన్నారు. మొట్ట మొదటి అంతర్జాతీయ సాహిత్యం అభ్యుదయ సాహిత్యమే అని చెప్పారు. సోవియట్ రష్యాలో బోల్షివిక్ విప్లవం వచ్చిన తరువాత, మార్క్సిజం ప్రపంచ దేశాలకు పరిచయం అయిన తరువాత, సమాజాన్ని మేధావులు, రచయితలు ఒక కొత్త దృష్టితో చూశారన్నారు. వర్గ సమాజం అంటే సంపన్నులు–పేదవాళ్లు, పీడకులు–పీడితులు, శ్రామికులు–సోమరిపోతులు అనే విధంగా వారు చూసారు అన్నారు. ఆ మార్క్సిజం అందించిన వర్గ సిద్ధాంతంలో నుంచి అభ్యుదయ సాహిత్యం పుట్టుకొచ్చింది అని వివరించారు. కమ్యూనిస్టులు ప్రతిపాదించే వర్గ పోరాటాలు, ఎస్సీ ఎస్టీ బీసీ అణగారిన కులాల హక్కుల కోసం, మహిళా హక్కుల కోసం జరిగే పోరాటాలు వేరుగా



చూడాల్సిన అవసరం లేదని అభిప్రాయపడ్డారు.

ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి ప్రధాన కార్యదర్శి, శ్రీ చిన్నం పెంచలయ్య తన సందేశాన్ని వినిపించారు. కవి, కథారచయిత, శ్రీ పేరూరు బాలసుబ్రహ్మణ్యం సదస్సు విషయాలను సమన్వయం చేశారు.

వల్లంపాటి వెంకటసుబ్బయ్య వేదికగా రెండవ సదస్సు చిత్తూరు జిల్లా అరసం ఉపాధ్యక్షులు శ్రీ మూరిశెట్టి గోవిందు స్వాగతం పలకగా, అరసం అధ్యక్షవర్గ సభ్యులు, ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి సదస్సుకు అధ్యక్షత వహించగా, 'వర్తమాన అభ్యుదయ సాహిత్యం దశ–దిశ' అనే అంశంపై కేంద్ర సాహిత్య అకాడమి పురస్కార గ్రహీత ఆచార్య మధురాంతకం నరేంద్ర ప్రసంగించారు. 'యువతరం – సాహిత్యం' అనే అంశంపై అరసం కార్యనిర్వాహక కార్యదర్శి, శ్రీ జి.ఎస్.చలం ప్రసంగించారు. సాహితీ స్రవంతి అధ్యక్షులు శ్రీ కెంగార మోహన్ మిత్ర వాక్యం పలుకగా, తెలుగు అధ్యాపకులు డా. నాదెండ్ల శ్రీమన్నారాయణ సదుస్సును సమన్వయం చేస్తూ ముగింపు వాక్యాలు చెప్పారు.

గజ్జెల మల్లారెడ్డి వేదికపై మూడో సదస్సులో అరసం రచయితలు, కవులు రాసిన పుస్తకావిష్కరణలు ఉత్సాహంగా జరిగాయి.

- 1 శ్రీ జల్ది విద్యాధరరావు, సరికొండ నరసింహరాజు గార్లు సంపాదకులుగా రూపొందించిన 341 మంది కవుల కవితా సంకలనం "యుద్ధము – శాంతి" పేరుతో ఆవిష్కరించారు.
- 2. శ్రీ కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ రాసిన "చేతన" (సాహిత్య వ్యాసాలు) ఆవిష్కరణ జరిగింది.
- 3. "నాగలీ – నానీలు" పేరుతో శ్రీ బొల్లినేని నాగార్జున సాగర్ రచించిన నానీ కవితా సంపుటి ఆవిష్కరించారు.
- 4. "రణం నుండి శాంతివైపు" పేరుతో శ్రీ బంగారు వి. బి. ఆచార్యులు రాసిన వ్యాసాల సంపుటి ఆవిష్కరించారు.
- 5. శ్రీ బంగారు వి.బి.ఆచార్యులు రాసిన "నారీ భేరి" అనే ధీర్ఘ వ్యాసం పుస్తకం ఆవిష్కరణ జరిగింది.

మరికొన్ని పుస్తకాలు ఆవిష్కరణ జరిగింది. ఆవిష్కరణలు జరిగిన పుస్తకాలనే కాకుండా ఇతర పుస్తకాలను కూడా రచయితలు సభలో సభ్యులకు అందించారు. విశాలాంధ్ర వారు సభ ప్రాంగణంలో ముఖ్యమైన పుస్తకాలను ప్రదర్శించి, సభ్యులకు తక్కువ ధరకు విక్రయించారు. ఈ పుస్తక ఆవిష్కరణ సభలో డా॥ కవితశ్రీ, డా. గంగిశెట్టి శివకుమార్, శ్రీ కోసూరి రవికుమార్, ఆచార్య రాచపాళం చంద్రశేఖరరెడ్డి, శ్రీ పెనుకొండ లక్ష్మీ నారాయణ, శ్రీ వల్లూరి శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. రచయితలు, కవులు తాము రచించిన, ప్రచురించిన రచనల గురించి వారే స్వయంగా వివరించారు.

మధురాంతకం రాజారాం వేదికపై ఐదవ సదస్సులో ఎస్ కె యూనివర్సిటీ, అనంతపురం పూర్వ వైస్ ఛాన్సలర్ ఆచార్య పి. కుసుమకుమారి ఆహ్వానం పలుకగా శంకరంబాడి సాహితీ పీఠం అధ్యక్షులు, డా. డి. మస్తానమ్మ సదస్సుకు అధ్యక్షత వహించగా "అభ్యుదయ సాహిత్యంలో మహిళ" అనే అంశంపై విశ్రాంత ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సిహెచ్. సుశీలమ్మ ప్రధాన వక్తగా ప్రసంగించారు. ప్రొఫెసర్ సుశీలమ్మ మాట్లాడుతూ అనేక మంది మహిళా రచయితల రచనలను విశ్లేషించారు. సదస్సుకు అధ్యక్షత వహించిన డా. డి.మస్తానమ్మ సాహిత్య రచనలో మహిళలు ఎంతో మంది ప్రతిభ చూపించారు, ఇప్పుడు కూడా మహిళా సాహిత్యం ఎక్కువగానే వస్తోంది అని చెప్పారు. సదస్సును సమన్వయం చేస్తూ విశ్రాంత న్యాయమూర్తి శ్రీమతి ఎ.లక్ష్మి అభ్యుదయ సాహిత్యంలో న్యాయపర అంశాలను వివరిస్తూ చాసో, కొడవటిగంటి, రావి శాస్త్రి గార్ల రచనలలో మహిళల స్థితిగతులను గురించి ప్రస్తావించారు. "మతం – వర్తమాన సమాజం" అనే అంశంపై జరిగిన ఆరవ సదస్సులో ప్రధాన వక్తగా విరసం పూర్వ కార్యదర్శి శ్రీ వి.చెంచయ్య ప్రసంగించారు. ఆయన ప్రసంగిస్తూ "శ్రీరామ్" వెనుక రాజకీయ, ఆర్థిక, సామాజిక ప్రయోజనం పొందుతున్న బీజేపీని వారి నియంతృత్వ దోరణిని ఎండగడుతూ వివరణాత్మక ప్రసంగం చేసారు. సదస్సుకు అరసం కాకినాడ జిల్లా శాఖ అధ్యక్షులు శ్రీ పి. సుబ్బరాజు అధ్యక్షత వహించారు. తెలుగు భాషోద్యమం సమితి అధ్యక్షులు శ్రీ తమటం రామచంద్రారెడ్డి సమన్వయకర్తగా మాట్లాడారు. ఈ మహాసభలో గత మహాసభల తర్వాత దివంగతులైన అనేక మంది కవులు, కళాకారులు, రచయితలకు నివాళులు అర్పించారు.

ఈ మహాసభలు జరిగిన రోజున మరణించిన అరసం పూర్వ నాయకులు ఏటుకూరి ప్రసాద్ గారి సంతాప సభ ఏర్పాటు చేసి వారికి ఘననివాళి అర్పించారు. సిపిఐ కేంద్ర నాయకులు కామ్రేడ్ నారాయణ గారు ఈ సంతాప సభలో పాల్గొని ప్రసంగించారు. మహాసభల ప్రతినిధుల సమావేశంలో కార్యదర్శి నివేదిక ఆమోదం తెలపడం, మహాసభల తీర్మానాలను ఆమోదించడం, 2026 సంవత్సరానికి కొత్త కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. "పురోగామి చింతానా శీలుర ఐక్యతా దిశ" నినాదంతో జరిగిన ఈ అరసం మహాసభలు ఆ దిశగా ముందడుగు వేసాయి అని చెప్పవచ్చు. అరసానిది విలువైన గతం–బలమైన వర్తమానం– ఆశావహమైన భవితవ్యం అనే భావన కలిగిన నాయకత్వం భవిష్యత్తులో ప్రగతిశీల ఆలోచనాపరుల ఐక్యతను బలోపేతం చేస్తుందని ఆశిద్దాం. ❑

# అరసం రాష్ట్ర సభల ఐక్యతా రాగం..



\- రాఘవ

రాజ్యాంగంలో రాసుకున్నవన్నీ చెదిరిపోతున్నాయి. ప్రజాస్వామ్యం కనుమరుగైపోతోంది. సామ్యవాదం సుదూర స్వప్నంగా మిగిలిపోతోంది. నిరంకుశత్వం రాజ్యమేలుతోంది. మత ఫాసిజం ఉప్పెనలా ముంచుకొస్తోంది. ఈ నేపథ్యంలో పురోగామి శక్తుల ఐక్యతను కోరుతూ, మే 23, 24న తిరుపతిలో జరిగిన అభ్యుదయ రచయితల సంఘం (అరసం) ఇరవైయవ రాష్ట్ర మహాసభలు జరిగాయి.

భిన్న ఆలోచనలకు, భిన్న తాత్విక చింతనలకు కేంద్రమైన తిరుపతి నగరం అరసం మహాసభలకు వేదికైంది. నిజానికి తిరుపతి ఒక సాంస్కృతిక పునరుజ్జీవన కేంద్రం. తిరుపతిలో 1985లో జరిగిన అరసం రాష్ట్ర మహాసభలు నలభై ఏళ్ల తర్వాత మళ్లీ ఇప్పుడు జరిగాయి. అరసం రాష్ట్ర అధ్యక్షులు ఆచార్య రాచపాళెం చంద్రశేఖరరెడ్డి ఈ మహాసభల ప్రారంభ సమావేశానికి అధ్యక్షోపన్యాసం చేస్తూ, కొన్ని కీలకమైన వ్యాఖ్యానాలు చేశారు. “నూరేళ్ల క్రితం విదేశీ పాలకులతో పోరాటం చేశాం. నూరేళ్ల తర్వాత మళ్లీ మన దేశ పాలకులపై పోరాటం చేస్తున్న పరిస్థితులు వచ్చాయి” అన్న మాటల వెనుక ఎంతో ఆవేదన కనిపిస్తుంది.

### చీలికలు పేలికల మధ్య ఐక్యత ఎక్కడ?

పురోగామి చింతనాపరుల్లో ఏర్పడిన అభిప్రాయభేదాలు చీలికలకు దారితీశాయని రాచపాళెం అన్నారు. నిజమే, అభ్యుదయ రచయితల సంఘం నుంచి 1970లో చీలిన వారితో విప్లవ రచయితల సంఘం ఏర్పడింది. విప్లవ రచయితల సంఘం ఏర్పడిన అర్ధ దశాబ్దానికే, దాని నుంచి చీలిన వారితో జనసాహితి ఏర్పడింది. తర్వాత ప్రజాస్వామిక రచయిత్రుల సంఘం, లౌకిక వాద రచయితల సంఘం ఏర్పడటం వంటి పరిణామాలన్నీ జరిగిపోయాయి. “ఇలా చీలడం వల్ల కొన్ని సామాజిక వర్గాల (స్త్రీలు, మైనారిటీల)కు ప్రయోజనాలు చేకూరి ఉండవచ్చు. జాతీయ ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకున్నప్పుడు మిత్ర వైరుధ్యాలను పరిష్కరించుకుని ఐక్య కార్యాచరణతో పని చేయాలి” అంటూ అరసం రాష్ట్ర అధ్యక్షులుగా, ఈ మహాసభల ప్రారంభం సభకు అధ్యక్షోపన్యాసం చేస్తూ, రాచపాళెం ఇచ్చిన పిలుపు గురించి పురోగామి శక్తులైన రచయితలు ఆలోచించాలి. “నాలుగు దశాబ్దాల పరిణామాలను అవలోకనం చేసుకుంటే, అంతా ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైంది.” అనడం ఈ సభల్లో ఒక కీలకమైన పిలుపుగా భావించవచ్చు.

ప్రజాస్వామ్య రచయిత్రుల వేదిక జాతీయ సమన్వయ కర్త ఆచార్య కె.కాత్యాయని విద్మహే అరసం సభలకు ప్రారంభోప న్యాసం చేయడం ఒక విశేషం. భిన్నాభిప్రాయాలున్న పురోగామి రచయితల మధ్య ఒక సామరస్య పూర్వక వాతావరణానికి ఇది దోహదం చేస్తుంది. అంతే కాకుండా, విరసం సభ్యులు, విరసం పూర్వ కార్యదర్శి వి.చెంచయ్య కూడా ఈ సభల్లో రెండవ రోజు ఆదివారం ‘మతం-వర్తమాన సమాజం’ అన్న అంశంపైన

## • అరసం తీర్మానం

### కేంద్ర సాహిత్య అకాడమీ స్వయం ప్రతిపత్తిని కాపాడుకుందాం

అనేక భాషలు మాట్లాడబడుతున్న భారతదేశంలో వాటి మధ్య వారధిగా పనిచేయడానికి భారత ప్రభుత్వం 1954లో సాహిత్య అకాడమీ అనే సంస్థను స్థాపించింది. అనేక భాషల్లో రాయబడినా, భారతీయ సాహిత్యం ఒకటే అన్న సర్వేపల్లి రాధాకృష్ణన్ గారి అభిప్రాయానికి అనుగుణంగా సాహిత్య అకాడమీ మొదలైంది. సాహిత్య అకాడమీ ఒక స్వయం ప్రతిపత్తి గల సంస్థ. భారత ప్రభుత్వం బడ్జెట్ కేటాయిస్తుంది. అన్ని రాష్ట్రాల నుండి ఎన్నికైన సభ్యులు సాహిత్య అకాడమీ అధ్యక్షుడిని ఎన్నుకుంటారు. కార్యదర్శి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి గా ఉంటారు. విభిన్న రాష్ట్రాల సలహామండలి సభ్యుల ద్వారా కార్యక్రమాలు జరుగుతాయి. ప్రభుత్వం అవసరమనిపిస్తే ఏవైనా సూచనలు ఇవ్వవచ్చు. ప్రాధమ్యాలు చెప్పవచ్చు. ఇంకె క్కడా ప్రభుత్వం జోక్యం చేసుకునేది కాదు. 1954 నుండి 2019 దాకా అలాగే జరిగింది. 2019 సార్వత్రిక ఎన్నికలు తర్వాత సాహిత్య అకాడమీలో రాజకీయ జోక్యం మొదలై ఇప్పు డు పూర్తిగా తన గుప్పిట్లోకి తెచ్చుకుంది. సాహిత్య అకాడమీ స్వయం ప్రతిపత్తిని హేళన చేస్తూ 2024 సాహిత్య అకాడమీ పురస్కారాలను ప్రకటించబోయే అయిదు నిమిషాల ముందు నిలుపుదల చేశారు. అకాడమీ బడ్జెట్‌ను తగ్గించేశా రు. అందు వల్ల ఉత్తమ ఆశయాలతో నెలకొల్పబడిన సాహిత్య అకాడమీ స్వయంప్రతిపత్తిలో జోక్యం చేసుకోవద్దని కేంద్ర ప్రభుత్వాన్ని కోరుతూ ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం రాష్ట్ర మహాసభలు సందర్భంగా తీర్మానం చేస్తున్నది. ❑

ప్రసంగించడం ఈ ఐక్యతా వాతావరణానికి బలాన్ని చేకూరుస్తోంది.

### ఫాసిస్టులు ఐక్యంగా.. మనం అనైక్యంగా...

ఈ సభల్లో కాత్యాయని విద్మహే ప్రారంభోపన్యాసం కూడా పురోగామి రచయితల ఐక్యతను ఆకాంక్షిస్తూనే, వారి ఉపన్యాసం చాలా కీలకాంశాలతో సాగింది. ఫాసిజాన్ని వ్యతిరేకించడం, కమ్యూనిజాన్ని సమర్థించడమే ధ్యేయంగా అరసం ఏర్పడిందని గుర్తుచేశారు. అరసం తాత్విక భావనలను కొడవటిగంటి కుటుంబరావు చెప్పేవారని అన్నారు. అనుభవాల నుంచి మనం ఏం నేర్చుకుంటున్నామో ఆలోచించాలని కోరారు. 'ప్రగతి శీలురు ఐక్యత దిశగా మన ఆచరణ సాగాలి' అన్న రాచపాళెం మాటలను కాత్యాయని విద్మహే గుర్తు చేస్తూ, "ఫాసిస్టులు ఐక్యంగా ఉన్నారు. మనం చాలా అనైక్యంగా ఉన్నాం." అన్న చేదు నిజాన్ని కుండబద్దలు కొట్టారు. సెక్యులర్ రైటర్స్ అసోసియేషన్‌లో ఒకరు ఇదే విషయాన్ని చెపుతూ, "ఒక్క విషయంలో ఏకీభావం ఉన్నా వాళ్లు(ఫాసిస్టులు) కలుపుకొచ్చారు. ఒక్క విషయంలో తేడాలున్నా మనం కలుపుకు పోలేకపోతున్నాం." అని గుర్తుచేశారు.

## • అరసం తీర్మానం

### పరిపాలన, బోధనా భాషగా తెలుగును అమలు చేయాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అమ్మ భాష తెలుగుకు రోజురోజుకు ఆదరణ కరువవుతోంది. పాలనా విద్యా వ్యవస్థల్లో తెలుగు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడింది. ప్రాథమిక పాఠశాల స్థాయినుండే ఆంగ్ల మధ్యమంలో విద్యాబోధన కొనసాగుతోంది. అందుకు ప్రభుత్వం అనుమతించింది. ఆధునిక ప్రపంచానికి ఆంగ్లం అనుసంధాన భాష, అందుకే దానిని ప్రోత్సహిస్తున్నామని ప్రభుత్వం ప్రకటించింది. ఇది పూర్తిగా అశాస్త్రీయ వాదం. ప్రపంచంలో ఏదేశంలోనైనా పాఠశాల విద్య మాతృభాషలోనే కొనసాగుతుంది. ఆంగ్ల భాషను ఒక పాఠ్యాంశంగా ఎవరూ కాదనరు. కానీ తెలుగు రాష్ట్రాలలో ప్రభుత్వాలు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నాయి. ప్రభుత్వ పరిపాలనా వ్యవహారాల్లోను తెలుగు భాష నిర్లక్ష్యానికి గురయింది. ఈ విధానాలను అభ్యుదయ రచయితల సంఘం తీవ్రంగా ఖండిస్తోంది. ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలన్నింటిలోనూ తెలుగు మాధ్యమంలోనే విద్యాబోధనను కొనసాగించేందుకు ప్రభుత్వం పూనుకోవాలి. ఆంగ్ల భాషను ఒక ముఖ్యమైన బోధనా అంశంగా ప్రోత్సహించవచ్చు. పరిపాలనా వ్యవస్థలు విధిగా కార్యకలాపాలను తెలుగులోనే నిర్వహించాలని అరసం డిమాండ్ చేస్తోంది. ❑

### సకల 'అస్తిత్వాల'ను నిలుపుకోలేకపోయాం!

"మత మూఢత్వం, అసమానతలున్న సమాజం వల్ల లాభపడే వారు దాన్ని అలాగే కొనసాగించాలనుకొంటున్నారు. మనం మారాలనుకుంటున్నాం. ఈ రెంటి మధ్య సంఘర్షణే నేటి స్థితి" అంటూ వివరించారు. "అరసం ఏర్పడినప్పుడు ఒక చలనం ఉండేది. స్త్రీలు ప్రశ్న వేసినప్పుడు వారు దాన్ని చలనంగా భావించారు. దళితులు ప్రశ్నించినప్పుడు వారు కూడా దాన్ని చలనంగా భావించారు. ఈ అస్తిత్వ సమూహాలన్నిటినీ నిలుపుకోగలిగినప్పుడు ఫ్యాసిజాన్ని నిలువరించగలిగే వాళ్లం కదా" అని ప్రశ్నించడం ద్వారా, అస్తిత్వ ఉద్యమాలను అర్థం చేసుకోకపోవడం, వాటిని ఇముడ్చుకోలేకపోవడం వల్లనే పురోగామి శక్తుల్లో అనైక్యత ఏర్పడిందని స్పష్టం చేశారు. ఈ సమూహాలన్నిటినీ నిలుపుకోగలిగినప్పుడు ఫాసిజాన్ని ఎదుర్కోగలం కదా అని చీలికలకు దారి తీసిన లోపాల్ని కూడా ఎత్తి చూపారు. అస్తిత్వ ఉద్యమాలను కలుపుకోలేకపోవడం వల్లనే బలహీనపడ్డామని స్పష్టం చేశారు.

### బుర్ర ఉన్న ప్రతివాడూ అర్బన్ నక్సలైటే..!

"అస్తిత్వ ఉద్యమాలున్నప్పటికీ, చివరి విముక్తి మాత్రం మార్క్సిజమే" అని నిర్మొహమాటంగా చెప్పేశారు. పెద్ద సమూహంగా ఉన్నప్పుడు బలంగా ఉన్న మనం చీలడం వల్ల బలహీన పడ్డామనడం చేదు నిజం. "మనం అందరినీ కలుపుకునిపోయే కార్యక్రమం ఏమిచ్చాం" అంటూ ఆత్మ పరిశీలన చేసుకోమన్నట్టు కాత్యాయని విద్మహే ప్రశ్నను సంధించారు. పురోగామి శక్తుల అనైక్యత వల్ల ప్రస్తుతం నెలకొన్న పరిస్థితిని వివరిస్తూ, "ఇప్పుడు కాస్త బుర్రఉన్న వారెవరైనా అర్బన్ నక్సలైట్ అయిపోతున్నారు" అంటూ చేసిన వ్యాఖ్యానం వెనుక ప్రభుత్వ దుర్మార్గపు చర్యను బహిర్గతం చేశారు. మావోయిస్టులను వరుసపెట్టి కాల్చి చంపడంతో పాటు, పట్టణాల్లో ఉన్న ఆలోచనాపరులను కూడా 'అర్బన్ నక్సలైట్లు' అని ముద్ర వేసి వెంటాడే ప్రస్తుత స్థితిని గుర్తుచేశారు.

### అందరినీ కలుపుకుపోయే కార్యక్రమం ఎక్కడ ?

"అందరినీ కలుపుకుపోయే కార్యక్రమం మనం ఏమిచ్చాం" అంటూ ఆమె ప్రశ్నించారు. పంథాల వైరుధ్యాలను పక్కన పెట్టి, లౌకికవాద శాస్త్రీయ దృష్టితో ఏకం కావాలని పిలుపునిచ్చారు. లౌకిక పురోగామి శక్తులను ఐక్యం చేసే కామన్ ఎజెండా ఏర్పాటు చేయాలన్నారు. స్త్రీలకైనా, దళితులకైనా మార్క్సిస్టు ఉద్యమంతోనే వారి ఆకాంక్షలను నెరవేర్చగలమనే ధీమాను కాత్యాయని విద్మహే వ్యక్తం చేశారు. రెండు రోజుల అరసం సభల సారాంశమంతా ప్రారంభ సమావేశంలో ఇలా వ్యక్తమైంది. ❑

# అరసం నూతన కార్యవర్గం



ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం - అరసం 20వ రాష్ట్ర మహాసభ ఉత్సాహపూరిత వాతావరణంలో మే 23,24 తేదీలు, శని, ఆదివారం రెండు రోజులు తిరుపతిలో జరిగాయి. పలు ముఖ్యమైన సాహిత్య, సాంస్కృతిక, ప్రజా సమస్యలకు సంబంధించిన అంశాలపై తీర్మానాలు ఆమోదం పొందాయి. నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నికయింది.

**నూతన కమిటి**

గౌరవ అధ్యక్షులుగా డాక్టర్ పి.సంజీవమ్మ (కడప), అధ్యక్షులుగా ఆచార్య రాచపాళెం చంద్రశేఖర్‌రెడ్డి (అనంతపురం)ను ఎన్నుకున్నారు. అధ్యక్ష వర్గం సభ్యులుగా డాక్టర్ సాకం నాగరాజ (తిరుపతి), ప్రొఫెసర్ ఎన్.ఈశ్వరరెడ్డి(కడప), నల్లి ధర్మారావు (శ్రీకాకుళం), ప్రొఫెసర్ సీహెచ్ సుశీలమ్మ(గుంటూరు), విశ్రాంత న్యాయమూర్తి అడబాల లక్ష్మి (ఏలూరు), ప్రొఫెసర్ అల్లంశెట్టి ఈశ్వరమ్మ (విశాఖ), పి.సుబ్బరాజు(కాకినాడ), డాక్టర్ పెరుగు రామకృష్ణ(నెల్లూరు) ఎన్నికయ్యారు. ప్రధాన కార్యదర్శిగా వల్లూరు శివప్రసాద్ (గుంటూరు), కార్యనిర్వాహణ కార్యదర్శిగా జి.ఎస్.చలం (విజయనగరం) ఎన్నిక కాగా, కార్యదర్శి వర్గంలో కె.శరచ్చంద్రజ్యోతిశ్రీ(గుంటూరు), ఎ.ఎం.ఆర్. ఆనంద్ (కేంద్రం), బి.ఎన్.సాగర్(ఏలూరు), కొత్తపల్లి సత్యనారాయణ, ఉప్పల అప్పలరాజు(విశాఖపట్నం), గంటా మోహన్ (చిత్తూరు), యువశ్రీ మురళి(తిరుపతి), కవితశ్రీ డాక్టర్ శ్రీనివాసులు (అన్నమయ్య), గండి స్వామిప్రసాద్(తూర్పు గోదావరి) ఎన్నికయ్యారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యులుగా ప్రొఫెసర్ వంకిరెడ్డి రెడ్డెప్ప రెడ్డి, చెరుకుమల్లి సింగారావు, బెనహర్ బాబు, కోసూరి రవికుమార్, గోలి సీతారామయ్య, ఎస్.ఎం.బాషా, బి.ఈశ్వరరెడ్డి, గుత్తా హరి సర్వోత్తమనాయుడు, డాక్టర్ తన్నీరు నాగేంద్ర, డాక్టర్ నెమిలేటి కిట్టన్న, డాక్టర్ సి.ఎస్.క్షేత్రపాల్‌రెడ్డి, మూరిశెట్టి గోవిందు, పల్లిపట్టు నాగరాజు, రత్నాల బాలకృష్ణ, సిరికి స్వామి నాయుడు, టి. తిరుమల రావు, మల్కిపురం జగదీష్, కలం ప్రహ్లాద, సిద్ధగిరి శ్రీనివాస్, డాక్టర్ కరణం శ్రీనివాసులురెడ్డి, గంగిశెట్టి శివ కుమార్, మల్లుల సీతారాం ప్రసాద్, డాక్టర్ బి.హెచ్.వి. రమాదేవి, మోదుకూరి అరుణ్‌కుమార్, పి.పి.శాస్త్రి, సిహెచ్. మద్దిలేటి, పరుచూరి అజయ్‌కుమార్, ఎం.మురళీకృష్ణ, సరికొండ నరసింహరాజును ఎన్నుకున్నారు. సోదర సంస్థల ప్రతినిధులుగా కూన అజయ్ (విశాలాంధ్ర), చిన్నం పెంచలయ్య, (ప్రజానాట్య మండలి), ఎస్.వెంకటసుబ్బయ్య (ఏఐటీయూసీ), పి.హరనాథ్ రెడ్డి (విశాలాంధ్ర విజ్ఞాన సమితి)ని ఎన్నుకున్నారు.

**సబ్ కమిటీలు**

అరసం కార్యకలాపాలను డిజిటల్ ప్లాట్ఫామ్లపై విస్తృతంగా తీసుకెళ్లేందుకు ఒకటి, సమాచార సమన్వయం కోసం మరొకటి రెండు సబ్ కమిటీలను ఏర్పాటు చేశారు. సమాచార సేకరణ సబ్ కమిటీ కన్వీనరుగా యువశ్రీ మురళి(తిరుపతి), సోషల్ మీడియా సబ్ కమిటీ కన్వీనరుగాఎ.ఎం.ఆర్.ఆనంద్ (కేంద్రం), సోషల్ మీడియా సబ్ కమిటీ సభ్యులుగా డాక్టర్ తుమ్మలూరి సురేష్‌బాబు(కడప), బసు పోతన (విశాఖ)ను ఎన్నుకున్నారు. ❑

● యుద్ధాలకు వ్యతిరేకంగా అరసం తీర్మానం

**1. పాలస్తీనాపై ఇజ్రాయేల్ మారణకాండ :**

ఇజ్రాయేల్‌పై హమాస్ జరిపిన ఉగ్రవాద దాడిని సాకుగా జూపుతూ మొత్తం పాలస్తీనాపై దాదాపు రెండేళ్లుగా భీకర దాడులు చేస్తోంది. వేలాది మంది సామాన్య పౌరులు హతుల య్యారు. లక్షలాది మంది నిరాశ్రయులయ్యారు. పాలస్తీనాలో 90% ఆసుపత్రులు, విద్యాలయాలు, నివాస భవనాలు ధ్వంసం అయ్యాయి. కనీస మానవతా సాయం అందకుండా ఇజ్రాయేల్ అడ్డుకుంటోంది. రానున్న సంవత్సరంలో పది లక్షల మంది చిన్నారులు మృత్యువాత పడే "మహా మానవ సంక్షోభం" ఐక్య రాజ్య సమితి హెచ్చరిస్తోంది. పాలస్తీనాపై ఇజ్రాయేల్ దాడులను ఖండిస్తూ, ఐ.రా.స. ఆమోదించిన "స్వతంత్ర పాలస్తీనా, స్వతంత్ర ఇజ్రాయేల్" సూత్రాన్ని అమలు చేసేలా అంతర్జాతీయ సంస్థలు, దేశాలు వత్తిడి తేవాలని అరసం డిమాండ్ చేస్తున్నది. పాలస్తీనాకు సంఘీభావం ప్రకటిస్తోంది.

**2. ఇరాన్ పై అమెరికా, ఇజ్రాయేల్ చేస్తున్న యుద్ధం :**

ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేస్తోందని, స్వంత పౌరుల ను హతమారుస్తోందని ఆరోపిస్తూ, అమెరికా, ఇజ్రాయేల్ ఏక పక్షంగా యుద్ధాన్ని ప్రారంభించాయి. ఇరాన్ అణ్వాయుధాలు తయారీని నిలిపివేయడానికి అంగీకరిస్తూ, గతంలో చేసుకున్న ఒప్పందం నుండి అమెరికా ఏకపక్షంగా వైదొలగి, ఇరాన్‌పై ఆంక్షలు విధించింది. అయినా ఇరాన్ లొంగకపోవడంతో, ఇజ్రాయేల్‌తో కలసి దాడులకు దిగింది. ఇరాన్‌లోని ఖోమెని అనుసరించిన మత చాంధస పాలనను వ్యతిరేకించాల్సిందే. ఇరాన్‌లో ఎవరు పాలించాలనేది నిర్ణయించాల్సింది ఆ దేశ ప్రజలే తప్ప అమెరికా, ఇతర బాహ్యశక్తులు కాదు. ఇరాన్ అణ్వాయుధాలు తయారు చేయడం లేదని అమెరికా నిఘా సంస్థలు చెప్తున్నా పట్టించుకోకుండా యుద్ధాన్ని ప్రకటించి, ఆ దేశ అత్యున్నత నాయకత్వాన్ని హత్య చేశాయి. ప్రతిగా ఇరాన్ "హర్మూజ్ జలసంధిని" మూసివేసింది. ఫలితంగా అంతర్జాతీయ ఇంధన సంక్షోభం ఏర్పడింది. మరోవైపు తాత్కాలిక కాల్పుల విరమణను ఉల్లంఘిస్తూ, ఇజ్రాయేల్ లెబనాన్‌పై దాడులు చేస్తోంది. ఈ రకంగా పశ్చిమాసియాలో ఏర్పడ్డ యుద్ధ విస్తరణా ప్రమాదాన్ని నివారించేందుకు ఐరాసా, ఇతర పలుకుబడి కలిగిన దేశాలు ముందుకు రావాలని అరసం కోరుతోంది.

**3. ఉక్రెయన్ రష్యా యుద్ధం :**

నాటోని రష్యా దిశగా విస్తరించబోమని అమెరికా, నాటో దేశాలు గతంలో ఇచ్చిన హామీలను, కుదిరిన ఒప్పందాలను ఉల్లంగిస్తూ నాటోలో ఉక్రెయన్‌ను చేర్చుకోవాలనే ప్రయత్నాల ను వ్యతిరేకిస్తూ రష్యా ఉక్రెయన్ దాడిని ప్రారంభించి నాలుగు సంవత్సరాలు దాటుతోంది. 20%కు పైగా ఉక్రెయన్ భూభాగాలను రష్యా ఆక్రమించుకుంది. రష్యాను ప్రత్యక్షంగా ఎదుర్కోలేని అమెరికా యూరోప్ దేశాలు రష్యాపై విధించిన 20 వేలకు పైగా ఆంక్షలు అటు రష్యాను, ఇటు ప్రపంచ దేశాలను అతలాకుతలం చేస్తున్నాయి. ❑

## గ్రంథాలయాలను అభివృద్ధి చేయాలి

గ్రంథాలయ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేయాలి. పుస్తకాల కొనుగోలు ప్రారంభించాలి. స్వాతంత్ర్య ఉద్యమ కాలం నుండి తెలుగునాట గ్రంథాలయాలు నిర్వహిం చిన పాత్ర మహోన్నతమైనది, మరువలేనిది. సామాజిక చైతన్యం కలిగించడంలో ప్రజల్లో శాస్త్రీయ విజ్ఞానాన్ని పెంపొందించడంలో గ్రంథాలయాలు కీలకపాత్ర పోషించాయి. ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రమయ్యాక దశాబ్దా కాలంగా గ్రంథాలయాల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. పుస్తకాల కొను గోళ్లు నిలిచిపోయాయి. పదవీ విరమణ చేసిన ఉద్యోగుల స్థానాలను తిరిగి భర్తీ చేయడం లేదు. ఫలితంగా పలు గ్రంథాల యాలు మూతపడుతున్నాయి. స్థానిక సంస్థల నుండి కోట్లాది రూపాయల గ్రంథాలయ సెస్ ఏటా వసూలవుతున్నా వాటిని గ్రంథాలయాల అభివృద్ధికి వినియోగించకుండా దారి మళ్లిస్తున్నారు. రెండేళ్లుగా అరసం నేతృత్వంలో ఇతర సంఘాలు, సాహిత్య సంస్థలు ఉద్యమించాయి. ఫలితంగా ప్రభుత్వం కొన్ని చర్యలు చేపట్టింది. కానీ పూర్తిస్థాయిలో గ్రంథాలయాల నిర్వహణ తీరుతెన్నులను మెరుగుపర్చాలి. నిధులు దారి మళ్లించకూడదని, ఉద్యోగుల ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని అరసం డిమాండ్ చేస్తున్నది.

## ప్రమాదంలో రాజ్యాంగం

డా. బి.ఆర్.అంబేద్కర్ నేతృత్వంలో రూపొందిన భారత రాజ్యాంగం దేశ పౌరులకు అనేక ప్రాథమిక హక్కులను అందిం చింది. విధులను నిర్దేశించింది. లౌకిక వ్యవస్థకు బలమైన పునాదులు వేసింది. భారతీయ జనతాపార్టీ నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం రాజ్యాంగ మౌలిక స్వభావాన్ని దెబ్బ తీసే ప్రయత్నాలు చేస్తోంది. అన్ని ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేస్తోంది. న్యాయవ్యవస్థ అందుకు అతీతం కాదు. ఫలితంగా ఫెడరల్ వ్యవస్థ స్వభావం బీటలు వారుతోంది. భారతీయ లౌకిక స్వభావాన్ని బలహీనపరుస్తోంది. ప్రభుత్వం అనుసరిస్తు న్న ఈ చర్యలను సాహిత్య సాంస్కృతిక మేధావి వర్గాలు, విద్యా న్యాయ వ్యవస్థలలోని ప్రగతిశీల శక్తులన్నీ ఏకమై తిప్పికొట్టాలని అరసం విజ్ఞప్తి చేస్తోంది. ❑

# అలుపెరుగని అభ్యుదయ సాహిత్య ప్రయాణం

- రాచపాళెం చంద్రశేఖరరెడ్డి



నేను సైతం ప్రపంచాగ్నికి సమిధనొక్కటి ఆహుతిచ్చాను"

- శ్రీశ్రీ: జయభేరి, 1933, జూన్ 2

అరసానిది ఆర్థిక సమానవాదమైనా, సామాజిక న్యాయ వాదాన్ని విస్మరించదు. పైగా సామాజిక న్యాయవాదులతో చేతిలో చేయివేసి నడుస్తున్నది. అందుకే ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం 20వ మహాసభలను "పురోగామి చింతనాశీలుర ఐక్యతాదిశగా" అనే ప్రధాన అంశం కేంద్రంగా నిర్వహిస్తున్నది.

మార్క్సిజం తాత్విక సిద్ధాంతంగా, అంతర్జాతీయ వాదం స్వభావంగా, శ్రామిక వర్గం పక్షపాతంగా, బోల్షివిక్ విప్లవం తక్షణ స్ఫూర్తిగా, సమసమాజం స్వప్నంగా ప్రపంచమంతా పుట్టిన సాహిత్యం అభ్యుదయ సాహిత్యం, ప్రపంచ అభ్యుదయ సాహిత్యంలో అంతర్భాగం భారతీయ అభ్యుదయ సాహిత్యం; అందులో అంతర్భాగం తెలుగు అభ్యుదయ సాహిత్యం, అభ్యుదయ సాహిత్యా నికి ప్రచారవేదిక అభ్యుదయ రచయితల సంఘం (అరసం), భారతదేశంలో 1936లోను, తెలుగునాట 1943లోను అరసం సంస్థలు పుట్టాయి. తెలుగు అభ్యుదయ సాహిత్యం 1933 జూన్ రెండున అచ్చయిన శ్రీశ్రీ 'జయభేరి' కవితతో మొదలైంది. తొంబై మూడేళ్ళ చరిత్ర నింపుకున్నది. అభ్యుదయ రచయితల సంఘం ఎనభై మూడేళ్ల చరిత్ర నింపుకున్నది.

ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం ఇరవయ్యవ రాష్ట్ర మహా సభలు తిరుపతిలో ఈ నెల 23, 24 తేదీలలో జరుపుకుంటున్న నేపథ్యంలో ఒకసారి సింహావలోకనం చేసుకుంటే వందల కొద్దీ అభ్యుదయ రచయితలు అభ్యుదయ సాహిత్య చరిత్ర నిర్మాణం చేశారు. వందల కొలది సాహిత్య కార్యకర్తలు అరసం నిర్మాణంలో పాల్గొన్నారు. వీరి లక్ష్యం ప్రజా వ్యతిరేక సాహిత్య నిర్మూలనం, ప్రజానుకూల సాహిత్య నిర్మాణం.

అరసానిది గానీ, అభ్యుదయ సాహిత్యానిది గానీ నల్లేరు మీద బండి నడకగా సాగిపోలేదు. శరవేగంగా పరిగెత్తిన రోజులున్నా యి. మందకొడిగా నడిచిన రోజులూ ఉన్నాయి. రాజకీయ పరిణామాల ప్రభావంతో అరసం ఆటుపోట్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. 1955-65 దశాబ్దాన్ని తెలుగు సాహిత్య చరిత్రలో స్తబ్దతా దశాబ్దం అన్నారు గానీ, అది నిజం కాదని రుజువు చేయడంలో అభ్యుదయ సాహిత్యం ఆధారమైంది. అయినా 1965 తర్వాత దిగంబర కవిత్వం, విప్లవ సాహిత్య కాలంలో




అరసం, అభ్యుదయ సాహిత్యం తీవ్రమైన ఆరోపణలను ఎదుర్కొ న్నాయి. హేళనకు గురయ్యాయి. ఏ ఉద్యమానికైనా గుంట మిట్టలు ఉంటాయని ఆ తర్వాత తెలుగు సమాజం, సాహిత్య పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ఇదిలా ఉంచుదాం.

భూస్వామ్య, పెట్టుబడిదారీ వ్యవస్థలను ధిక్కరించి, సామ్యవాద వ్యవస్థకు అనుకూలంగా భావ ప్రచారం చేసేది అభ్యుదయ సాహిత్యం. ఇది ప్రజా ఉద్యమాలకు వెన్నుదన్నుగా నిలిచేది. శ్రమదోపిడీ, మతమౌఢ్యం, ఆధిపత్య ఉన్మాదం, సాంఘిక వివక్ష వంటి తిరోగమన అంశాలను శత్రువులుగా పరిగ ణిస్తుంది అభ్యుదయ సాహిత్యం. ఇది సమాజాన్ని భౌతిక దృష్టితో, వర్గం దృక్పథంతో విశ్లేషిస్తుంది. అదే సమయంలో సంక్లిష్టమైన భారత దేశ సామాజిక నిర్మాణాన్ని దృష్టిలో పెట్టుకొని అస్తిత్వ వాదాలను అరసం ఆలింగనం చేసుకుంటుంది.

అసమ సమాజంలో అరసం పీడితుల పక్షం వహిస్తుంది. మానవ సంబంధాలలో ఆర్థికాంశం పాత్రను రుజువు చేయడంతో, శ్రమదోపిడీని ప్రతిఘటించడంతో మొదలై, క్రమంగా అనేక సాంఘిక వివక్షలను, ఆధిపత్యాలను ప్రతిఘటించే దశకు చేరుకుంది అభ్యు దయ సాహిత్యం. అరసం ఈ పరిణామాన్ని ప్రచారం చేసింది. 1969లో తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని సమర్థించని అరసం, 1991 తర్వాత తెలంగాణ రాష్ట్ర ఆఖరి ఉద్యమానికి **(మిగతా 43వ పేజీలో)**

# కలం గళంతో చైతన్యం రగలాలి !



-కె.శరచ్చంద్ర జ్యోతిశ్రీ

"పాలకుల చేతిలో ప్రజాస్వామ్యం
ఓ కీలుబొమ్మై ఆడు
మేధావుల ఆలోచనల్లో
మెరిసే మేడిపండ్లు చూడు
యుద్ధాల పద్మవ్యూహంలో సామాన్యుడే
అభిమన్యుడు నేడు
కమ్ముకొచ్చే కారుమబ్బుల చీల్చే రవికిరణం
అభ్యుదయ కవితాచరణం"

ఇదేదో ఓ కవి అసహనం కాదు. అతిశయోక్తి అసలేకాదు. ప్రపంచం కళ్ల ముందున్న నేటి నిజం. గడచిపోయిన తరాలు ఎన్నెన్నో త్యాగాలు చేసి సాధించి ఇచ్చిన స్వాతంత్ర్యం తెల్లముఖం వేస్తోంది. భారత రాజ్యాంగం పౌరులకు ప్రసాదించిన ప్రాథమిక హక్కులు, పౌర స్వేచ్ఛ హుళక్కి అయిపోతున్నాయి. న్యాయ వ్యవస్థది ఓ అయోమయం అవస్థగా మారుతోంది. ప్రజలపక్షాన నిలవాల్సిన సమాచార సంస్థలు గోడ దూకేస్తున్నాయి. కారణం? వ్యాపారం. అంతా వ్యాపారం. అందునా సరళీకరణ వ్యాపారం. ఎంత అందమైన పేరు! ఎంత ఆకర్షణీయం! అంతా ప్రపంచీకరణ. ప్రపంచాన్ని ధ్వంసం చేసే అణుబాంబులు మొదలు మోక్ష మార్గం అనుకునే భక్తి వరకూ అంతా 'అత్యంత సరళమైన వ్యాపారం'. ఈ వ్యాపారానికి మూలమైనది పెట్టుబడి. దానియజమాని శాసిస్తున్నాడు ప్రపంచాన్ని. వాణ్ణి ఆమోదించి తల వంచితే సరే, లేకుంటే ఆ తల ఉన్నాలేనట్టే. రాత్రికి రాత్రి ఎగిరిపోయినా ఆశ్చర్యం లేదు. ఎందుకిలా? ఇందులోని అసలు మర్మం బోధపడేది ఎవరికీ? బోధపరిచేది ఎవరు?

చరిత్రలో ఆపని చేసిందీ, వర్తమాన వాస్తవంలో చేస్తున్నదీ సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలే. అందుకే వాటి నడ్డి విరగ్గొట్టాలని చూస్తోంది ఈ వ్యవస్థ, దాని చోదక శక్తి అయిన ప్రభుత్వం.

1930 దశకాన్ని ప్రపంచ వ్యాప్తంగా (హంగ్రీ థర్టీస్ )ఆకలి దశాబ్దం అన్నారు ఆనాడు. అందుకు కారణాలు ఎలుగెత్తి చాటాయి, వాటి గుట్టును రట్టుచేశాయి అందుకే ఆవిర్భవించాయి సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలు.

1935 జూన్ 21న పారిస్ లో అంతర్జాతీయ రచయితల సంఘం మహాసభలు జరిగాయి. అందులో ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన రచయితలు మాక్సిమ్ గొర్కి, రాల్ఫ్ పాక్స్, క్రిస్టోఫర్ కాడ్వెల్ తదితరులు పాల్గొన్నారు. అప్పటికే తలెత్తి బుసలు కొడుతున్న ఫాసిజాన్ని వారు ముక్తకంఠంతో వ్యతిరేకించారు. దాని బారినపడకుండా సాహిత్య సాంస్కృతిక రంగాలను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు. అది లండన్‌లో ప్రతిధ్వనించింది. భారతీయ రచయితల చెవినీ సోకింది. 1936 ఫిబ్రవరి 19న లండన్‌లోని రచయితలు సమావేశమయ్యారు. అందులో భారతదేశానికి చెందిన సజ్జాద్ జహీర్, ముల్కరాజ్ ఆనంద్, సేన్ గుప్తా, జ్యోతి ఘోష్ పాల్గొన్నారు. వారు రచయిత లకు ఒక ప్రణాళికను రూపొందించారు. దానిని చర్చించి ఆమోదించారు. సంఘాన్ని స్థాపించారు. ఆ సంఘానికి ప్రోగ్రెసివ్ రైటర్స్ అసోసియేషన్ అని పేరుపెట్టారు. ఈ సంస్థ అంతర్జాతీయ రచయితల సంఘంతో అనుబంధం ఏర్పరుచు కొంది. 1936 ఏప్రిల్ 9న లక్నోలో ప్రముఖ రచయిత ప్రేమ్ చంద్ అధ్యక్షతన 'ప్రగతిశీల్ లేఖక్ సంఘ్' తొలి మహాసభ జరిగింది. ఆ తరువాత 1943లో ఫిబ్రవరి 13,14 తేదీలలో ఆంధ్ర రాష్ట్రం తెనాలిలో తాపీ ధర్మారావు అధ్యక్షతన అభ్యుదయ రచయితల సంఘం తొలి మహాసభలు జరిగాయి. తమ లక్ష్యాలను సాధించడంలో ఈ రచయితల సంఘాలు మాట ద్వారా, పాట ద్వారా, కథ ద్వారా, నాటకం ద్వారా సమస్త ప్రజా కళారూపాలా ద్వారా జనచేతనను రగిలించడంలో నాడు మహత్తర కృషి చేశాయి.

వాటి ఫలితాలు సామాజిక సంస్కరణ ఉద్యమాల కొనసాగింపుతో ప్రారంభమై నాటి కందుకూరి, గురజాడ సాగించిన సాంఘిక, సాహిత్య సంస్కరణ ఉద్యమాల స్ఫూర్తిని అందిపుచ్చుకొంది అరసం. స్వాతంత్ర్య ఉద్యమంలో, అనంతరం జరిగిన సంస్థానాల విలీనం, జమీందారీ జాగీర్దారీ వ్యతిరేక పోరాటలకు బాసటగా నిలిచింది. భూస్వాములకు వ్యతిరేకంగా, దేశ విచ్చిన్నకర శక్తులకు వ్యతిరేకంగా పెట్టుబడి దోపిడీకి వ్యతిరేకంగా, శ్రామిక పేదవర్గాల ఉద్యమాలకు కలమిచ్చి, గళమిచ్చింది అభ్యుదయ రచయితల సంఘం. శ్రీశ్రీ లాంటి మహాకవుల్ని, వేములపల్లి శ్రీకృష్ణ, నాజర్ లాంటి ప్రజాకవుల్ని డా. గరికపాటి రాజారావులాంటి ప్రజా కళాకారుల్ని అందిం చాయి అరసం, ప్రజానాట్యమండలి.

ఈ ఏడాది ప్రగతిశీల్ లేఖక్ సంఘ్ 90వ వార్షికోత్సవం

జరుపుకొంది. ఆంధ్రప్రదేశ్ అరసం 83వ వార్షికోత్సవం జరుపుకొంది. ఇక్కడే మనం ఒక విషయం గమనించాలి. అది ఏమిటంటే దాదాపు 90 ఏళ్లనాటి సంక్షోభాల్ని మళ్లీ ఇప్పుడు ప్రపంచం ఎదుర్కొంటోంది. కాకుంటే ఇది నాటి ఫాసిజానికి ఆధునిక రూపం. ఇందులోనూ ప్రపంచాన్ని ఆవహించిన పెట్టుబడిదే కీలక భూమిక. యుద్ధాలు సంక్షోభాలు, ప్రభుత్వాల పతనాలు, ప్రపంచ పెద్దన్న (అమెరికా) దాదాగిరి, భారత దేశంలో పాలకుల కౌగిట చిక్కి ప్రమాదంలో పడ్డ రాజ్యాంగ వ్యవస్థలు అన్నీ దాని ఫలితమే. ఇది ప్రమాదంవైపు మరో ప్రయాణం. మితిమీరిన ఆర్థిక సంక్షోభం, బలహీనపడుతున్న లౌకికతత్వం, ఆకాశాన్ని అంటుతున్న ధరలు, కరాళ నృత్యం చేస్తున్న నిరుద్యోగం, దిగజారుతున్న నైతిక విలువలు, రగులుతున్న కుల మత విద్వేషాలు, వాటికి ఆజ్యం పోస్తున్న మత రాజకీయాలు. ఇవన్నీ కొన్ని తేడాలతో గడచిపోయిన 1930నే సూచిస్తున్నాయి. కాదు, హెచ్చరిస్తున్నాయి.

ఇక్కడే రచయితల బాధ్యత మరోసారి ముందుకొచ్చింది. ఆ బాధ్యతనే అరసం తన శక్తి మేరకు నిర్వర్తిస్తోంది. ఉద్యమిస్తోంది. భావ సారూప్యత గల మిత్రుల్ని సమీకరిస్తోంది. ఈ చారిత్రక నేపథ్యంలో కొనసాగే ఉద్యమంలో భాగస్వాములు కందని ప్రగతిశీల రచయితల్ని ఆహ్వానిస్తోంది. యువతను తట్టిలేపుతోం ది. తన సాహిత్య సృజనతో సామాజిక చైతన్యాన్ని రగులుగొల్పేం దుకు సన్నద్ధమవుతోంది. అందులో భాగమే మే 23, 24 తేదీల్లో తిరుపతిలో జరిగిన అరసం 20వ రాష్ట్ర మహాసభలు.

కమ్యూనిజానికి కాలం చెల్లిందని చంకలు గుద్దుకుంటున్న నేటి వ్యవస్థ తాను సంక్షోభంలో మునిగిపోతూ అందులోంచి బయట పడేందుకు కమ్యూనిజంకి మూలమైన మార్క్సిజంలోనే మార్గాన్ని వెతుక్కుంటోంది. మార్క్సిజం తాత్వికతను ఆమోదించి అనుసరి స్తున్న అరసం సామాజిక పునరుజ్జీవనానికి తగిన సాహిత్య సాంస్కృతిక ఉద్యమాలను రూపొందించుకొంటోంది. అవసరమైన ఉద్యమాల వైపు ఆ సామాజిక శక్తుల్ని కూడగట్టి ప్రోత్సాహిస్తోంది. అదే అభ్యుదయ సాహిత్య ఉద్యమ లక్షణం, లక్ష్యం. ❑

# అలుపెరుగని అభ్యుదయ సాహిత్య ప్రయాణం

**(41వ పేజీ తరువాయి)**


సంపూర్ణ మద్దతు ఇవ్వడం ఒక పరిణామం. ప్రపంచీకరణ దుష్పరిణామాలను ఎండగట్టడంలో ఆరసం గానీ, అభ్యుదయ సాహిత్యం గానీ వెనకపడలేదు. ఎస్వీ సత్యనారాయణ సంపాద కత్వంలో ప్రపంచీకరణ కథలు పుస్తకం వచ్చింది. ఇటీవల ఢిల్లీలో భారతీయ రైతుల తిరుగుబాటును సమర్థించడంలో అరసం క్రియాశీలక పాత్ర నిర్వహించింది. కవి సమ్మేళనం నిర్వహించి 'హలంతో కలం' కవిత్వ సంకలనం తెచ్చింది. మణిపూర్ మహిళలను దిగంబరంగా ఊరేగించి ఆధిపత్య వాదులు చేసిన అమానుషత్వం మీద అరసం కవి సమ్మేళనం నిర్వహించి 'మణిపూర్ మంటలు' అనే కవితా సంకలనం తెచ్చింది. తెలుగు ప్రజలు బలిదానంతో, 'విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు' నినాదంతో సాధించుకున్న విశాఖపట్నం ఉక్కు కర్మా గారాన్ని పాలకులు ప్రైవేటు వ్యక్తులకు అమ్మేయడానికి ప్రయత్నించినప్పుడు ఆరసం తీవ్రంగా వ్యతిరేకించింది. 'ఉక్కుకవనం' అనే కవితా సంకలనం తెచ్చింది. అరసం వంటి సంస్థ అసంఖ్యాకంగా పుస్తకాలను ప్రచురించడం విశేషం. ఈ తరం కోసం కథ, ఈ తరం కోసం కవిత అనే పేర్లతో గురజాడ నుంచి అనేక మంది ప్రజా రచయితల కవితలను, కథలను దాదాపు 100 సంపుటాలు ప్రచురించింది. ఈ తరం కోసం వచన కవిత, ఈ తరం కోసం గేయ కవిత అనే మరో రెండు సంపుటాలు అరసం ప్రచురించింది. అవి విశేషంగా పాఠకాద రణ పొందాయి. ఇటీవలి గ్రంథాలయ పునరుజ్జీవనోద్యమం లోను, తెలుగు భాషా పరిరక్షణ ఉద్యమంలోను అరసం ఇతర ప్రజాతంత్ర సాహిత్య సంస్థలతో కలిసి కృషి చేసింది. ఇంకా ముందుకుపోతే తెలంగాణ రైతాంగ పోరాటంలోను, జమీందారీ వ్యతిరేక ఉద్యమంలోనూ అభ్యుదయ రచయితలు శ్రామికులు, పీడితులు రైతుల పక్షాన నిలిచారు.


అభ్యుదయ రచయితలు అనగానే శ్రీశ్రీ, ఆరుద్ర, దాశరథి, సోమసుందర్, రెంటాల, సినారె, గంగినేని, కుందుర్తి, నయాగరా కవులు, సురవరం ప్రతాపరెడ్డి, విద్వాన్ విశ్వం, సి.వి, కొడవటిగంటి కుటుంబరావు, మా గోఖలే, లక్ష్మీకాంతం మోహన్, దాశరథి రంగాచార్య, శారద, గజ్జెల మల్లారెడ్డి, ఉప్పల లక్ష్మణరావు, సుంకర వాసిరెడ్డి, సి.వి కృష్ణారావు, కేతు విశ్వనాథరెడ్డి వంటి మహా రచయితలు పాఠకుల ముందు నిలుస్తారు. సృజన సాహిత్యంతోపాటు, సాహిత్య విమర్శలోనూ అభ్యుదయవాదులు అసమాన పాత్ర నిర్వహించారు. ఎం.ఆర్ చంద్ర, కొ.కు, శ్రీశ్రీ, రా.రా, వల్లంపాటి, సింగమనేని, ఆర్వీయార్, కె.వి.ఆర్, కొలకలూరి, వై.విజయకుమార్, నిడమర్తి, సొదుం రామ్మోహన్ వంటి అనేక మంది గుర్తుకొ స్తారు. అరసానిది ఆర్థిక సమానవాదమైనా, సామాజిక న్యాయవాదాన్ని విస్మరించదు. పైగా సామాజిక న్యాయ వాదులతో చేతిలో చేయివేసి నడుస్తున్నది. అందుకే ఈ 20వ మహాసభలను "పురోగామి చింతనాశీలుర ఐక్యతా దిశగా" అనే ప్రధాన అంశం కేంద్రంగా నిర్వహిస్తున్నది. ❑




దేశం కోసం ధర్మం కోసం

హే రామ్..!




సంపద సృష్టికర్తలు

కార్టూన్స్ : సతీష్ ఆచార్య

RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)

Vol : 4 - Issue No : 8 Online Edition May 2026






WE
THE PEOPLE
OF INDIA



